శనివారం
8•6•2019
కరీంనగర్
• వెల. రూ. 6.50
• సంపుటి 8 • సంచిక 344
• పేజీలు : 16 + 16

# నమస్తే తెలంగాణ

మన రాష్ట్రం • మన పత్రిక
WWW. NTNEWS.COM
/NTDAILYONLINE

అద్భుతమైన డిజైన్లలో
మెన్స్ ఎత్నిక్ వేర్
మన కరీంనగర్‌లో
సౌత్ ఇండియా షాపింగ్ మాల్

PUBLISHED FROM KARIMNAGAR I HYDERABAD I WARANGAL I KHAMMAM I NALGONDA I MAHABUBNAGAR I NIZAMABAD



# నేడు కేరళకు నైరుతి

ఆది, సోమవారాల్లో రాష్ట్రవ్యాప్తంగా భారీ నుంచి అతి భారీ వర్షాలు

రెండ్రోజుల్లో ఈశాన్య రాష్ట్రాలకు రుతుపవనాల విస్తరణ: ఐఎండీ

**న్యూఢిల్లీ, జూన్ 7:** నైరుతి రుతుపవనాలు శనివారం (నేడు) కేరళ తీరాన్ని తాకే అవకాశమున్నదని భారత వాతావరణ విభాగం (ఐఎండీ) శుక్రవారం వెల్లడించింది. ఇందుకు పరిస్థితులు అనుకూలంగా ఉన్నాయని తెలిపింది. అలాగే వచ్చే 48 గంటల్లో ఈశాన్య రాష్ట్రాల్లోని పలు ప్రాంతాలకు రుతుపవనాలు విస్తరించే అవకాశం ఉన్నదని పేర్కొంది. రుతుపవనాల రాకతో ఈ నెల 9, 10న కేరళలో భారీ నుంచి అతి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్న దృష్ట్యా ఐఎండీ వరుసగా నారింజ, పసుపు రంగు హెచ్చరికలను జారీ చేసింది. 9న కొల్లాం, అలప్పుజ జిల్లాల్లో భారీ నుంచి అతి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్న నేపథ్యంలో నారింజ హెచ్చరిక.. తిరువనంతపురం, పతినంతిట్ట, కొట్టాయం, ఎర్నాకుళం, ఇడుక్కి, త్రిసూర్, మలప్పురం జిల్లాల్లో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్న దృష్ట్యా పసుపు హెచ్చరిక జారీ చేసినట్లు తెలిపింది. విపత్కర వాతావరణ పరిస్థితుల నేపథ్యంలో ప్రజలు, అధికార యంత్రాంగం అప్రమత్తంగా ఉండాలని ఐఎండీ హెచ్చరించింది. మత్స్యకారులు ఎవరూ సముద్రంలో వేటకు వెళ్లొద్దని సూచించింది. నైరుతి అరేబియా సముద్రంపై గంటకు 45 కి.మీ వేగంతో గాలులు వీచే అవకాశం ఉందని ఐఎండీ తెలిపింది.

# పార్లమెంట్ సమావేశాలకు సహకరించండి

సోనియా గాంధీకి కేంద్ర మంత్రి ప్రహ్లాద్ జోషి విజ్ఞప్తి



ఢిల్లీలో సోనియాగాంధీకి పుష్పగుచ్ఛం అందజేస్తున్న కేంద్రమంత్రులు అర్జున్ రామ్ మేఘ్వాల్, ప్రహ్లాద్ జోషి, నరేంద్రసింగ్ తోమర్

**న్యూఢిల్లీ, జూన్ 7:** పార్లమెంట్ సమావేశాలు సజావుగా సాగేందుకు సహకరించాలని పార్లమెంటరీ వ్యవహారాల శాఖ మంత్రి ప్రహ్లాద్ జోషి కాంగ్రెస్ పార్లమెంటరీ పార్టీ అధినాయకురాలు సోనియా గాంధీని కోరారు. ఈ నెల 17 నుంచి పార్లమెంట్ వర్షాకాల సమావేశాలు ప్రారంభంకానున్న నేపథ్యంలో.. ఆయన శుక్రవారం ఢిల్లీలోని ఆమె నివాసానికి వెళ్లి మర్యాదపూర్వకంగా కలిశారు. కేంద్ర మంత్రులు నరేంద్ర సింగ్ తోమర్, అర్జున్ రామ్ మేఘవాల్ కూడా ఆయన వెంట ఉన్నారు. అనంతరం ప్రహ్లాద్ జోషి మీడియాతో మాట్లాడుతూ.. 'సోనియాతో మా భేటీ సాధారణమే. పార్లమెంట్ సమావేశాలు సజావుగా కొనసాగేందుకు సహకరించాలని కోరాం. ప్రతిపక్షం కూడా ప్రభుత్వం నుంచి అలాంటి సహకారాన్నే ఆశిస్తున్నదని సోనియా చెప్పగా.. ప్రభుత్వం తరుపున ఎలాంటి సహకారమైనా అందించేందుకు సిద్ధమని వివరించాం' అని ఆయన తెలిపారు. రాజ్యసభలో విపక్షనేత గులాం నబీ ఆజాద్, లోక్‌సభలో డీఎంకే పక్షనేత టీఆర్ బాలును కూడా ప్రహ్లాద్ జోషి కలిశారు. కాగా 17వ లోక్‌సభ తొలి సమావేశాలు ఈ నెల 17 నుంచి జులై 26 వరకు కొనసాగనున్నాయి. తొలి రెండు రోజులు కొత్త ఎంపీల ప్రమాణం, 19న లోక్‌సభ స్పీకర్ ఎన్నిక జరుగుతుంది. జూన్ 20న రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్ ఉభయ సభలనుద్దేశించి ప్రసంగిస్తారు. ఇక జులై 5న కేంద్రం బడ్జెట్‌ను ప్రవేశపెట్టనున్నది.

# మోదీ-దీదీ మధ్య పోస్ట్‌కార్డు యుద్ధం!

'జై శ్రీరామ్' వ్యాఖ్యలతో మమతకు బీజేపీ నేతలు..

'జై హింద్, జై బంగ్లా' నినాదాలతో ప్రధానికి టీఎంసీ కార్యకర్తలు..

కాళీఘాట్ పోస్టాఫీసును ముంచెత్తుతున్న వేలాది పోస్ట్‌కార్డులు



మోదీకి రాసిన పోస్ట్ కార్డులను చూపుతున్న తృణమూల్ కార్యకర్తలు

**కోల్‌కత, జూన్ 7:** వాట్సాప్ సందేశాల కాలంలో పోస్ట్ కార్డులను ఎవరూ అంతగా వాడట్లేదు. అయితే, రాజకీయ పార్టీల వల్ల వీటికి ఉన్నపళంగా గిరాకీ పెరిగింది. 'జై శ్రీరామ్' అంటూ నినదించిన వారిపై పశ్చిమబెంగాల్ సీఎం, తృణమూల్ కాంగ్రెస్(టీఎంసీ) అధినేత్రి మమత బెనర్జీ ఆగ్రహం వ్యక్తం చేయడంతో.. బీజేపీ నేతలు 'జై శ్రీరామ్' వ్యాఖ్యలు రాసిన పోస్ట్ కార్డులను ఆమెకు విరివిగా పంపిస్తున్నారు. మమత నివాసం దక్షిణ కోల్‌కతాలోని కాళీఘాట్ పోస్టాఫీస్ పరిధిలో ఉంది. ఈ పోస్టాఫీసుకు 'జై శ్రీరామ్' అని రాసిన పోస్ట్ కార్డులు వేలల్లో వస్తున్నాయి. గురువారం 4,500 జై శ్రీరామ్ పోస్ట్ కార్డులు మమత చిరునామాకు వచ్చాయని ఓ తపాలాధికారి తెలిపారు. బీజేపీ 'జై శ్రీరామ్'కు దీటుగా తృణమూల్ కార్యకర్తలు 'జై హింద్, జై బంగ్లా' నినాదాలతో పోస్ట్ కార్డులను ప్రధాని మోదీకి పంపుతున్నారని ఆ పార్టీ నాయకుడు జ్యోతిప్రియో మల్లిక్ తెలిపారు.



# యూపీలో కిరాతకం



10 వేల బాకీ చెల్లించలేదని మూడేండ్ల బాలిక దారుణ హత్య

- కాళ్లు, చేతులు విరిచి చిత్రహింసలు
- హత్యచేసి.. మృతదేహాన్ని చెత్తకుండీలో పడేసిన కిరాతకులు
- ఇద్దరు నిందితుల అరెస్ట్
- విధుల్లో నిర్లక్ష్యం వహించిన ఐదుగురు పోలీసుల సస్పెన్షన్
- ఉత్తర్‌ప్రదేశ్‌లోని అలీగఢ్‌లో దారుణం

**లక్నో/అలీగఢ్, జూన్ 7:** మానవత్వానికే మాయని మచ్చ.. డబ్బు కోసం ఎంతకైనా దిగజారే మనుషులున్నారనడానికి ప్రత్యక్ష నిదర్శనం.. క్రూరత్వానికి పరాకాష్ట వంటి ఘటన ఉత్తర్‌ప్రదేశ్‌లోని అలీగఢ్‌లో బయటపడింది. రూ.10 వేల బాకీ చెల్లించలేదని ఇద్దరు మానవ మృగాలు కలిసి మూడేండ్ల చిన్నారిని దారుణంగా హత్యచేశారు. ముక్కుపచ్చలారని బాలికను చిత్రహింసలు పెట్టి రాక్షస ఆనందం పొందారు. కాళ్లు, చేతులు విరగ్గొట్టి కిరాతకంగా చంపి.. చెత్తకుండీలో పడేశారు. కుక్కలు ఆ శవాన్ని పీక్కు తింటుండగా స్థానికులు గుర్తించి పోలీసులకు సమాచారం ఇవ్వడంతో హత్య వెలుగులోకి వచ్చింది. అత్యంత హృదయవిదారక ఈ ఘట న దేశవ్యాప్తంగా సంచలనం సృష్టించింది. సామాన్యుల నుంచి ప్రముఖులు, రాజకీయ నేతల వరకు ప్రతి ఒక్కరూ ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. నిందితులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేస్తున్నారు. పోలీసులు ఇద్దరు నిందితులను అరెస్ట్ చేశారు.

అలీగఢ్ శివారులోని తప్పల్ టౌన్‌షిప్ నివాసి భన్వరిలాల్ శర్మ.. జహీద్ అనే వ్యక్తి వద్ద రూ.50 వేలు అప్పుగా తీసుకుని.. రూ.40 వేల వరకు చెల్లించారు. మిగతా రూ.10 వేలు చెల్లించాలని భన్వరిలాల్‌పై జహీద్ కొన్నాళ్లుగా ఒత్తిడి తెస్తున్నాడు. దీనిపై వారిద్దరి మధ్య గొడవలూ జరుగుతున్నాయి. గత నెల 30న భన్వరిలాల్ కూతురు ట్వింకిల్ శర్మ (3) అదృశ్యమైంది. కుటుంబం, బంధువులు, స్థానికులు రోజంతా గాలించినా ఆచూకీ దొరుకలేదు. దీంతో మరునాడు ఉదయం వారు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. మూడు రోజులకు.. ఈ నెల 2వ తేదీన తప్పల్ టౌన్‌షిప్ సమీపంలోని ఓ చెత్త కుండీ సమీపంలో కుక్కలు ఓ చిన్నారి మృతదేహన్ని పీక్కుతినడాన్ని చూసిన స్థానికులు పోలీసులకు సమాచారం ఇచ్చారు. దర్యాప్తులో ఆ మృతదేహం ట్వింకిల్‌దని తేలింది. చిన్నారి కనుగుడ్లు పెరికి, కాళ్లు చేతులు విరిచేసి కిరాతకంగా హత్య చేశారని తల్లిదండ్రులు ఆరోపించారు. పోస్ట్‌మార్టం నివేదికలోనూ చిన్నారిని చిత్రహింసలకు గురిచేసి హత్యచేశారని నిర్ధారణైంది.కనుగుడ్లు పెరుకలేదని.. కుక్కలు పీక్కుతినడంతో అలా అనిపించిందని పోలీసులు చెప్పారు. లైంగికదాడి జరుగలేదన్నారు. జహీద్ తన అనుచరుడు అస్లాంతో కలిసి బాలికను కిడ్నాప్ చేశాడని, హత్య చేశాడని నిర్ధారించారు. ఈ మేరకు వారిద్దరినీ అరెస్ట్ చేసి, రిమాండ్‌కు తరలించారు. వారిపై 'ఎన్ఎస్ఏ' కింద కేసులు నమోదు చేసినట్టు అలీగఢ్ స్పెషల్ సూపరింటెండెంట్ ఆఫ్ పోలీస్ (ఎస్సెస్పీ) ఆకాశ్ కుల్హారి తెలిపారు. తమ కూతురు హత్యలో జహీద్ కుటుంబానికి చెందిన ఇతర వ్యక్తుల పాత్ర కూడా ఉన్నదని, వారికి తెలియకుండా హత్య జరిగే అవకాశమే లేదని భన్వరిలాల్ అన్నారు. శనివారం నుంచి ఆమరణ నిరాహారదీక్ష చేపడుతానని, వారిని అరెస్ట్ చేసేవరకు విరమించనన్నారు. బాలిక అదృశానికి రెండు రోజుల ముందే జహీద్ తమతో గొడవ పెట్టుకున్నాడని.. చంపేస్తానని బెదిరించాడని బాధిత కుటుంబం తెలిపింది. ఎస్సెస్పీ ఆకాశ్.. భన్వరిలాల్‌ను కలిసి ఓదార్చారు. ఫాస్ట్ ట్రాక్ కోర్టు ఏర్పాటు చేసి త్వరగా న్యాయం జరిగేలా ప్రయత్నిస్తామని, దీక్షకు దిగవద్దని కోరారు. కాగా, నిందితులను కఠినంగా శిక్షించాలన్న డిమాండ్‌తో కుటుంబసభ్యులు, బంధువులు, స్థానికులు పెద్ద ఎత్తున నిరసన చేపట్టారు.

**ఐదుగురు అధికారుల సస్పెన్షన్**

చిన్నారి హత్య ఘటనలో తప్పల్ పోలీస్‌స్టేషన్ ఎస్‌హెచ్‌వోతోపాటు ఐదుగురు పోలీస్ అధికారులను సస్పెండ్ చేసినట్టు ఎస్సెస్పీ ఆకాశ్ తెలిపారు. బాలిక అదృశ్యమైందని తల్లిదండ్రులు ఫిర్యాదు చేసినప్పుడు ఆలస్యంగా కేసు రిజిస్టర్ చేశారన్నారు. దర్యాప్తులో నిర్లక్ష్యం వహించినందుకు వారిని సస్పెండ్ చేశామని చెప్పారు. పోస్ట్‌మార్టం నివేదిక ప్రకారం బాలికపై ఎలాంటి లైంగిక దాడి జరుగలేదన్నారు. ఈ ఘటనపై ప్రజాగ్రహం పెరుగుతుండటంతో యూపీ సర్కార్ ఆరుగురు సభ్యులతో కూడిన ప్రత్యేక దర్యాప్తు బృందాన్ని (సిట్) ఏర్పాటుచేసింది. ఈ ఘటనపై జాతీయ బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ (ఎన్‌సీపీసీఆర్) స్పందించింది. నివేదికను సమర్పించాలని ఎస్సెస్పీ ఆకాశ్‌ను ఆదేశించింది. లోతుగా దర్యాప్తు జరుపాలని, నిందితులపై కఠిన చర్యలు తీసుకోవాలని ఆదేశించింది.




అలీగఢ్‌లో ఆందోళన చేస్తున్న స్థానికులు.. 'జస్టిస్ ఫర్ ట్వింకిల్' ప్లకార్డు ప్రదర్శిస్తున్న నటుడు అనుపమ్ ఖేర్

## దేశవ్యాప్తంగా ఆగ్రహజ్వాలలు

బాలికను క్రూరంగా హింసించి, హత్య చేసిన ఘటనపై దేశవ్యాప్తంగా ప్రజల్లో ఆగ్రహం పెల్లుబుకుతున్నది. నిందితులను కఠినంగా శిక్షించాలని పలుచోట్ల ప్రదర్శనలు నిర్వహిస్తున్నారు. నెటిజన్లు భారీగా నిరసన తెలుపుతున్నారు. చిన్నారి పేరుతో సృష్టించిన హ్యాష్ ట్యాగ్‌కు తమ కామెంట్లు జతచేసి పోస్ట్‌లు పెడుతున్నారు. ఈ ఘటనపై ఇప్పటివరకు 56వేలకు పైగా ట్వీట్లు నమోదయ్యాయి. కాంగ్రెస్ అధ్యక్షుడు రాహుల్ గాంధీ స్పందిస్తూ.. చిన్నారి దారుణ హత్య తనను షాక్‌కు గురిచేసిందని, ఎంతో కలిచివేసిందని ట్వీట్ చేశారు. మనిషన్నవాడెవడూ ఇంత క్రూరంగా ప్రవర్తించడని ఆగ్రహం వ్యక్తం చేశారు. కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి ప్రియాంకాగాంధీ ఈ హత్య మానవత్వానికే మాయని మచ్చ అని అభివర్ణించారు. 'అభంశుభం ఎరుగని చిన్నారిని క్రూరంగా హింసించారు. మన సమాజం ఎటు పోతున్నది' అని ట్వీట్ చేశారు. చిన్నారి హత్య సమాజానికే సిగ్గుచేటని బీఎస్పీ అధినేత్రి మాయావతి ఆవేదన వ్యక్తం చేశారు. చిన్నారి హత్యోదంతం తనను కలిచివేసిందని కేంద్ర మంత్రి స్మృతి ఇరానీ అన్నారు. నిందితులకు త్వరగా శిక్ష పడేలా యూపీ ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని హామీ ఇచ్చారు. ఈ ఘటనపై పలువురు బాలీవుడ్ తారలూ ఆవేదన వ్యక్తం చేశారు. ఈ ఘటన గురించి తెలిసినప్పటి నుంచి కోపంగా, బాధగా, భయంగా ఉన్నదని హీరో అక్షయ్‌కుమార్ ట్వీట్‌చేశారు. 'ఇది కచ్చితంగా మనం మన పిల్లలకందించాల్సిన ప్రపంచం కాదు. నిందితులను కఠినంగా శిక్షించాలి' అని అన్నారు. ఆయన భార్య ట్వింకిల్ ఖన్నా, నటులు అనుపమ్ ఖేర్, అభిషేక్ బచ్చన్, ఆయుష్మాన్ ఖురానా, సిద్దార్థ్ మల్హోత్రా, రితేశ్ దేశ్‌ముఖ్, జావెద్ అక్తర్, షబానా ఆజ్మీ, సోనమ్‌కపూర్, హ్యూమా ఖురేషీ, జెనీలియా, సన్నీ లియోన్ తదితరులు బాధిత కుటుంబానికి సంతాపం తెలిపారు.

# పేలుళ్ల గురించి తెలియదు



మాలేగావ్ పేలుళ్ల కేసులో ప్రజ్ఞాసింగ్ వాంగ్మూలం

**ముంబై, జూన్ 7:** మాలేగావ్ పేలుళ్ల కేసులో ప్రధాన నిందితురాలు, భోపాల్ బీజేపీ ఎంపీ ప్రజ్ఞాసింగ్ ఠాకూర్.. ఆ పేలుళ్ల గురించి తనకు ఏమీ తెలియదని వాంగ్మూలం ఇచ్చారు. శుక్రవారం ఎన్ఐఏ ప్రత్యేక కోర్టు విచారణకు ప్రజ్ఞాసింగ్‌తోపాటు మరో ఇద్దరు నిందితులు సుధాకర్ ధార్ ద్వివేది, సమీర్ కులకర్ణి హాజరయ్యారు. అస్వస్థతతో ఉన్న ప్రజ్ఞాసింగ్‌కు కోర్టు హాలు వెనుక కూర్చునేందుకు కుర్చీ ఏర్పాటు చేస్తామని ఎన్ఐఏ కోర్టు జడ్జి వీఎస్ పడాల్కర్ చెప్పినా ఆమె తిరస్కరించారు. విచారణ జరిగిన రెండున్నర గంటల సేపు నిలుచున్నారు. తనకు వేసిన కుర్చీలో కూర్చుంటే జీవితమంతా మంచానికే పరిమితం అయ్యే పరిస్థితి వస్తుందన్నారు. ప్రజ్ఞాసింగ్ కనీసం వారానికి ఒకసారైనా విచారణకు హాజరు కావాలని జడ్జి వీఎస్ పడాల్కర్ స్పష్టం చేశారు.

# నీతి ఆయోగ్ భేటీకి రాను


మోదీకి పశ్చిమబెంగాల్ సీఎం మమతాబెనర్జీ లేఖ



**కోల్‌కతా, జూన్ 7:** ప్రధాని మోదీ అధ్యక్షతన ఈ నెల 15న జరిగే నీతి ఆయోగ్ భేటీకి హాజరయ్యేందుకు పశ్చిమబెంగాల్ సీఎం, తృణమూల్ కాంగ్రెస్ అధినేత్రి మమతా బెనర్జీ నిరాకరించారు. ఈ మేరకు శుక్రవారం ఆమె ప్రధాని మోదీకి లేఖ రాశారు. రాష్ట్ర ప్రణాళికలకు సహరించేందుకు నీతి ఆయోగ్‌కు ఏ ఆర్థిక అధికారాలు లేనందున ఈ భేటీకి హాజరుకావడం వృథా అన్నారు. బెంగాల్‌లో రాజకీయ హింస వల్ల 54 మంది చనిపోయారని బీజేపీ నేతలు అసత్య ప్రచారం చేస్తున్నారంటూ ఆమె గత నెల 30న ప్రధాని మోదీ ప్రమాణానికి గైర్హాజరైన విషయం తెలిసిందే. తాజాగా నీతి ఆయోగ్ భేటీకీ ఆమె గైర్హాజరు కానుండడం గమనార్హం. సమాఖ్య సహకారం పెంపుదల, సమాఖ్య రాజకీయాల బలోపేతా నికి అంతర్రాష్ట్ర మండలిపై దృష్టిపెట్టాలని ప్రధానికి ఆమె సూచించారు. జాతీయ అభివృద్ధి మండలి (ఎన్‌డీసీని)నీ అంతర్రాష్ట్ర మండలి కిందకు తేవాలని సూచించారు. న్యాయమూర్తుల నియామకానికి సుప్రీంకోర్టు కొలీజియం మాదిరే ఎన్నికల కమిషనర్ల నియామకానికీ కొలీజియం తరహా వ్యవస్థ ఏర్పాటుచేయాలని డిమాండ్ చేశారు. ప్రణాళికా సంఘం స్థానే నీతి ఆయోగ్ ఏర్పాటు చేయడంపై అసంతృప్తి వ్యక్తం చేస్తూ గతంలోనూ మమత పలు సమావేశాలకు హాజరుకాలేదు. తాజాగా మమత నిర్ణయంపై బీజేపీ తీవ్ర విమర్శలు గుప్పించింది.ఓటమిని జీర్ణించుకోలేక ప్రతిదాన్నీ రాజకీయం చేస్తున్నారనని, అభివృద్ధిని అడ్డుకుంటున్నారని బీజేపీ బెంగాల్ అధ్యక్షుడు దిలీప్ ఘోష్ విమర్శించారు.

# కాంగ్రెస్ పగ్గాలు స్వీకరిస్తా..!

మాజీ హాకీ ఆటగాడు అస్లాం షేర్ ఖాన్ ప్రతిపాదన



**న్యూఢిల్లీ:** అవకాశం ఇస్తే కాంగ్రెస్ పార్టీ అధ్యక్ష పదవిని రెండేండ్ల పాటు చేపడుతానని ఒలింపిక్ క్రీడల్లో భారత్ తరుపున ఆడిన మాజీ హాకీ ఆటగాడు, మాజీ కేంద్ర మంత్రి అస్లాం షేర్ ఖాన్ పేర్కొన్నారు. కాంగ్రెస్ అధ్యక్షునిగా ఎవరూ బాధ్యతలు చేపట్టడానికి ముందుకురాని పక్షంలో తాను పార్టీ పగ్గాలు చేపడుతానని.. కాంగ్రెస్ అధ్యక్షుడు రాహుల్ గాంధీకి గురువారం రాసిన ఓ లేఖలో అస్లాం పేర్కొన్నారు. 'మానవత్వంతో ఆలోచించి నా సేవలను కాంగ్రెస్ పార్టీకి పునరంకితం చేయాలనుకుంటున్నాను. ఆ పార్టీ తాత్కాలిక అధ్యక్షునిగా రెండేండ్ల పాటు బాధ్యతలు స్వీకరించాలనుకుంటున్నాను' అని ఆయన లేఖలో తెలిపారు. తన క్రీడా, రాజకీయ అనుభవాన్ని దృష్టిలో పెట్టుకొనే తాను ఈ ప్రతిపాదన చేశానని అస్లాం చెప్పారు. బీజేపీకి ధీటుగా కాంగ్రెస్ తయారవ్వాలంటే, ఆ పార్టీ మళ్ళీ జన హృదయాన్ని గెలుచుకోవాలని, 1975లో ప్రపంచ హాకీకప్‌ను భారత్ కైవసం చేసుకున్నదని, ఆ గెలుపుతో ఒక హాకీ ఆటగాడిగా తన సామర్థ్యాన్ని నిరూపించుకున్నానని అస్లాం తెలిపారు.

# దుబాయ్‌లో ఘోర ప్రమాదం

- 17 మంది మృతి, 9 మందికి గాయాలు
- మృతుల్లో 12 మంది భారతీయులు
- సహాయ చర్యలు చేపట్టిన భారతీయ కాన్సులేట్ అధికారులు



దుబాయ్‌లో జరిగిన రోడ్డు ప్రమాదంలో ధ్వంసమైన బస్సు

**దుబాయ్, జూన్ 7:** అరబ్ దేశమైన దుబాయ్‌లో ఘోర బస్సు ప్రమాదం జరిగింది. ఈ ఘటనలో 17 మంది చనిపోగా 9 మందికి తీవ్ర గాయాలయ్యాయి. మృతుల్లో 12 మంది భారతీయులున్నట్లు దుబాయ్ పోలీసు యంత్రాంగంతోపాటు భారతీయ రాయబార కార్యాలయం శుక్రవారం వెల్లడించింది. 31 మంది ప్రయాణికులతో ఓమన్ రాజధాని మస్కట్ నుంచి వస్తున్న బస్సు గురువారం సాయంత్రం దుబాయ్‌లోని రాషిదియా మెట్రో స్టేషన్ సమీపంలో ప్రమాదానికి గురైంది. అతి వేగం కారణంగా అదుపు తప్పిన బస్సు రాంగ్ రూట్‌లోకి దూసుకొచ్చింది. ట్రాఫిక్ సిగ్నల్‌ను దాటుకుని బారియర్‌ను బలంగా ఢీకొట్టింది. దీంతో బస్సు ముందు భాగం చీలిపోగా ఎడమవైపు ఉన్న ప్రయాణికులు మృత్యువాతపడ్డారు. మృతుల్లో మరి కొందరిని గుర్తించాల్సి ఉందని, చనిపోయిన భారతీయుల సంఖ్య పెరిగే అవకాశముందని దుబాయ్ పోలీస్ అధికారులు వెల్లడించారు. కాగా బస్సు ప్రమాదంలో మృతి చెందిన భారతీయుల సంఖ్య తొలుత 8గా పేర్కొనగా తర్వాత ఆ సంఖ్య 12కు పెరిగినట్టు దుబాయ్‌లోని భారతీయ కాన్సులేట్ జనరల్ విపుల్ ట్వీట్ చేశారు. మృతుల పేర్లను కూడా ఆయన తెలిపారు.

**బాధితులకు అండగా ఉంటాం: జైశంకర్**

బస్సు ప్రమాదంలో భారతీయుల మృతిపట్ల భారత విదేశాంగ మంత్రి జైశంకర్ ట్విట్టర్‌లో బాధిత కుటుంబాలకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. మృతదేహాలను స్వదేశానికి రప్పించేందుకు అన్ని ఏర్పాట్లు చేస్తున్నట్లు ఆయన వెల్లడించారు. దుబాయ్ పోలీస్ డైరెక్టర్ జనరల్ కార్యాలయం కూడా బస్సు ప్రమాదంపై తీవ్ర సంతాపం వ్యక్తం చేసింది. మరోవైపు బస్సు ప్రమాదం నేపథ్యంలో మస్కట్ నుంచి దుబాయ్‌కి తమ సర్వీసులను తాత్కాలికంగా నిలిపివేసినట్లు మ్వాసాలత్ ట్రాన్స్‌పోర్ట్ కంపెనీ ట్విట్టర్‌లో వెల్లడించింది. అలాగే బాధిత కుటుంబాలకు సంతాపం తెలపడంతోపాటు గాయపడిన ప్రయాణికులు త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించింది. కాగా కొందరు ఈద్ సెలవులకు వెళ్లి తిరిగి వస్తూ బస్సు ప్రమాదంలో మృతిచెందడంతో వారి కుటుంబాల్లో విషాదం నెలకొంది.

## బాధిత కుటుంబాలకు హెల్ప్‌లైన్

మృతిచెందిన భారతీయుల్లో విక్రమ్ జవహర్ ఠాకూర్, విమల్ కుమార్ కార్తికేయన్ కేశవపిలైకర్, కిరణ్ జానీ, ఫిరోజ్ ఖాన్ అజీజ్ పఠాన్, రేష్మా ఫిరోజ్ ఖాన్ పఠాన్, వాసుదేవ్ విష్ణుదాస్, రాజన్ గోపాలన్, జమాలుద్దీన్ అరక్కవీత్తిల్, ప్రబులా మాధవన్ దీపా కుమార్, రోషిణి మూల్‌చందాని,ఉమ్మెర్ మహ్మద్ పుతెన్, నబిల్ ఉమ్మెర్ ఉన్నారు. కాగా గాయపడిన భారతీయుల్లో దవాఖానలో ప్రాథమిక చికిత్స అనంతరం నలుగురు డిశ్చార్జ్ కాగా రషీద్ దవాఖానలో మరో ముగ్గురు చికిత్స పొందుతున్నట్లు భారతీయ కాన్సులేట్ జనరల్ విపుల్ తెలిపారు. బాధిత కుటుంబాలకు భారతీయ రాయబార కార్యాలయం అండగా ఉంటుందన్నారు. సహాయం కోసం +971-565463903 హెల్ప్‌లైన్ నంబర్‌ను అందుబాటులోకి తెచ్చినట్లు వివరించారు.

## యూపీలో దుమ్ముతుఫాన్.. 26 మంది మృతి

**లక్నో, జూన్ 7:** ఉత్తర్‌ప్రదేశ్‌లోని వివిధ ప్రాంతాల్లో సంభవించిన దుమ్ము తుఫాన్ వల్ల 26 మంది మరణించారు. మరో 57 మంది గాయపడ్డారు. గురువారం రాత్రి వచ్చిన దుమ్ము తుఫాన్ వల్ల వేర్వేరు ప్రాంతాల్లో మట్టి ఇండ్ల గోడలు కూలిపోయాయి. చెట్లు విరిగి పడ్డాయి. పిడుగులు పడ్డాయి. మెయిన్‌పురి జిల్లాలో వేర్వేరు ఘటనల్లో ఆరుగురు మరణించగా, 41 మంది గాయపడ్డారు. రోడ్లపై చెట్లు విరిగి పడటంతో జాతీయ రహదారులపై ట్రాఫిక్ స్తంభించి పోయింది. మట్టి ఇండ్లలో నివసిస్తున్న వారి ఇంటి గోడలు కూలిపోవడం వల్ల గాయపడ్డారని పోలీసులు తెలిపారు. ఇంకా పలుచోట్ల రోడ్లపై ఏర్పాటు చేసిన సైన్ బోర్డులు, హోర్డింగ్‌లు కూలిపోవడంతో పలువురు క్షతగాత్రులయ్యారు. రాష్ట్ర వ్యాప్తంగా 16 ఇండ్లు దెబ్బ తిన్నాయి. దుమ్ము తుఫాన్ వల్ల రాజధాని లక్నో నగరంతోపాటు రాష్ట్రమంతటా విద్యుత్ లైన్లు తెగిపోవడంతో విద్యుత్ కోతలు విధించారు. బాధితులకు అవసరమైన అన్ని రకాల సహాయ చర్యలు చేపట్టాలని అధికారులను యూపీ సీఎం యోగి ఆదిత్యనాథ్ ఆదేశించారు. సహాయ కార్యక్రమాలను పర్యవేక్షించాలని సంబంధిత జిల్లా ఇన్‌చార్జి మంత్రులకు దిశా నిర్దేశం చేశారు. దుమ్ము తుఫాన్ వల్ల మరణించిన వారి కుటుంబాలకు రూ.4 లక్షల చొప్పున ఆర్థిక సాయం అందజేయాలని అధికారులను ఆదేశించారు.

# జోరువానలో రాహుల్ రోడ్‌షో

- బ్రహ్మరథం పట్టిన వయనాడ్ ప్రజలు
- బీజేపీ ద్వేషాన్ని ప్రేమతో ఎదుర్కొంటా: రాహుల్




వయనాడ్‌లో వర్షంలోనూ రాహుల్‌కు స్వాగతం పలుకుతున్న స్థానికులు

ప్రజలకు రాహుల్‌గాంధీ అభివాదం

**మలప్పురం, జూన్ 7:** లోక్‌సభ ఎన్నికల్లో తనను భారీ మెజార్టీతో గెలిపించిన కేరళలోని వయనాడ్ నియోజకవర్గ ప్రజలకు కృతజ్ఞతలు తెలిపేందుకు కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు రాహుల్‌గాంధీ శుక్రవారం జోరు వానను సైతం లెక్కచేయకుండా వయనాడ్‌లో రోడ్ షో నిర్వహించారు. పార్టీ నేతలతో కలిసి ప్రత్యేక ఓపెన్ టాప్ వాహనంలో కలికావ్‌లోని ఇరుకు సందుల్లో భారీ జనసందోహానికి అభివాదం చేస్తూ ముందుకుసాగారు. లోక్‌సభ ఎన్నికల్లో రెండు స్థానాల నుంచి పోటీచేసిన రాహుల్.. కాంగ్రెస్‌కు కంచుకోట అయిన ఉత్తర్‌ప్రదేశ్‌లోని అమేథీ నియోజకవర్గంలో కేంద్రమంత్రి, బీజేపీ అభ్యర్థి స్మృతీ ఇరానీ చేతిలో ఓటమిపాలైనప్పటికీ, వయనాడ్‌లో మాత్రం 4.31 లక్షల రికార్డు మెజార్టీతో గెలుపొందాక ఇక్కడకు రావడం ఇదే మొదటిసారి. 'వయనాడ్ ప్రజల తరపున పోరాడుతా. పార్లమెంటు లోపల, వెలుపల వయనాడ్ సమస్యలను లేవనెత్తుతా. నియోజకవర్గం కోసం పనిచేస్తా. మీ సమస్యలు వింటా. మీతో కలిసి పనిచేస్తా. నా పట్ల మీ ప్రేమాభిమానాలకు కృతజ్ఞతలు' అని రాహుల్ పేర్కొన్నారు. 'మోదీ వద్ద భారీగా డబ్బు ఉండొచ్చు. మీడియా ఆయన వెనుక ఉండొచ్చు. ఆయనకు సంపన్న స్నేహితులు ఉండవచ్చు. కానీ బీజేపీ వ్యాప్తిచేస్తున్న అసహనానికి వ్యతిరేకంగా కాంగ్రెస్ పోరాడుతుంది' అని రాహుల్ వ్యాఖ్యానించారు.

# థెరెసా మే రాజీనామా

పార్టీ నాయకత్వం నుంచి తప్పుకున్న బ్రిటన్ ప్రధాని



**లండన్, జూన్ 7:** బ్రెగ్జిట్‌పై ఏకాభిప్రాయం సాధించడంలో విఫలమైన నేపథ్యంలో ప్రధాని పదవి నుంచి తప్పుకుంటానని రెండు వారాల కిందట ప్రకటించిన బ్రిటన్ ప్రధాని థెరెసా మే ఆ దిశగా కీలక నిర్ణయం తీసుకున్నారు. అధికార కన్జర్వేటివ్ పార్టీ నాయకత్వ బాధ్యతల నుంచి ఆమె తప్పుకున్నారు. ఈ మేరకు శుక్రవారం బ్యాక్‌బెంచ్ 1922 కమిటీకి ఆమె రాజీనామా సమర్పించారు. పార్టీ సారథిగా మరొకరిని ఎన్నుకునేంత వరకు ఆమె ప్రధానిగా కొనసాగనున్నారు. విదేశాంగ మాజీ కార్యదర్శి బోరిస్ జాన్సన్ సహా 11 మంది ఈ పదవికి పోటీపడుతున్నారు. విదేశాంగ కార్యదర్శి జెరెమీ హంట్, పర్యావరణ కార్యదర్శి మైఖెల్ గోవ్ కూడా ముందంజలో ఉన్నారు. జూలై మూడో వారంలో విజేతను ప్రకటించే అవకాశం ఉన్నది. 2016 జూన్‌లో నిర్వహించిన బ్రెగ్జిట్ రెఫరెండం అనంతరం నాటి ప్రధాని డేవిడ్ కామెరూన్ నుంచి బాధ్యతలు స్వీకరించిన థెరెసా మే.. సుమారు మూడేండ్ల పాటు ఆ పదవిలో ఉన్నారు. బ్రెగ్జిట్‌పై గడువు అక్టోబర్ 31తో ముగియనుండడంతో.. ఆ లోపు ఒప్పందాన్ని కొలిక్కి తేవడం కొత్త సారథికి సవాలే.

## చర్చల ద్వారా పరిష్కరించుకుందాం: ఇమ్రాన్ ఖాన్

**ఇస్లామాబాద్:** కశ్మీర్‌తోపాటు అన్ని సమస్యలను చర్చల ద్వారా పరిష్కరించుకుందామని భారత ప్రధాని నరేంద్రమోదీకి పాక్ ప్రధాని ఇమ్రాన్ ఖాన్ శుక్రవారం లేఖ రాశారు. బిష్కెక్‌లో జరుగనున్న షాంఘై కోఆపరేషన్ సదస్సులో ఇరు దేశాల ప్రధానులు సమావేశమయ్యే అవకాశం లేదని భారత్ ప్రకటించిన మరునాడే ఆయన లేఖ రాయడం గమనార్హం. మోదీ రెండో సారి ప్రధానిగా ఎన్నికయ్యాక ఇమ్రాన్ చర్చలకు పిలుపునివ్వడం ఇది రెండోసారి. కాగా.. స్పైస్ 2000 గైడెడ్ బాంబుల కొనుగోలుకు ఇజ్రాయెల్‌తో భారత వాయుసేన (ఐఏఎఫ్) రూ.300 కోట్లతో ఒప్పందం కుదుర్చుకున్నది.

శనివారం
8•6•2019
కరీంనగర్

# నమస్తే తెలంగాణ

మన రాష్ట్రం • మన పత్రిక

PUBLISHED FROM KARIMNAGAR | HYDERABAD | WARANGAL | KHAMMAM | NALGONDA | MAHABUBNAGAR | NIZAMABAD

WWW. NTNEWS.COM
/NTDAILYONLINE






సంబురాల్లో
టీఆర్ఎస్
శ్రేణులు

**430/538**

శుక్రవారం కరీంనగర్‌లో విజయోత్సవ ర్యాలీలో టీఆర్ఎస్ జెండాను ప్రదర్శిస్తున్న ఎమ్మెల్యే గంగుల కమలాకర్



ఎంపీపీ అధ్యక్ష పీఠాల్లో టీఆర్ఎస్ ప్రభంజనం

# గులాబీ మండలాధీశులు

## 430 ఎంపీపీలు టీఆర్ఎస్ కైవసం

### ఆరు జిల్లాల్లో కారు క్లీన్‌స్వీప్ • 10 జిల్లాల్లో ఖాతా తెరవని కాంగ్రెస్

నేడు జిల్లా పరిషత్ చైర్మన్ల ఎన్నిక • అన్ని జిల్లాల్లో టీఆర్ఎస్‌కే మెజార్టీ • చైర్మన్ల ఎన్నిక లాంఛనమే

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:**

ఎంపీపీ ఎన్నికల్లో గులాబీ గుబాళించింది. టీఆర్ఎస్ ప్రభంజనం ముందు మిగిలిన పార్టీలు చతికిలపడ్డాయి. రాష్ట్రంలో అత్యధిక సంఖ్యలో ఎంపీటీసీలను గెల్చుకున్న టీఆర్ఎస్.. అందుకు అనుగుణంగానే ఎంపీపీ అధ్యక్ష స్థానాలను కూడా భారీగా కైవసం చేసుకున్నది. రాష్ట్రవ్యాప్తంగా 538 మండలాలకుగాను శుక్రవారం 536 మండలాలకు నిర్వహించిన ఎంపీపీ ఎన్నికల్లో టీఆర్ఎస్ అభ్యర్థులు ఏకంగా 430 మండలాలకు అధ్యక్షులుగా ఎన్నికవడం ద్వారా రికార్డు సృష్టించారు. అధ్యక్ష ఎన్నికల ఫలితాలను అధికారికంగా వెల్లడించనప్పటికీ.. ప్రాథమిక సమాచారం ప్రకారం కాంగ్రెస్ అభ్యర్థులు 60 మండలాల్లో, బీజేపీ 9 మండలాల్లో, ఇతరులు 11 మండలాల్లో అధ్యక్షులుగా ఎన్నికయ్యారు. కోరం లేకపోవడంతో 26 మండలాల్లో ఎన్నిక వాయిదాపడింది. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా బూర్గంపాడు, మహబూబ్‌నగర్ జిల్లా జడ్చర్ల మండల పరిషత్ స్థానాలకు పదవీకాలం పూర్తికాకపోవడంతో ఎంపీటీసీ ఎన్నికలే

మిగతా 4వ పేజీలో

| మొత్తం | టీఆర్ఎస్ | కాంగ్రెస్ | బీజేపీ | ఇతరులు | వాయిదా | ఎన్నిక జరుగనివి |
|---|---|---|---|---|---|---|
| 538 | 430 | 60 | 9 | 11 | 26 | 2 |



సిద్దిపేట జిల్లా అక్కన్నపేట ఎంపీపీగా ఎన్నికైన మాలోతు లక్ష్మిని ఆనందంతో ఎత్తుకున్న ఆమె భర్త బీలునాయక్

గుంట భూమిలేదు..

# నాలుగు పాస్‌బుక్‌లు!

ఒకటే నంబర్‌పై రెండు పుస్తకాలు జారీ

- రెవెన్యూ అధికారుల అండ.. యథేచ్ఛగా భూ అమ్మకాలు
- తనది కాని భూమిని 30 మందికి అమ్మిన కబ్జాకోరు
- న్యాయం కోసం పుష్కరకాలంగా బాధితుల పోరాటం




కబ్జాకోరులు కూల్చివేసిన ప్లాట్ల ప్రహరీలు

**అతనికి** భూమే లేదు.. లేని భూమికి పాస్‌బుక్ సృష్టించాడు. ఒకటి కాదు.. రెండు కాదు.. ఏకంగా నాలుగు నకిలీ పాస్‌బుక్‌లు! వాటి సాయంతో అందినకాడికి భూమిని కబ్జాచేశాడు. కబ్జాచేసిన భూమిని ప్లాట్లుగా 30 మందికి రిజిస్ట్రేషన్ చేసేశాడు. భూమే లేని వ్యక్తికి ఒకదాని వెంట ఒకటిగా నాలుగు పాస్‌బుక్‌లు సృష్టించి ఇచ్చిన రెవెన్యూ అధికారులు.. ఇతరుల భూమిని కొట్టేయటానికి కబ్జాకోరు చేసిన ప్రయత్నాలకు అండగా నిలిచారు. కష్టార్జితంతో కొనుక్కున్న భూమి అన్యాక్రాంతమవుతుంటే.. ఏమీ చేయలేని బాధితులు ధర్మగంటను ఆశ్రయించారు. ఇది సిద్దిపేట జిల్లా కేంద్రంలో రెవెన్యూ అధికారులు, కబ్జాకోరు మిలాఖత్ అయిన కథ!

5

## రెండురోజుల్లో సమస్యను పరిష్కరిస్తాం

జగిత్యాల జిల్లా గొర్రెపల్లి రైతు మంద శంకరమ్మ భూమిని పరిశీలించిన రెవెన్యూ అధికారులు

5




## 13-15 తేదీల మధ్య రాష్ట్రానికి నైరుతి

- నేడు కేరళలోకి ప్రవేశించే అవకాశం
- రాష్ట్రంలో మరో రెండ్రోజులు ఎండల తీవ్రత
- నేడు పలుచోట్ల ఉరుములు మెరుపులతో వర్షం
- హైదరాబాద్ వాతావరణ కేంద్రం వెల్లడి

4



## రాష్ట్రంలో గిగాస్కేల్ లి అయాన్ బ్యాటరీ యూనిట్

- ఏర్పాటుకు సిద్ధమన్న సీఎస్ ఎస్కే జోషి
- టీఎస్ఐపాస్ ద్వారా సత్వర అనుమతులు
- నీతిఆయోగ్ సీఈవోతో వీడియోకాన్ఫరెన్స్‌లో వెల్లడి
- తెలంగాణ నిర్ణయంపై అమితాబ్‌కాంత్ అభినందన

4



## నేడు కొలువుదీరనున్న జగన్ క్యాబినెట్

- ఐదుగురు డిప్యూటీ సీఎంలు.. మొత్తం 25 మంది మంత్రులు
- అన్ని సామాజికవర్గాలకు ప్రాతినిధ్యం
- రెండున్నరేండ్ల తర్వాత మంత్రివర్గంలో మార్పులు
- పారదర్శక పాలన అందిస్తాం: ఏపీ సీఎం జగన్

4



### ములుగు, నారాయణపేట జిల్లాలను

## రాష్ట్రపతి ఉత్తర్వుల్లో చేర్చాలి

కేంద్రానికి రాష్ట్ర ప్రభుత్వ ప్రతిపాదన

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** కొత్తగా ఏర్పడిన ములుగు, నారాయణపేట జిల్లాలను రాష్ట్రపతి ఉత్తర్వుల్లో చేర్చాలని రాష్ట్ర ప్రభుత్వం కేంద్రాన్ని కోరింది. ఈ మేరకు రాష్ట్రపతి ఉత్తర్వులను మరోసారి సవరించాలని కేంద్రానికి ప్రతిపాదన పంపింది. తెలంగాణ ఏర్పడిన తర్వాత పరిపాలనను వికేంద్రీకరించిన సీఎం కేసీఆర్.. జిల్లాలను పునర్విభజించి 31 జిల్లాలను ఏర్పాటు చేశారు. ఇందుకు అనుగుణంగా జోనల్ వ్యవస్థలో సమూల మార్పులు తీసుకొచ్చారు. కొత్త జోనల్ వ్యవస్థ ద్వారా 95 శాతం ఉద్యోగాలు స్థానికులకే వచ్చేలా రాష్ట్రపతి ఉత్తర్వుల్లో పొందుపరిచారు. ప్రస్తుతం అమల్లో ఉన్న రాష్ట్రపతి ఉత్తర్వుల్లో 31 జిల్లాలు, 7 జోన్లు, 2 మల్టీ జోన్లు ఉండగా.. అసెంబ్లీ ఎన్నికల అనంతరం ప్రజల కోరిక మేరకు ములుగు, నారాయణపేట జిల్లాలను ఏర్పాటు చేశారు. దీంతో ఈ రెండు జిల్లాలను కూడా రాష్ట్రపతి ఉత్తర్వుల్లో పొందుపరచాల్సిన అవసరం ఉన్నది. పార్లమెంట్ ఎన్నికల ప్రక్రియ ముగిసి కేంద్రంలో కొత్త ప్రభుత్వం ఏర్పడిన నేపథ్యంలో వీలైనంత త్వరగా కొత్త జిల్లాలను రాష్ట్రపతి ఉత్తర్వుల్లో చేర్పించేందుకు రాష్ట్ర ప్రభుత్వం ఢిల్లీలో ప్రయత్నాలు మొదలుపెట్టింది.

## రాష్ట్రంలో గిగాస్కేల్ లి అయాన్ బ్యాటరీ యూనిట్

- ఏర్పాటుకు సిద్ధమన్న సీఎస్ ఎస్కే జోషి
- అందుబాటులో 200 ఎకరాల భూమి
- టీఎస్ఐపాస్ ద్వారా సత్వర అనుమతులు
- నీతిఆయోగ్ సీఈవోతో వీడియోకాన్ఫరెన్స్‌లో వెల్లడి
- తెలంగాణ నిర్ణయంపై అమితాబ్‌కాంత్ అభినందన

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** తెలంగాణలో గిగాస్కేల్ లి అయాన్ బ్యాటరీల తయారీ ప్లాంటు ఏర్పాటుకు సిద్ధంగా ఉన్నట్లు సీఎస్ ఎస్కే జోషి తెలిపారు. శుక్రవారం ఢిల్లీనుంచి వివిధరాష్ట్రాల సీఎస్‌లతో నీతిఆయోగ్ సీఈవో అమితాబ్‌కాంత్.. బ్యాటరీల తయారీ యూనిట్ల ఏర్పాటుపై వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. సచివాలయం నుంచి వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న సీఎస్ మాట్లాడుతూ.. కేంద్రం నిర్మించాలని నిర్ణయించిన 5 గిగావాట్ల బ్యాటరీ తయారీ యూనిట్‌కు అవసరమైన 200 ఎకరాల భూమి అంతర్జాతీయ విమానాశ్రయానికి సమీపంలో అందుబాటులో ఉన్నదని, అవసరమైన విద్యుత్, నీటి సదుపాయం కల్పిస్తామని, మానవ వనరులు అందుబాటులో ఉన్నాయని వివరించారు. బ్యాటరీ యూనిట్ ఏర్పాటుకు తెలంగాణ అనుకూలమైనదని, టీఎస్ఐపాస్ ద్వారా సత్వర అనుమతులు వస్తాయని పేర్కొన్నారు. అలాగే అవసరమైన భూమి, వ్యవస్థాపక సౌకర్యాలు, అనుబంధ యూనిట్లకు సబ్సిడీలు, ప్రోత్సాహకాలు ఇవ్వనున్నట్లు తెలిపారు. వాణిజ్యవేత్తలకు అనుకూలమైన ఎలక్ట్రానిక్ మాన్యుఫాక్చరింగ్ పాలసీని అమలుచేస్తున్నామని, అంతర్జాతీయ విమానాశ్రయం సమీపంలో ఎలక్ట్రానిక్ మాన్యుఫాక్చరింగ్ క్లస్టర్ ఉన్నదని చెప్పారు. బ్యాటరీ తయారీ యూనిట్ ఏర్పాటుకు తెలంగాణ ముందుకు రావడంపై నీతిఆయోగ్ సీఈవో అమితాబ్‌కాంత్.. సీఎస్‌ను అభినందించారు. 2023 నాటికి త్రిచక్ర వాహనాలను, 2025 నాటికి ద్విచక్రవాహనాలను ఎలక్ట్రికల్‌గా మార్చాలన్న నిర్ణయానికి అనుగుణంగా బ్యాటరీ తయారీ యూనిట్ల ఏర్పాటుకు దేశంలో ఐదు రాష్ట్రాలను ఎంపిక చేయనున్నట్టు అమితాబ్‌కాంత్ తెలిపారు.



గిగాస్కేల్ లి అయాన్ బ్యాటరీల తయారీ ప్లాంట్ ఏర్పాటుపై ఢిల్లీ నుంచి శుక్రవారం నీతిఆయోగ్ సీఈవో అమితాబ్‌కాంత్ నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న తెలంగాణ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఎస్కే జోషి



### కడెం గేటు మరమ్మతుకు

## రూ.5.91 కోట్లు విడుదల


ఉత్తర్వులు జారీచేసిన సీఎస్

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** కడెం నారాయణరెడ్డి ప్రాజెక్టు గేటుకు మరమ్మతులు చేసేందుకు ప్రభుత్వం రూ.5.91 కోట్లు విడుదలచేసింది. ఈ మేరకు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఎస్కే జోషి శుక్రవారం ఉత్తర్వులు జారీచేశారు. కడెం ప్రాజెక్టు గేట్లను అధికారులు పూర్తిస్థాయిలో మూసివేసినా రెండోనంబర్ గేటు ద్వారా గతంలో వరద నీళ్లు దిగువకు వెళ్లాయి. వందల క్యూసెక్కులు దిగువకు వెళ్లడం.. అటు అధికార యంత్రాంగానికి, ఇటు రైతులకు ఆందోళన కలిగించింది. గేటుకు పూర్తిస్థాయిలో మరమ్మతులు చేసేందుకు అధికారులు పంపిన ప్రతిపాదనలను పరిశీలించిన ప్రభుత్వం.. తాజాగా రూ.5.91 కోట్లను విడుదలచేస్తూ ఉత్తర్వులు జారీచేసింది.

### ఆశావర్కర్ల వేతనాలకు

## వందకోట్లు విడుదల

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** ఆశా వర్కర్ల వేతనాల కోసం తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం వందకోట్ల రూపాయలను విడుదల చేసింది. వేతనాలను వెంటనే చెల్లించాలని వైద్యఆరోగ్యశాఖ మంత్రి ఈటల రాజేందర్ గతంలోనే ఆదేశాలు జారీచేశారు. ఈ మేరకు ఆర్థికశాఖ వందకోట్ల రూపాయలను విడుదల చేస్తూ శుక్రవారం ఉత్తర్వులను జారీచేసింది. ప్రస్తుతం రాష్ట్రవ్యాప్తంగా 25 వేలమంది ఆశావర్కర్లున్నారు. గ్రామీణప్రాంతాల్లో వీరు వైద్యఆరోగ్య సేవలను అందిస్తున్నారు.



# దేశాభివృద్ధికి సింగరేణి ఆసరా

- గత ఐదేండ్లలో కేంద్ర, రాష్ట్రాలకు రూ.27,467 కోట్ల పన్నులు చెల్లింపు
- ఆరు జిల్లాల్లో సమీప గ్రామాల అభివృద్ధికి రూ.1,844 కోట్లు
- అటు బొగ్గు, ఇటు విద్యుత్ ఉత్పత్తితో అప్రతిహతంగా సంస్థ అభివృద్ధి

**(హైదరాబాద్, నమస్తే తెలంగాణ)**

గత ఐదేండ్లలో బొగ్గు, ఉత్పత్తి, అమ్మకాలు, లాభాల్లో అద్భుత వృద్ధిని సాధించిన సింగరేణి సంస్థ.. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు వివిధ రకాల పన్నులు, రాయల్టీలు తదితర రూపాల్లో మొత్తం రూ.27,467 కోట్లు చెల్లించింది. దేశాభివృద్ధికి సింగరేణి ఏ స్థాయిలో సహకారాన్ని అందజేస్తున్నదో దీన్నిబట్టే అర్థమవుతుంది. 2014-15 నుంచి 2018-19 వరకు ఐదేండ్ల కాలంలో సింగరేణి తన చరిత్రను తానే తిరగరాసి రాష్ట్ర ప్రభుత్వానికి రూ.13,105 కోట్లు, కేంద్రానికి రూ.14,362 కోట్లు చెల్లించడం గమనార్హం. ఈ మొత్తాలను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనేక ప్రజోపయోగ కార్యక్రమాలకు వెచ్చిస్తుడటం పట్ల సింగరేణి సిబ్బంది సంతోషాన్ని వ్యక్తంచేస్తున్నారు.

### రాష్ట్రానికి 9 రకాలు, కేంద్రానికి 21 రకాల పన్నులు

ఏటా రాష్ట్ర ప్రభుత్వానికి వ్యాట్, స్టేట్ జీఎస్టీ, కాంట్రాక్టు ట్యాక్స్, ఎంట్రీ ట్యాక్స్, రాయల్టీ లాంటి 9 రకాల పన్నులను చెల్లిస్తున్న సింగరేణి.. కేంద్ర ప్రభుత్వానికి డివిడెండ్‌తోపాటు సెంట్రల్ జీఎస్టీ, సర్వీసు ట్యాక్స్, కస్టమ్స్ డ్యూటీ, స్వచ్ఛ భారత్ సెస్, కృషి కల్యాణ్ సెస్, కాంపెన్సేషన్ సెస్, క్లీన్ ఎనర్జీ సెస్, ఎన్ఎంఈటీ లాంటి 21 రకాల పన్నులను చెల్లిస్తున్నది. 2014-15లో రాష్ట్ర ప్రభుత్వానికి రూ.1,996.58 కోట్లు, కేంద్రానికి రూ.1,863.11 కోట్లు చొప్పున మొత్తం రూ.3,859.69 కోట్లు చెల్లించగా.. 2018-19 నాటికి ఈ మొత్తం భారీగా పెరిగి రూ.7,028.85 కోట్లకు (రాష్ట్రానికి రూ.3,348.40 కోట్లు, కేంద్రానికి రూ.3,680.45 కోట్లు) చేరింది.



### జిల్లాల అభివృద్ధికి ఊతం

కేంద్ర, రాష్ట్రాలకు పన్నులు చెల్లించడమే కాకుండా రాష్ట్రంలోని 6 జిల్లాల్లో బొగ్గు గనులకు సమీపంగా ఉన్న గ్రామాల అభివృద్ధికి సింగరేణి 2016-17 నుంచి ఈ ఏడాది ఏప్రిల్ వరకు డీఎంఎఫ్‌టీ (డిస్ట్రిక్ట్ మినరల్ ఫండ్ ట్రస్ట్) కింద రూ.1,844 కోట్లను ఆయా జిల్లాల ప్రభుత్వ యంత్రాంగాలకు చెల్లించింది. ఇందులో పెద్దపల్లి జిల్లాకు అత్యధికంగా రూ.684.98 కోట్లు చెల్లించగా.. ఖమ్మం జిల్లాకు అతి తక్కువగా రూ.79.11 కోట్లు చెల్లించింది. ఇదేవిధంగా కుమ్రంభీం ఆసిఫాబాద్ (రూ.146.16 కోట్లు), మంచిర్యాల (రూ.317.38 కోట్లు), జయశంకర్ భూపాలపల్లి (రూ.105.52 కోట్లు), భద్రాద్రి కొత్తగూడెం (రూ.506.09 కోట్లు) జిల్లాలకు కూడా డీఎంఎఫ్‌టీ నిధులు అందాయి.



**దేశాభివృద్ధికి తోడ్పడటం సంతోషకరం**

'దాదాపు 660 లక్షల టన్నుల బొగ్గు ఉత్పత్తి, 1,200 మెగావాట్ల విద్యుత్ ఉత్పాదనతో ముందుకు దూసుకెళ్తున్న సింగరేణి.. వివిధ రకాల పన్నులు, రాయల్టీలు, డివిడెండ్ల రూపంలో వేల కోట్ల రూపాయలు చెల్లిస్తూ రాష్ట్ర, దేశ ప్రగతికి దోహదపడటం ఎంతో సంతోషకరం. సింగరేణి ఉత్పత్తి చేసే బొగ్గులో సుమారు 82 శాతం థర్మల్ విద్యుత్ కేంద్రాలకు వెళ్తున్నది'

**- ఎన్ శ్రీధర్, సింగరేణి సీఎండీ**

### సీశాట్-2020కు

## ఉచిత శిక్షణ

- విద్యార్థుల ఎంపికకు రేపు ప్రవేశ పరీక్ష
- ఎస్సీకులాల అభివృద్ధిశాఖ డైరెక్టర్ శ్రీధర్

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** తెలంగాణ స్టడీసర్కిల్‌లో సీశాట్-2020కు ఉచిత శిక్షణ ఇవ్వడానికి విద్యార్థులను ఎంపిక చేసేందుకు ఆదివారం (ఈ నెల 9న) ప్రవేశ పరీక్ష నిర్వహించనున్నారు. ఇందుకు రాష్ట్రవ్యాప్తంగా 3,302 దరఖాస్తులను స్వీకరించామని తెలంగాణ రాష్ట్ర షెడ్యూల్ కులాల అభివృద్ధిశాఖ డైరెక్టర్ సీ శ్రీధర్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. అదిలాబాద్, నల్లగొండ, వరంగల్, కరీంనగర్, మహబూబ్‌నగర్, ఖమ్మం, సిద్దిపేట, సూర్యాపేట, నిజామాబాద్, సంగారెడ్డి జిల్లాల్లో పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేశామని, ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు పరీక్షలను నిర్వహిస్తామని చెప్పారు. హాల్‌టికెట్లు, ఇతర వివరాలకు www.tsscstudycircle.telangana.gov.in అనే వెబ్‌సైట్‌ను లేదా 040-23546552 ఫోన్ నంబర్‌ను సంప్రదించాలని ఎస్సీ కులాల అభివృద్ధిశాఖ డైరెక్టర్ శ్రీధర్ సూచించారు.

# నేడు కొలువుదీరనున్న ఏపీ క్యాబినెట్

- బీసీలకు7, ఎస్సీలకు 5.. రెడ్డి, కాపులకు నాలుగేసి బెర్తులు
- ఎస్టీ, మైనార్టీ, వైశ్య, క్షత్రియ, కమ్మ సామాజికవర్గాలకు ఒక్కొక్కటి
- రెండున్నరేండ్ల తర్వాత మంత్రివర్గంలో మార్పులు
- పారదర్శక పాలన అందిస్తాం: వైఎస్సార్సీపీఎల్పీలో ఏపీ సీఎం జగన్ వెల్లడి
- డిప్యూటీ సీఎంలుగా పుష్పశ్రీవాణి, సుచరిత, అంజద్‌బాషా, ఆళ్ల నాని, కృష్ణదాస్

**హైదరాబాద్/ అమరావతి, నమస్తే తెలంగాణ:** ఆంధ్రప్రదేశ్ మంత్రివర్గం శనివారం కొలువుదీరనున్నది. ఉదయం 11.49 గంటలకు వెలగపూడిలోని సచివాలయం ప్రాంగణంలో కొత్త మంత్రులతో గవర్నర్ ఈఎస్ఎల్ నరసింహన్ ప్రమాణం చేయించనున్నారు. మొత్తం 25 మందితో పూర్తిస్థాయి మంత్రివర్గాన్ని ఏర్పాటుచేస్తున్న ఏపీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి.. ఐదుగురికి డిప్యూటీ సీఎంలుగా అవకాశం కల్పిస్తున్నట్టు ప్రకటించారు. వీరిలో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ, కాపు సామాజికవర్గాలకు చెందినవారు ఉంటారని వెల్లడించారు. ఉపముఖ్యమంత్రులుగా పుష్పశ్రీవాణి (ఎస్టీ), సుచరిత (ఎస్సీ), అంజద్‌బాషా (మైనార్టీ), ఆళ్ల నాని (కాపు), ధర్మాన కృష్ణదాస్ (బీసీ)లకు అవకాశం కల్పించనున్నట్టు సమాచారం. రాష్ట్ర క్యాబినెట్‌లో ఐదుగురికి డిప్యూటీ సీఎంలుగా అవకాశం కల్పించడం ఇదే ప్రథమం. రెండున్నరేండ్ల తర్వాత మంత్రివర్గంలో మార్పులు ఉంటాయని, అప్పుడు కొత్తవారికి అవకాశం కల్పిస్తామని స్పష్టంచేశారు. మంత్రివర్గం ఏర్పాటు నేపథ్యంలో శుక్రవారం ఉదయం తాడేపల్లి క్యాంపు కార్యాలయంలో నిర్వహించిన వైఎస్సార్సీపీ లెజిస్లేచర్‌పార్టీ సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. మంత్రివర్గంలో సగం స్థానాలు ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ వర్గాలకు కేటాయిస్తామన్నారు. మంత్రివర్గంలో స్థానం పొందినవారికి పార్టీ ప్రధాన కార్యదర్శి విజయసాయిరెడ్డి ఫోన్‌చేసి సమాచారం అందిస్తారని చెప్పారు.

### అన్ని సామాజికవర్గాలకు ప్రాతినిధ్యం

వైఎస్ జగన్ మంత్రివర్గం ఏర్పాటులో అన్ని సామాజికవర్గాలకు ప్రాతినిధ్యం కల్పించనున్నట్టు సమాచారం. ఏపీ మంత్రివర్గంలో స్థానం పొందుతున్నవారిలో బీసీలు 7, ఎస్సీలు 5 (మాల 4, మాదిగ 1), కాపు 4, రెడ్డి 4, ఎస్టీ 1, వైశ్య 1, క్షత్రియ 1, కమ్మ 1, మైనార్టీవర్గానికి చెందినవారు ఒకరు చొప్పున ఉన్నట్టు తెలిసింది. మంత్రివర్గంలో మొత్తం ముగ్గురు మహిళలకు బెర్తులు ఖరారయినట్టు తెలుస్తున్నది. అసెంబ్లీ స్పీకర్‌గా తమ్మినేని సీతారాం పేరును ఖరారుచేసిన జగన్.. డిప్యూటీ స్పీకర్ పదవిని బ్రాహ్మణ సామాజికవర్గానికి చెందిన కోన రఘుపతికి ఇవ్వనున్నట్టు సమాచారం.

### గవర్నర్‌కు జాబితా అందజేసిన జగన్

గవర్నర్ నరసింహన్‌కు శుక్రవారం మధ్యాహ్నమే ఏపీ సీఎం జగన్మోహన్‌రెడ్డి 25 మందితో కూడిన మంత్రుల జాబితాను అందజేశారు. ప్రమాణస్వీకారోత్సవ కార్యక్రమంలో పాల్గొనేందుకు గవర్నర్ శుక్రవారం మధ్యాహ్నమే హైదరాబాద్ నుంచి విజయవాడకు చేరుకున్నారు. గేట్‌వే హోటల్‌లో గవర్నర్‌తో భేటీ అయిన జగన్.. పాతికమంది మంత్రుల జాబితాను అందజేశారు. ఆ తర్వాత మంత్రివర్గంలో చోటులభించనున్నవారికి వైఎస్సార్సీపీ ప్రధాన కార్యదర్శి విజయసాయిరెడ్డి ఫోన్లుచేసి, సమాచారం అందించారు.

**మంత్రివర్గంలో స్థానం పొందనున్నది వీరే..**


| పేరు | జిల్లా | సామాజికవర్గం |
|---|---|---|
| ధర్మాన కృష్ణదాస్ | శ్రీకాకుళం | బీసీ -పొలినాటి వెలమ |
| పాముల పుష్పశ్రీవాణి | విజయనగరం | ఎస్టీ- కురుపాం |
| బొత్స సత్యనారాయణ | విజయనగరం | బీసీ- తూర్పుకాపు |
| అవంతి శ్రీనివాస్ | విశాఖపట్టణం | కాపు |
| ఆళ్ల నాని | పశ్చిమగోదావరి | కాపు |
| తానేటి వనిత | పశ్చిమగోదావరి | ఎస్సీ-మాదిగ |
| చెరుకువాడ రంగనాథరాజు | పశ్చిమగోదావరి | క్షత్రియ |
| కురసాల కన్నబాబు | తూర్పుగోదావరి | కాపు |
| పిల్లి సుభాష్ చంద్రబోస్ | తూర్పుగోదావరి | బీసీ- శెట్టిబలిజ |
| పినిపె విశ్వరూప్ | తూర్పుగోదావరి | ఎస్సీ- మాల |
| కొడాలి నాని | కృష్ణా | కమ్మ |
| పేర్నినాని | కృష్ణా | కాపు |
| వెల్లంపల్లి శ్రీనివాస్ | కృష్ణా | వైశ్య |
| మేకతోటి సుచరిత | గుంటూరు | ఎస్సీ-మాల |
| మోపిదేవి వెంకటరమణ | గుంటూరు | బీసీ- మత్స్యకార |
| మేకపాటి గౌతంరెడ్డి | నెల్లూరు | రెడ్డి |
| అనిల్ కుమార్‌యాదవ్ | నెల్లూరు | బీసీ-యాదవ |
| బాలినేని శ్రీనివాసరెడ్డి | ప్రకాశం | రెడ్డి |
| ఆదిమూలపు సురేశ్ | ప్రకాశం | ఎస్సీ- మాల |
| బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డి | కర్నూలు | రెడ్డి |
| గుమ్మనూరు జయరాం | కర్నూలు | బీసీ-బోయ |
| పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి | చిత్తూరు | రెడ్డి |
| నారాయణస్వామి | చిత్తూరు | ఎస్సీ- మాల |
| అంజద్ భాషా | కడప | ముస్లిం మైనార్టీ |
| శంకర్‌నారాయణ | అనంతపురం | బీసీ- కురుబ |



విజయవాడలో గవర్నర్ నరసింహన్‌ను మర్యాదపూర్వకంగా కలిసిన ఏపీ సీఎం జగన్

### ఏపీ స్పీకర్‌గా తమ్మినేని

ఆంధ్రప్రదేశ్ అసెంబ్లీ స్పీకర్‌గా తమ్మినేని సీతారాం పేరును ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి ఖరారుచేశారు. శుక్రవారం వైఎస్సార్సీపీఎల్పీ సమావేశం ముగిసిన అనంతరం జగన్‌తో తమ్మినేని భేటీ అయ్యారు. శ్రీకాకుళం జిల్లా ఆముదాలవలస నుంచి గెలిచిన తమ్మినేనికి గతంలో మంత్రిగా పనిచేసిన అనుభవం కూడా ఉన్నది. ఏపీ అసెంబ్లీ స్పీకర్‌గా అవకాశం దక్కడం పట్ల తమ్మినేని సంతోషం వ్యక్తంచేశారు. సీఎం జగన్ తనపై అపారమైన నమ్మకం ఉంచి అప్పగించిన సభాపతి బాధ్యతలను త్రికరణశుద్ధిగా నిర్వహిస్తానన్నారు. అధికార, ప్రతిపక్షసభ్యుల సమన్వయంతో సభను హుందాగా నడిపిస్తానని చెప్పారు. సీఎం జగన్‌ను కలిసిన తర్వాత ఆయన ఓ మీడియా సంస్థతో మాట్లాడారు. తన ఎంపిక 'కళింగసీమకు ఇచ్చిన కంఠాభరణం'గా తమ్మినేని సీతారాం వర్ణించారు.



## చేప ప్రసాదానికి సర్వం సిద్ధం

**హైదరాబాద్ సిటీబ్యూరో, నమస్తే తెలంగాణ:** మృగశిర కార్తెను పురస్కరించుకుని బత్తిని మృగశిర ట్రస్ట్ పంపిణీ చేసే చేప ప్రసాదం పంపిణీకి సర్వం సిద్ధమైంది. శనివారం సాయంత్రం 6 గంటల నుంచి ప్రారంభమై 24 గంటలపాటు పంపిణీ కొనసాగనున్నది. చేప ప్రసాదం పొందేందుకు తెలంగాణ,ఏపీ నుంచే కాకుండా పొరుగు రాష్ట్రాల నుంచి పెద్ద సంఖ్యలో ఆస్తమా, ఉబ్బసం వ్యాధిగ్రస్థులు వస్తున్నారు. ఇప్పటికే చాలా మంది ఎగ్జిబిషన్ మైదనానికి చేరుకొని చేప ప్రసాదం కోసం ఎదురుచూస్తున్నారు. పెద్ద సంఖ్యలో ప్రజలు వస్తుండటంతో ప్రభుత్వం భారీ ఎత్తున ఏర్పాట్లు చేసింది. బ్యారికేడ్లు, క్యూలైన్లు, షెడ్ల నిర్మాణం, విద్యుత్ ఫ్లడ్‌లైట్లు బిగింపు వంటి ఏర్పాట్లను సిద్ధంచేశారు. ఉబ్బసం, ఆస్తమా వ్యాధికి ఔషధంగా భావించి దాన్ని పొందేందుకు మహారాష్ట్ర, ఛత్తీస్‌గఢ్, ఒడిశా, రాజస్థాన్, మధ్యప్రదేశ్, కర్ణాటక రాష్ట్రాల నుంచి వ్యాధిగ్రస్థులు వస్తారు. ఇప్పటికే పెద్ద సంఖ్యలో జనం తరలిరావడంతో ఎగ్జిబిషన్ మైదానం పరిసరాలన్నీ నిండిపోయాయి.

## నిధుల ఖర్చుకు జీవో ఉండాలా?

- ఆర్డర్ ఉండాలన్న నిబంధన చట్టంలో ఎక్కడ ఉంది?
- చేప ప్రసాదం పంపిణీపై పిటిషన్‌దారుకు హైకోర్టు ప్రశ్నలు
- పంపిణీలో జోక్యం చేసుకొనేలా ఆదేశాలివ్వని ధర్మాసనం

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** ప్రభుత్వం నిధులు ఖర్చుచేయడానికి ఉత్తర్వులు లేదా తీర్మానం ఉండాలని చట్టంలోని ఏ నిబంధన చెప్తున్నదో వివరించాలని చేప పంపిణీపై న్యాయస్థానాన్ని ఆశ్రయించిన పిటిషనర్లను హైకోర్టు సూటిగా ప్రశ్నించింది. ఏదైనా పెద్ద కార్యక్రమాన్ని సమర్థంగా నిర్వహించేందుకు ప్రభుత్వంలోని వివిధ శాఖలు సంయుక్తంగా పనిచేయాల్సి వచ్చినప్పుడు ప్రభుత్వ ఆర్డర్ లేదా తీర్మానం తప్పనిసరి అని ఏ చట్టంలో ఉందో ఆధారాలు సమర్పించాలని పిటిషనర్లను ఆదేశించింది. ప్రైవేట్ కుటుంబ ట్రస్టు చేపడుతున్న చేప ప్రసాదం పంపిణీకి ప్రభుత్వం నిధులు ఖర్చు చేస్తున్నదని, ఎలాంటి జీవో, తీర్మానం, మంత్రివర్గ నిర్ణయం లేకుండా ప్రజాధనాన్ని కేటాయిస్తున్నారని బాలల హక్కుల సంఘం దాఖలుచేసిన పిటిషన్‌పై హైకోర్టు శుక్రవారం విచారణ చేపట్టింది. గత విచారణ సందర్భంగా కౌంటర్ దాఖలు చేయాలన్న ధర్మాసనం ఆదేశాల మేరకు.. ప్రభుత్వం ఎంతవరకు బాధ్యతలు నిర్వహిస్తున్నదనే వివరాలను ప్రభుత్వ ప్రత్యేక న్యాయవాది శరత్‌కుమార్ శుక్రవారం న్యాయస్థానం ముందుంచారు. ఇందులో ప్రజాధనం వినియోగానికి సంబంధించిన వివరాలు లేవని పిటిషనర్ తరపు న్యాయవాది పేర్కొనగా.. అసలు జీవో, తీర్మానం లేకుండా ప్రభుత్వం నిధులు ఖర్చు చేయరాదని చెప్పే నిబంధనలను తమ ముందుంచాలని న్యాయస్థానం ఆదేశించింది. ఆధారాలు సమర్పించడానికి సమయం కావాలని పిటిషనర్ తరపు న్యాయవాది కోరడంతో.. తదుపరి విచారణను మూడువారాలకు హైకోర్టు వాయిదా వేసింది. చేప ప్రసాదం పంపిణీ, ప్రభుత్వ ఏర్పాట్ల విషయంలో జోక్యం చేసుకొనేలా హైకోర్టు ఎలాంటి ఆదేశాలను జారీచేయలేదు.

# 13-15 తేదీల మధ్య రాష్ట్రానికి నైరుతి

- నేడు కేరళలోకి ప్రవేశించే అవకాశం
- రాష్ట్రంలో మరో రెండ్రోజులు ఎండల తీవ్రత
- నేడు పలుచోట్ల ఉరుములు మెరుపులతో వర్షం
- హైదరాబాద్ వాతావరణ కేంద్రం వెల్లడి

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:**

నైరుతి రుతుపవనాలు ఈ నెల 13-15 తేదీల మధ్య రాష్ట్రంలోకి ప్రవేశించే అవకాశం ఉన్నట్టు అంచనా వేస్తున్నామని హైదరాబాద్ వాతావరణ కేంద్రం డైరెక్టర్ వైకే రెడ్డి 'నమస్తే తెలంగాణ'కు తెలిపారు. నైరుతి రుతుపవనాలు శనివారం కేరళను తాకే అవకాశం ఉన్నట్టు వివరించారు. శనివారం రాష్ట్రంలోని పలుచోట్ల ఉరుములు, మెరుపులతోపాటు గంటకు 30 నుంచి 40 కిలోమీటర్ల వేగంతో ఈదురుగాలులతో కూడిన వర్షాలు కురిసే అవకాశం ఉన్నట్టు తెలిపారు. ఆదివారం నుంచి ఎండల తీవ్రత పెరుగుతుందని, ఆది, సోమవారాల్లో ఉత్తర తెలంగాణ జిల్లాల్లోని చాలాప్రాంతాల్లో వడగాడ్పులు వీచే అవకాశం ఉన్నదని చెప్పారు. ఇదిలా ఉంటే.. శుక్రవారం ఆదిలాబాద్‌లో అత్యధికంగా 44.8 డిగ్రీల గరిష్ఠ ఉష్ణోగ్రత నమోదైంది. భద్రాచలంలో 41.6 డిగ్రీలు, హన్మకొండలో 41, హైదరాబాద్‌లో 40.2, ఖమ్మంలో 41, మహబూబ్‌నగర్‌లో 38.8, మెదక్‌లో 42.2, నిజామాబాద్‌లో 43.1, రామగుండంలో 42.4 డిగ్రీల గరిష్ఠ ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి.



### బొమ్రాస్‌పేటలో అత్యధికంగా 5 సెం.మీ. వర్షపాతం

రాష్ట్రవ్యాప్తంగా గురువారం ఉదయం నుంచి శుక్రవారం ఉదయం వరకు అత్యధికంగా వికారాబాద్ జిల్లా బొమ్రాస్‌పేటలో 5 సెం.మీ. వర్షపాతం నమోదైనట్టు హైదరాబాద్ వాతావరణ కేంద్రం తెలిపింది. వికారాబాద్ జిల్లా దోమ, నల్లగొండ జిల్లా దేవరకొండ, ఖమ్మం పట్టణంలో, మహబూబ్‌నగర్ జిల్లా నారాయణ్‌పేటల్లో 3 సెం.మీ. చొప్పున వర్షపాతం నమోదైంది. నల్లగొండ జిల్లా నాగార్జునసాగర్, జోగుళాంబ గద్వాల జిల్లా గట్టు, వికారాబాద్ జిల్లా కొడంగల్, వనపర్తి , సూర్యాపేట, హుజూర్‌నగర్, నేరేడుచర్ల, తాండూరుల్లో 2 సెం.మీ. చొప్పున వర్షం కురిసింది.

### హైదరాబాద్‌లో స్వల్పంగా తగ్గిన ఉష్ణోగ్రతలు

గ్రేటర్ హైదరాబాద్‌లో ఉష్ణోగ్రతలు తగ్గుముఖం పట్టాయి. గురువారం రాత్రి కురిసిన వానలతో చల్లబడిన నగరంలో శుక్రవారం సైతం ఎండతీవ్రత గతంతో పోలిస్తే తక్కువగా నమోదైంది. ఉదయం నుంచి సాయంత్రం 5.30 గంటల వరకు గరిష్ఠ ఉష్ణోగ్రత 40.2 డిగ్రీల సెల్సియస్, కనిష్ఠ ఉష్ణోగ్రత 26.6 డిగ్రీల సెల్సియస్‌గా నమోదైనట్లు హైదరాబాద్ వాతావరణ కేంద్రం వెల్లడించింది. రాగల 24 గంటల్లో గ్రేటర్ పరిధిలో అక్కడక్కడ క్యుములోనింబస్ మేఘాలు ఏర్పడి తేలికపాటి నుంచి ఓ మోస్తరు వర్షం కురిసే అవకాశమున్నట్లు తెలిపింది.

# గులాబీ మండలాధీశులు

మూడోపేజీ తరువాయి...

జరుగలేదు. ఇక.. ఎంపీపీ ఎన్నికల్లో ఆరు జిల్లాల్లో టీఆర్ఎస్ క్లీన్‌స్వీప్‌చేసింది. సిద్దిపేట, కరీంనగర్, వరంగల్ రూరల్, వరంగల్ అర్బన్, కుమ్రంభీం ఆసిఫాబాద్, పెద్దపల్లి జిల్లాల్లో అన్ని ఎంపీటీసీ స్థానాలను టీఆర్ఎస్ గెలిచిన సంగతి తెలిసిందే. పార్టీకి మొదటి నుంచి విధేయులుగా ఉంటూ వస్తున్నవారు, ఉద్యమంలో పనిచేసినవారు, ప్రజాభిమానం చూరగొన్నవారిని టీఆర్ఎస్ నాయకత్వం ఎంపీపీ అధ్యక్షులుగా ఎంపికచేసింది. కొన్నిచోట్ల సామాజిక సమీకరణాలు, స్థానిక పరిస్థితులకు అనుగుణంగా నిర్ణయం తీసుకున్నారు. స్వతంత్రులుగా గెలిచిన ఎంపీటీసీ సభ్యులు సీఎం కేసీఆర్ నాయకత్వంలో పనిచేయడానికి పలు మండలాల్లో స్వచ్ఛందంగా ముందుకొచ్చి టీఆర్ఎస్ అభ్యర్థులకు మద్దతు ప్రకటించారు. కేసీఆర్ నాయకత్వంలో పనిచేయడానికి టీఆర్ఎస్‌లో చేరుతున్నట్లు వెల్లడించారు. ఉదయం నుంచి ఎంపీపీ అధ్యక్షుల ఎన్నిక ఉత్సాహంగా సాగింది. మొదట కోఆప్షన్ సభ్యుల ఎన్నిక, అనంతరం ఎంపీపీ అధ్యక్ష, ఉపాధ్యక్ష ఎన్నికల ప్రక్రియను కొనసాగించారు. అత్యధిక ఎంపీటీసీ స్థానాల్లో టీఆర్ఎస్ అభ్యర్థులు విజయం సాధించడంతో ఎంపీపీ ఎన్నికలు దాదాపు లాంఛనంగా సాగాయి. ఎన్నిక అనంతరం టీఆర్ఎస్ నాయకులు సంబురాలు చేసుకున్నారు. నాయకులు అనుచరులు, అభిమానులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున పటాకులు కాల్చి తమ సంతోషాన్ని వ్యక్తంచేశారు. మిఠాయిలు తినిపించుకున్నారు. పరస్పరం అభినందించుకున్నారు. స్థానిక ఎమ్మెల్యేలు వారిని అభినందించారు.

### నేడు జిల్లా పరిషత్ చైర్మన్ల ఎన్నిక

జిల్లా ప్రజా పరిషత్ చైర్మన్‌ల ఎన్నికలకు రంగం సిద్ధమైంది. శనివారం రాష్ట్రవ్యాప్తంగా 32 జిల్లాల్లో ఎన్నికలు నిర్వహించనున్నారు. ఎన్నికల కోసం అధికారులు ఏర్పాట్లు పూర్తిచేశారు. చైర్మన్‌తోపాటు వైస్ చైర్మన్, కోఆప్షన్ సభ్యుల ఎన్నిక కూడా జరుగనుంది. రాష్ట్రంలోని 32 జిల్లాల్లో జెడ్పీ పీఠాలు దక్కించుకునేందుకు అవసరమైన స్పష్టమైన మెజార్టీని టీఆర్ఎస్ సాధించిన నేపథ్యంలో శనివారం నాటి ఎన్నిక లాంఛనంగానే ఉండనున్నది. అన్ని స్థానాలను కైవసం చేసుకోవడానికి టీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కే తారకరామారావు నేతృత్వంలో జిల్లా నాయకులను సమన్వయం చేస్తున్నారు. టీఆర్ఎస్ తరఫున జెడ్పీ చైర్మన్ అభ్యర్థులను శనివారం ఉదయం ప్రకటిస్తారు. అనంతరం వారికి బీ ఫారాలు అందజేయనున్నారు. బీ ఫారాలు ఇచ్చే అధికారాన్ని ఆయా జిల్లాల పార్టీ ఇంచార్జులకు అప్పగించారు. పార్టీ తరఫున ఎన్నికైన జెడ్పీటీసీలకు ఇప్పటికే విప్ జారీచేశారు.

### ముహూర్తం

సూర్యోదయం: 5.45 గంటలకు

సూర్యాస్తమయం: 6.45 గంటలకు

వికారినామ సంవత్సరం, ఉత్తరాయణం, గ్రీష్మరుతువు, జ్యేష్ఠమాసం, శుక్లపక్షం షష్ఠి, నక్షత్రం: ఆశ్లేష సాయంత్రం 5.22 వరకు, తదుపరి మఖ, అమృతఘడియలు: మధ్యాహ్నం 3.53 నుంచి సాయంత్రం 5.29 వరకు, రాహుకాలం: ఉదయం 9.00 నుంచి 10.38 వరకు, దుర్ముహూర్తం: తె. 5.45 నుంచి ఉదయం 7.29 వరకు, వర్జ్యం: ఉదయం 6.54 నుంచి 8.30 వరకు.

### లోకం పోకడ




ఇంట్లో ముల్లు తీసి తినిపించినట్టు ఇక్కడ కుదరదు.. నోట్లో చేప వేయగానే గుటుక్కున మింగండి!

నమస్తే తెలంగాణ

# ధర్మగంట

మీ వద్ద ఉన్న సమాచారాన్ని పంపించాల్సిన చిరునామాలు

ధర్మగంట
నమస్తే తెలంగాణ,
8-2-603/1/7,8,9
రోడ్డు నంబర్ 10, బంజారాహిల్స్,
హైదరాబాద్-500034.
పై అడ్రస్‌కు పోస్టుద్వారా పంపించండి.

Whatsapp No.
9346979997

dharmaganta@ntnews.com
అడ్రస్‌కు ఈ-మెయిల్ చేయండి.

స్థానిక నమస్తే తెలంగాణ కార్యాలయంలో వివరాలు అందించండి.

/NTDAILYONLINE





జగిత్యాల జిల్లా మల్లాపూర్ మండలం గొర్రెపల్లి గ్రామంలో మంద శంకరమ్మ భూమిని పరిశీలిస్తున్న రెవెన్యూ అధికారులు

## రెండురోజుల్లో పరిష్కరిస్తాం

- 'భూ పట్టా కోసం ఎక్కని గడప లేదు' కథనానికి స్పందన
- మంద శంకరమ్మ భూమిని పరిశీలించిన రెవెన్యూ అధికారులు
- 'ధర్మగంట'కు కృతజ్ఞతలు తెలిపిన జగిత్యాల జిల్లా గొర్రెపల్లి రైతు

**మల్లాపూర్:** ఈ నెల 6వ తేదీన 'నమస్తే తెలంగాణ- ధర్మగంట'లో 'భూ పట్టా కోసం ఎక్కని గడప లేదు' శీర్షికన ప్రచురితమైన కథనానికి రెవెన్యూ అధికారులు స్పందించారు. జగిత్యాల జిల్లా మల్లాపూర్ మండలం గొర్రెపల్లి గ్రామానికి చెందిన రైతు మంద శంకరమ్మకు సర్వే నంబర్ 101/ఆలో 1.28 ఎకరాల భూమి ఉన్నది. 2006లో కొన్న ఈ భూమికి అప్పటి అధికారులు పాస్‌పుస్తకం కూడా ఇచ్చారు. ఇటీవలి భూరికార్డుల ప్రక్షాళన సమయంలో ఆ భూమి ఇతరులకు పట్టాచేసినట్టు ఆన్‌లైన్‌లో కనిపిస్తున్నది. దీంతో కొత్త పాస్‌పుస్తకం అందక, ఈ భూమి పట్టాకోసం బాధితురాలు అధికారుల చుట్టూ తిరుగుతున్న తీరుపై కథనం ప్రచురితమైంది. దీంతో స్పందించిన అధికారులు.. శుక్రవారం బాధితురాలికి చెందిన భూమి వద్దకు తాసిల్దార్ రమేశ్ ఆధ్వర్యంలో సర్వేయర్ ఉమ్మాజీ, ఆర్‌ఐ రమేశ్, వీఆర్వో గంగారం వెళ్లి అక్కడే రికార్డులను పరిశీలించారు. సర్వే నంబర్‌లో ఉన్న మిగతా రైతులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా రెండురోజుల్లో సర్వేచేసి శంకరమ్మకు చెందిన భూమిని పట్టాచేసి సమస్యను పరిష్కారిస్తామని హామీ ఇచ్చారు. సమస్యను అధికారుల దృష్టికి తీసుకెళ్లిన 'ధర్మగంట'కు శంకరమ్మ ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

## సర్వేనంబర్ తప్పుగా రాశారు

నల్లగొండ జిల్లా పెద్దవూర మండలం, బట్టగూడెం మా స్వస్థలం. నాకు వెల్మగూడెం శివార్లలో సర్వేనంబర్లు 471లో 34 గుంటలు, 494లో ఎకరం భూమి ఉన్నది. నా కూతురు కే ప్రమీలకు పసుపు కుంకుమ కింద ఎకరం భూమిని 2012వ సంవత్సరంలో రిజిస్ట్రేషన్ (డాక్యుమెంట్ నంబర్ 1186/2012) చేశా. సర్వేనంబర్లు 471లో 34 గుంటలు, 494లో 6 గుంటల భూమిని కూతురికి రాసిచ్చా. తాసిల్దార్ కార్యాలయంలో పాస్‌పుస్తకం కోసం దరఖాస్తు చేసుకున్నాం. అయితే, వీఆర్వో కే శ్రీనివాస్‌రెడ్డి నిర్లక్ష్యంగా వ్యవహరించి సర్వే నంబర్ 458 పేరున పాస్‌పుస్తకం జారీచేశారు. ఈ సర్వే నంబర్ నాదికాదని ఎన్నిసార్లు చెప్పినా వినిపించుకోవడంలేదు. 'నాకు తెలుసా? మీకు తెలుసా? ఎక్కడ చెప్పుకుంటావో చెప్పుకో' అని ఇష్టంవచ్చినట్టు మాట్లాడుతున్నారు. తాసిల్దార్ కార్యాలయంలో నాకు న్యాయం జరుగకపోవడంతో మిర్యాలగూడ ఆర్డీవోకు, ప్రజావాణిలో నల్లగొండ జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదుచేశా. మిర్యాలగూడ ఆర్డీవో, పెద్దవూర తాసిల్దార్ ఆదేశాలకు అనుగుణంగా మండల సర్వేయర్ స్వప్న, వీఆర్వో, ఆర్‌ఐ, గ్రామ పెద్దల సహకారంతో నా భూమిని నక్షా సాయంతో కొలతలువేసి సర్వే నంబర్ 471లో 1.20 ఎకరాలు, 494లో 20 గుంటలు, మొత్తం రెండెకరాలు పొజిషన్ కలిగి ఉన్నట్టు తాసిల్దార్‌కు రిపోర్ట్ సమర్పించారు. 471, 494 సర్వే నంబర్లతో పాస్‌పుస్తకం ఇవ్వకుండా అధికారులు ఇబ్బందిపెడుతున్నారు. ఉన్నతాధికారులు దయచేసి నా కూతురు కే ప్రమీల పేరిట పాస్‌పుస్తకం ఇప్పించాలని కోరుతున్నా'.

**- వల్కి మారయ్య, బట్టగూడెం, నల్లగొండ జిల్లా**

## విరాసత్ చేస్తలేరు..

### ఏండ్లు గడుస్తున్నా పట్టని నిర్మల్ రెవెన్యూ అధికారులు

**హైదరాబాద్,నమస్తే తెలంగాణ:** వారసత్వ భూమిని విరాసత్ చేయడానికి అధికారులు నాన్చుతున్నారని, రేపు మాపు అంటూ తిప్పుకుంటున్నారే తప్ప పనులు చేయడంలేదని వాపోతున్నారు నిర్మల్ జిల్లా కేంద్రానికి చెందిన బాధితులు. నిర్మల్ పట్టణ శివారులో బీ వసంత్‌రావు, బీ చంద్రమోహన్‌రావుకు వారసత్వంగా 8.5 గుంటల భూమి వచ్చింది. ఈ భూమిని ఇద్దరి పేరున చెరో 4.25 గుంటల చొప్పున విరాసత్‌చేసి, పాస్‌పుస్తకం ఇవ్వాలి. కానీ ఏండ్లు గడుస్తున్నా అధికారులు విరాసత్ చేయడం లేదు. దీంతో హైదరాబాద్‌లో ఉంటున్న వసంత్‌రావు, చంద్రమోహన్‌రావు నిర్మల్‌కు నిత్యం తిరుగలేక ఇబ్బందిపడుతున్నారు. వాస్తవంగా నిర్మల్ శివారులోని సర్వే నంబర్182/ఆలో 25 గుంటల భూమి వీరి తాత చిన్నన్న పేరుతో ఉన్నది. చిన్నన్నకు ముగ్గుకు కుమారులున్నారు. ఈ ముగ్గురూ మరణించారు. ఆ తర్వాత వీరి వారసుల పేరుతో విరాసత్‌చేయాలి. ఈ మేరకు చిన్నన్న మనుమలు విరాసత్ కోసం దరఖాస్తు చేసుకున్నారు ఇందులో చిన్నన్న పెద్దకుమారుడు రాజన్న కొడుకు హన్మాండ్లుకు 8 గుంటలు, మూడో కుమారుడు భగవాన్‌రావు భార్య సుశీల పేరుతో 8.5 గుంటలు విరాసత్‌చేశారు. పాస్‌పుస్తకాలు కూడా జారీచేశారు. కానీ రెండో కుమారుడు గంగాధర్‌రావు కొడుకులు వసంత్‌రావు, చంద్రమోహన్‌రావు ఉద్యోగ రీత్యా హైదరాబాద్‌లో ఉండటంతో అడగడం లేదని వీరి పేరున విరాసత్‌చేయలేదు. ఇక్కడ భాగస్తుల మధ్య ఎలాంటి పంచాయితీ లేదు. కానీ అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తూ విరాసత్ చేయలేదు. వసంత్‌రావు, చంద్రమోహన్‌రావుకు కూడా వృద్ధాప్యం వచ్చింది. తాత నుంచి వారసత్వంగా వచ్చిన ఈ భూమిని తమ పేరుమీద ఎక్కించి పాస్‌పుస్తకం ఇవ్వాలని అధికారులను కోరుతున్నారు. వీఆర్వో, తాసిల్దార్లను ఎప్పుడు అడిగినా విరాసత్ చేస్తామని అంటున్నారు కానీ చేయడం లేదని, తాజాగా ఎన్నికల తర్వాతచేస్తామని సమాధానం ఇచ్చారని బాధితులు 'ధర్మగంట'కు తెలిపారు. ఇప్పటికైనా అధికారులు తమకు న్యాయంచేయాలని కోరుతున్నారు.

## మల్లారెడ్డికి పెగడపల్లిలో భూమి లేదు

### పెద్దపల్లి జిల్లా కాల్వశ్రీరాంపూర్ తాసిల్దార్ రవీందర్

**కాల్వశ్రీరాంపూర్:** తన భూమిని అధికారులు పట్టాచేయడం లేదని, దీంతో తనకు ఆత్మహత్యే శరణ్యమంటూ వీడియో తీసి సామాజిక మాధ్యమాల్లో వైరల్‌చేసిన ఆటో డ్రైవర్ పెంద్రు మల్లారెడ్డికి తన స్వగ్రామంలో ఎలాంటి భూమి లేదని పెద్దపల్లి జిల్లా శ్రీరాంపూర్ తాసిల్దార్ దిండిగాల రవీందర్ తెలిపారు. శుక్రవారం తాసిల్ కార్యాలయంలో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో తాసిల్దార్ రవీందర్ వివరాలు వెల్లడించారు. శ్రీరాంపూర్ మండలం పెగడపల్లికి చెందిన మల్లారెడ్డి ప్రస్తుతం హైదరాబాద్‌లో ఉంటున్నారని చెప్పారు. మల్లారెడ్డి తండ్రి నారాయణరెడ్డి పేరు మీద ఉన్న 37.5 గుంటల భూమిని, అదే గ్రామానికి చెందిన ముగ్గురు రైతులకు గతంలోనే విక్రయించారని పేర్కొన్నారు. నారాయణరెడ్డి బతికి ఉన్నప్పుడే భూమిని అమ్ముకున్నారనీ, దీంతో మల్లారెడ్డికి స్వగ్రామంలో ఎలాంటి భూమి మిగులలేదని చెప్పారు. తనకు ఎలాంటి భూమి లేకున్నా మల్లారెడ్డి సోషల్ మీడియాలో తప్పుగా ప్రచారం చేసినట్టు తాసిల్దార్ వివరించారు. మోఖాపై విచారణ చేశామని, అతడు తాసిల్దార్ కార్యాలయానికి రాలేదనీ, తమ కార్యాలయంలో ఎలాంటి దరఖాస్తు చేయలేదని స్పష్టంచేశారు.

## గుంట భూమిలేదు..

# నాలుగు పాస్‌బుక్‌లు!

- ఒకటే నంబర్‌పై రెండు పుస్తకాలు జారీ
- రెవెన్యూ అధికారుల అండ.. యథేచ్ఛగా భూ అమ్మకాలు
- తనది కాని భూమిని 30 మందికి అమ్మిన కబ్జాకోరు
- న్యాయం కోసం పుష్కరకాలంగా బాధితుల పోరాటం





బాధితులు మనోహర్ శర్మ, సావిత్రమ్మ

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** సిద్దిపేట టౌన్‌లోని ప్రశాంత్‌నగర్ పంచాయతీ రాఘవేంద్రనగర్‌కాలనీలో సికింద్రాబాద్‌కు చెందిన చెన్నూరి మల్లేశం..1996లో 20 ఎకరాల 9.5 గుంటల భూమి కొని, అందులో 318 ప్లాట్లతో లేఅవుట్ (పాస్‌పుస్తకం టైటిల్‌డీడ్ నంబర్: 505572. లింకు డాక్యుమెంట్లు 982/96, 1031/96, 1108/96, 959/1996.) వేశారు. అప్పటినుంచి నేటివరకూ పహాణీ ఆన్‌లైన్ ఆర్వోఆర్, 1బీ రికార్డుల్లో కూడా క్లియర్‌గా అతని పేరుతోనే రికార్డులున్నాయి. 1999లో ఈ లేఅవుట్‌లోని సర్వేనంబర్ 1999/ఆలో సావిత్రమ్మ 397 గజాలు, చైతన్య 347 గజాలు.. 2008లో ప్రవళికారెడ్డి 315 గజాల ప్లాట్లను కొన్నారు. 2007 వరకు అక్కడ ఎలాంటి సమస్యాలేదు. సిద్దిపేటలో రియల్‌ఎస్టేట్ బూమ్ మొదలుకాగానే.. ఆ లేఅవుట్‌పై అక్రమార్కుల కన్నుపడింది. దేశెట్టి మల్లయ్య అనే వ్యక్తి, మరికొందరితో కలిసి మొత్తం లేఅవుట్‌ను కబ్జాచేసేందుకు ప్రణాళిక రచించాడు. ఓ పక్క వాస్తవంగా లే అవుట్ చేసిన చెన్నూరి మల్లేశం భూమి కొన్న తర్వాత చాలాకాలంపాటు మ్యుటేషన్ చేయించుకోకపోవడం, మరోపక్క సర్వే నంబర్ 1999/ఆ లో అచ్చంగా తన పేరు (తండ్రిపేరు వేరు) గల మరో వ్యక్తికి సుమారు రెండెకరాల భూమి ఉండటం ఈ కబ్జాకోరు దేశెట్టి మల్లయ్యకు కలిసివచ్చింది. దీన్ని అవకాశంగా చేసుకొని 2007లో రెవెన్యూ అధికారులతో కుమ్మక్కై ఏకంగా నాలుగు నకిలీ పాస్‌పుస్తకాలను తనపేరుతో సంపాదించాడు. 1999/ఆ సర్వేనంబర్‌కు సంబంధించి కాస్రాపహాణీ, 1956-58 చెస్లా పహాణీ, 1973-74 నుంచి నేటి వరకు ఉన్న అన్ని పహాణీలలో సదరు మల్లయ్య ఎక్కడా పట్టాదారుగా లేనేలేడు. గుంట భూమి కూడా లేని మల్లయ్యకు నకిలీ పాస్‌పుస్తకాలను జారీచేశారు. గమ్మత్తేమిటంటే ఈ నాలుగు పాస్‌బుక్‌లలో రెండింటి నంబర్లు ఒకటే కావడం. ఇదెలా సాధ్యపడిందో అధికారులకే తెలియాలి. వీటిద్వారా మల్లయ్య ఏకంగా 30 అక్రమ రిజిస్ట్రేషన్లను చేశాడంటే.. విస్తుపోకతప్పదు. ఈ పాస్‌బుక్‌ల ద్వారా భూమిని అమ్మిన తీరును చూస్తే మరింత ఆశ్చర్యమేస్తుంది. ఈ అక్రమాలకు రెవెన్యూ అధికారులు అండగా ఉన్నారని బాధితులు వాపోతున్నారు.

**మొదటి నకిలీ పాస్‌పుస్తకం**

దేశెట్టి మల్లయ్య పేరిట రెవెన్యూ అధికారులు ఇచ్చిన మొదటి నకిలీ పాస్‌పుస్తకం (టైటిల్ డీడ్ నంబర్: 685827)లో సర్వేనంబర్ 1999/ఆ లో రెండు గుంటల భూమి ఉన్నట్టు చూపించారు. 1999/ఆ తోపాటు, 1998/ఆ, 2000/ఆ, 2002 సర్వే నంబర్లను కూడా ఆ పాస్‌బుక్‌లో చూపించారు. కానీ ఈ మల్లయ్య తన కొడుకు ఎల్లయ్యకు 1999/ఆ సర్వే నంబర్‌లో పది గుంటల భూమి ఉన్నట్టుగా చూపి అమ్మేశాడు (డాక్యుమెంట్ నంబర్: 5569/2007). సదరు సర్వే నంబర్‌లో చూపించిన భూమే రెండు గుంటలైనప్పుడు పది గుంటలు ఎలా అమ్మాడు? అధికారులు ఎలా రిజిస్టర్ చేశారు? అనే ప్రశ్నలకు సమాధానం లేదు. ఇక్కడితో ఈ వ్యవహారం ఆగలేదు. తండ్రి నుంచి 10 గుంటలు కొన్న ఎల్లయ్య దాన్ని ప్లాట్లుగా చేసి కనకాల రాములుకు 242 గజాలు, ఓరమ్ గోవర్ధన్‌కు 720 గజాలు, 248 గజాలు చొప్పున రిజిస్ట్రేషన్ చేశాడు. అనంతరం కనకాల రాములు తన 242 గజాలతోపాటు, ఓరమ్ గోవర్ధన్ తన భూమిలోనుంచి 200 గజాలు బత్తుల శ్రీనివాస్‌కు అమ్మారు. ఆ తర్వాత ఓరమ్ గోవర్ధన్, బత్తుల శ్రీనివాస్ కలిసి ఆ పది గుంటల భూమిని మహ్మద్ ఖాజా అక్తర్‌కు జీపీఏ చేశారు. ఓరమ్ గోవర్ధన్, బత్తుల శ్రీనివాస్, మహ్మద్ ఖాజా అక్తర్ కలిసి ఆ భూమిని వెంకుగారి శ్రీధర్ రెడ్డికి అమ్మేశారు. అతను ఆ భూమిని చేవూరి నర్సింహులుకు జీపీఏ చేశాడు. శ్రీధర్‌రెడ్డి, నర్సింహులు కలిసి పలేటి రాజారెడ్డికి 241 గజాలు, మైనర్ అయిన హర్షవర్ధన్‌రెడ్డికి 242 గజాలు, కుమారి పలేటి వాణికి 244 గజాలు, భవానికి 242 గజాలు, పలేటి రాజమణికి 21 గజాలు చొప్పున రిజిస్ట్రేషన్‌చేశారు. ఇలా పదిహేను మందికిపైగా 685827 నంబర్ నకిలీ పాస్‌పుస్తకం ద్వారా అక్రమంగా రిజిస్ట్రేషన్లు జరిగాయి. ఒక్క గజం భూమి కూడా లేని మల్లయ్య నకిలీ పాస్‌బుక్ ద్వారా చేసిన నిర్వాకమిది.

**రెండో నకిలీ పాస్‌పుస్తకం**

సిద్దిపేట రెవెన్యూ అధికారులు దేశెట్టి మల్లయ్యకు ఇచ్చిన రెండో నకిలీ పాస్‌పుస్తకం (టైటిల్ డీడ్ నంబర్: 705318)లో ఒకే సర్వేనంబర్ 1999/ఆ ను ప్రస్తావిస్తూ.. అందులో ఒక ఎకరం 24 గుంటల భూమి ఉన్నట్టు చూపించారు. ఆ పాస్‌పుస్తకంపై మల్లయ్య నేరుగా ఎనిమిది మందికి అక్రమంగా రిజిస్ట్రేషన్లుచేశాడు. డాక్యుమెంట్ నంబర్లు: 4603/ 2007 (500 గజాలు), 4604/2007 (300 గజాలు), 4604/2007 (1200 గజాలు), 1207/2009 (210 గజాలు), 353/2009 (285 గజాలు), 7174/2007 (221 గజాలు), 5588/2007 (120 గజాలు), 5167/2007 (242 గజాలు) చొప్పున రిజిస్ట్రేషన్లు చేశాడు.

**మూడో నకిలీ పాస్‌పుస్తకం**

రెవెన్యూ అధికారులు దేశెట్టి మల్లయ్యకు మూడో నకిలీ పాస్‌పుస్తకాన్ని (టైటిల్ డీడ్ నంబర్: 685827) జారీచేశారు. విచిత్రమేమంటే.. మొదటి పాస్‌పుస్తకానికి ఉన్న టైటిల్ డీడ్ నంబర్ 685827తోనే ఈ పాస్‌పుస్తకాన్నీ జారీచేశారు. ఇందులో మాత్రం రెండు సర్వే నంబర్లు చూపించారు. 1998 సర్వే నంబర్‌లో 20 గుంటలు.. సర్వే నంబర్ 2000 లో 14 గుంటలున్నట్టు చూపారు. ఇందులో అసలు 1999/ఆ అనే సర్వే నంబర్ లేనే లేదు. కానీ ఈ పాస్‌బుక్ టైటిల్‌డీడ్‌తో, ఇందులో లేని సర్వే నంబర్ (1999/ఆ) ను చూపిస్తూ 34 గుంటల భూమిని ఆరుగురికి రిజిస్ట్రేషన్‌చేశాడు. అందులో 17 గుంటలు దేశెట్టి భూమవ్వ అనే మహిళకు అమ్మాడు. ఈమె సదరు మల్లయ్యకు మరదలు కావడం గమనార్హం. ఈ 17 గుంటలకు సంబంధించి రెవెన్యూ అధికారుల అండతో ఆన్‌లైన్ పహాణీలో, ఐబీ రికార్డుల్లో కూడా ఆమె పేరును ఎక్కించారు. (డాక్యుమెంట్ నంబర్: 5783/2007). మరో విచిత్రమేమంటే ఆమెకు ఒక ఖాతా నంబర్‌కు బదులుగా రెండు ఖాతా నంబర్లు (275, 5071) ఉండటం గమనార్హం.

**నాలుగో నకిలీ పాస్‌పుస్తకం**

రెవెన్యూ అధికారులు జారీచేసిన నాలుగో పాస్‌పుస్తకం (టైటిల్ డీడ్ నంబర్: 687059). ఇందులో కూడా 1999/ఆ సర్వేనంబర్ ప్రస్తావనే లేదు. ఈ పాస్‌బుక్ ప్రకారం 1998 సర్వేనంబర్‌లో 20 గుంటలు భూమి ఉన్నట్టు రికార్డు చూపారు. ఈ పాస్‌బుక్‌కు సంబంధించి అమ్మిన వివరాలు అందుబాటులోకి రాలేదు.

**యథేచ్ఛగా రిజిస్ట్రేషన్లు**

తొలి పాస్‌బుక్‌మీద 15కు పైగా రిజిస్ట్రేషన్ చేయగా, రెండో పాస్‌బుక్‌పైన 8, మూడో పాస్‌బుక్ మీద 9 రిజిస్ట్రేషన్లు చేశారు. ఈ లేఅవుట్‌లోని 20 ఎకరాల 9.5 గుంటలపై ఎలాంటి హక్కులు లేనప్పటికీ దేశెట్టి మల్లయ్య అతని అనుచరులు అందులోని ప్లాట్లను అమ్మేస్తున్నారంటూ, లేఅవుట్ అసలు యజమాని చెన్నూరి మల్లేశం 2007 ఆగస్టు 29, సెప్టెంబర్ 30 తేదీల్లో అప్పటి అన్ని ప్రముఖ దినపత్రికల్లో ప్రకటనలు కూడా విడుదలచేశారు. క్లియర్ టైటిల్ కలిగి, ఎలాంటి వివాదాలులేని భూమిలో లంచాలకు ఆశపడిన రెవెన్యూ అధికారులు దేశెట్టి మల్లయ్యతోపాటు స్థానిక రియల్ ఎస్టేట్‌మాఫియాతో కుమ్మక్కై వివాదాలు సృష్టించారు.



### ఫిర్యాదుచేసినా పట్టించుకోవడంలేదు

భూమిని రిజిస్ట్రేషన్ చేసుకొన్న తర్వాత మ్యుటేషన్ కూడా చేయించుకొన్నాం. మా ప్లాట్లలో ప్రహరీని నిర్మించుకుంటే, కొందరు స్థానిక రియల్ మాఫియా సభ్యులు.. రాత్రికి రాత్రి దౌర్జన్యంగా దానిని కూల్చివేసి మమ్మల్ని భయభ్రాంతులకు గురిచేస్తున్నారు. మా ఒరిజినల్ డాక్యుమెంట్లు, లింకు డాక్యుమెంట్లు, పహాణీలు, ఆన్‌లైన్ ఆర్వోఆర్, ఐబీ రికార్డులను చూపించి సిద్దిపేట పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదుచేసినా పోలీసులు పట్టించుకోవడంలేదు. అక్రమార్కులకు వత్తాసు పలుకుతూ కోర్టుకు వెళ్లాలని ఉచిత సలహా ఇస్తున్నారు. పన్నెండేండ్లుగా రెవెన్యూ ఆఫీసులచుట్టూ తిరుగుతున్నా పట్టించుకొనే నాథుడేలేడు. అక్రమాలకు పాల్పడుతున్నవారి ఆధారాలను సేకరించి 2017లో భూ రికార్డుల ప్రక్షాళన సమయంలో సిద్దిపేట తాసిల్దార్, ఆర్డీవోకు లిఖితపూర్వకంగా ఫిర్యాదుచేస్తే.. ఆ రికార్డులకు సంబంధించి తమ దగ్గర ఎలాంటి సమాచారం లేదని తాసిల్దార్ చెప్తున్నారు. ఆ నాలుగు నకిలీ పాస్‌పుస్తకాల ద్వారా అక్రమంగా జరిగిన 30 రిజిస్ట్రేషన్లను రద్దుచేయాలని కోరుతున్నా ఎవరికీ పట్టింపులేదు. ఏం చేయాలో అర్థంకాక, స్థానిక రెవెన్యూ అధికారుల సూచన ప్రకారం కోర్టుకు వెళ్లి ఇంజక్షన్ ఆర్డర్ తెచ్చుకొంటే.. కోర్టులో ఉన్నది కదా అని దాటవేస్తున్నారు. ప్రభుత్వం స్పందించి.. ఆ నాలుగు నకిలీ పాస్‌పుస్తకాలను రద్దుచేసి మాకు న్యాయంచేయాలి.

**- ప్రవళికారెడ్డి, బాధితురాలు**

## కొత్త పాస్‌బుక్ ఇప్పించండి సారూ..



పాత పాస్‌పుస్తకం చూపుతున్న వెంకటమ్మ

**చందంపేట:** నల్లగొండ జిల్లా చందంపేట మండలం కంబాలపల్లికి చెందిన ముత్యాల వెంకటమ్మకు గ్రామ శివారులోని సర్వేనంబర్ 38/3 లో మూడెకరాల భూమి ఉన్నది. ఈ భూమికి సంబంధించి ఖాతా నంబర్ 853లో పదేండ్ల క్రితమే పాస్‌బుక్ కూడా ఉన్నది. కానీ భూరికార్డుల ప్రక్షాళన అనంతరం వెంకటమ్మకు కొత్త పాస్‌పుస్తకం రాలేదు. దీంతో రెండుసార్లు రైతు బంధు పెట్టుబడి సాయం కోల్పోయారు. కొత్త పాస్‌పుస్తకం కోసం ఏడాదికాలంగా తాసిల్దార్ కార్యాలయం చుట్టూ తిరుగుతున్నారు. అయినా ఏఒక్క అధికారు కూడా పట్టించుకోలేదు. ప్రతిరోజు వీఆర్వో చుట్టూ తిరుగుతున్నా రేపు మాపు అంటున్నారు. ఇప్పటికే తాసిల్దార్ కార్యాలయం చుట్టూ 25 సార్లు తిరిగారు. ఈసారి కొత్త పాస్‌పుస్తకం రాకుంటే కార్యాలయం ఎదుటే నిరాహార దీక్ష చేస్తానంటూ తన గోడును 'ధర్మగంట'తో వెల్లబోసుకున్నారు. గ్రామంలో అందరూ పెట్టుబడి పైసలు తీసుకుంటున్నారని, కానీ తనకు భూమి ఉన్నా కొత్త పుస్తకం రాకపోవడంతో పెట్టుబడి సాయం వస్తలేదని ఆవేదన వ్యక్తంచేశారు. ఇప్పటికైనా అధికారులు పాత పాస్‌పుస్తకాన్ని పరిశీలించి కొత్త పాస్‌బుక్ ఇప్పించి న్యాయం చేయాలని కోరుతున్నారు.

## పట్టాలున్నా కబ్జా చేస్తున్నారు

### అధికారులు పట్టించుకోవడంలేదు

న్యాయం చేయకుంటే చావే శరణ్యం ▪ చేవెళ్ల మండలం పల్గుట్ట రైతు మణెమ్మ ఆవేదన




నలభై ఏండ్లుగా రంగారెడ్డి జిల్లా చేవెళ్ల మండలం పల్గుట్ట గ్రామం కందవాడ రెవెన్యూలోని 212 సర్వే నంబర్‌లోని మూడెకరాల భూమిని సాగుచేసుకుంటూ జీవిస్తున్నా. ఈ భూమికి సంబంధించి 1995లో ప్రభు త్వం ద్వారా పట్టా పొందిన పాస్‌పుస్తకాలున్నా యి. అప్పటి నుంచి ఇప్పటివరకు కాస్తులో, వన్-బీలో నా పేరే రికార్డుల్లో ఉన్నది. ఇదే పొలంలో అప్పుచేసి బోరు కూడా వేసి పంట లు పండించుకున్నాం. ఇప్పుడు ఎండలు ఎక్కువగా ఉండటంతో బోరు ఎండిపోయిం ది. దీంతో వర్షాధారంగా పంటలు పండిస్తు న్నా. నా భర్త చంద్రయ్య సమాధి కూడా ఈ సర్వేనంబర్‌లోనే ఉన్నది. కానీ నగరానికి చెందిన వ్యక్తులు వివేకానంద రెడ్డి, సాత్విక్‌రెడ్డి మే 18న ఒక డీసీఎం వ్యాన్‌లో రాతి స్తంభా లు తెచ్చి పొలంలో పాతడానికి వచ్చారు. నా పెద్ద కొడుకు జంగయ్య వెళ్లి అడ్డుకోగా.. నానా మాటలు తిట్టి చంపడానికి ప్రయత్నించారు. వారి బారి నుంచి జంగయ్య తప్పించుకొని పోలీస్‌స్టేషన్‌కు వెళ్లి సీఐ గురువయ్యగౌడ్‌కు ఫిర్యాదు చేశారు. ఆయన వెంటనే చేవెళ్ల ఏసీపీ వెంకట్‌రెడ్డి వద్దకు తీసుకొని వెళ్లగా పేపర్లను చూసి తానేమీ చేయలేనని, ఆర్డీవోను కలువాలని చెప్పారు. దీంతో చేవెళ్ల ఆర్డీవో హన్మంత్‌రెడ్డిని కలువగా.. ఆయన తమ వద్ద ఉన్న పహాణీలు, 1-బీ, పట్టా పాస్‌పుస్తకాలు చూసి 'నీ భూమిలో నువ్వుండు.. నాకు సహకరిస్తే నీ భూమి సరిచేస్తా.. లేకపోతే నీ ఇష్టం.. ఏమి చేసుకుంటావో చేసుకోపో' అని నా కొడుకు జంగయ్యను బెదిరించారు. చివరకు కలెక్టర్‌ను కూడా కలిసి ఫిర్యాదుచేశా. ఈ భూమి పేరిట రైతుబంధు కింద ఎకరాకు రూ.4వేల చొప్పున రెండుసార్లు రూ.24 వేలు కూడా ప్రభుత్వం నుంచి అందుకొన్నాం. వివేకానందరెడ్డి, సాత్విక్‌రెడ్డి మమ్మల్ని బెదిరించి మళ్లీమళ్లీ కడ్డీలు పాతుతున్నారు. కడ్డీలు తీసేస్తే చేవెళ్ల ఎస్సై మాకు ఫోన్‌చేసి ఎందుకు తీసేస్తున్నారని బెదిరిస్తున్నారు. మాకు ఈ భూమి తప్ప ఎలాంటి ఆధారం లేదు. మా భూమిని కబ్జాకోరుల నుంచి కాపాడి మాకు ఇప్పించాలి. లేకుంటే కుటుంబం మొత్తం రోడ్డు పాలవుతుంది. పురుగుల మందు తాగి చనిపోవడం తప్ప వేరే గత్యంతరం లేదు.

**- మణెమ్మ, పల్గుట్ట గ్రామం, చేవెళ్ల మండలం**

## మా మాట!

### అధికారుల తీరుమారాలి



భూరికార్డుల నిర్వహణలో కొందరు రెవెన్యూ ఉద్యోగులు చేసిన తప్పిదాలకు రైతులు, వాస్తవహక్కుదార్లు ఏండ్ల తరబడిగా ఇబ్బందులు పడుతున్నారు. కొందరు కోర్టుల చుట్టూ తిరుగుతున్నారు. సర్వేనంబర్ల వారీగా భూముల లెక్కలు, హక్కులకు సంబంధించి రెవెన్యూ రికార్డులు ఎంతో కీలకం. అలాంటి రికార్డుల నిర్వహణలో ఉద్యోగులు బాధ్యతారాహిత్యంగా వ్యవహరించడం సరికాదు. సీఎం కేసీఆర్ భూరికార్డుల ప్రక్షాళన చేపట్టినా అక్కడక్కడ పొరపాట్లు జరిగాయి. నూటికి నూరు శాతం రికార్డుల ప్రక్షాళన చేపట్టి వాస్తవ హక్కుదార్ల వివరాలన్నీ ఆన్‌లైన్‌లో పొందుపర్చాలి. యాజమాన్య హక్కులు, పాస్‌పుస్తకాల జారీలో ముున్ముందు ఎలాంటి పొరపాట్లకు తావివ్వకుండా అధికారులు పకడ్బందీగా వ్యవహరించాలి.

**- మిర్యాల మురళి, మిర్యాలగూడ, నల్లగొండ జిల్లా**

### సీఎం కేసీఆర్ నిర్ణయం భేష్



రైతులు పాస్‌పుస్తకాల కోసం తాసిల్ కార్యాలయాల చుట్టూ ఏండ్ల తరబడి తిరుగడం ఎంతో బాధాకలిగించేది. ఎన్నిసార్లు తిరిగినా రైతుల సమస్యలను పట్టించుకున్న నాథుడే లేకుండె. అలాంటిది సీఎం కేసీఆర్ చేపట్టిన భూరికార్డుల ప్రక్షాళనతో రైతుల సమస్యలు కొంత మేర పరిష్కారమయ్యాయి. రెవెన్యూ శాఖ ప్రక్షాళనతో భూసమస్యలు పూర్తిస్థాయిలో పరిష్కారమవుతాయని భావిస్తున్నాం. దీనికితోడు 'నమస్తే తెలంగాణ' చేపట్టిన ధర్మగంట రైతు సమస్యల పరిష్కారానికి ఎంతో దోహదపడుతున్నది. సీఎం కేసీఆర్ నిర్ణయాలు భేష్.

**- కుంభం నర్సింహ్మ, బాలిశెట్టిగూడెం, శాలిగౌరారం మండలం, నల్లగొండ జిల్లా**

IFFCO ఇండియన్ ఫార్మర్స్ ఫెర్టిలైజర్ కో-ఆపరేటివ్ లి.

100 శాతం నీటిలో కరిగే రసాయన ఎరువుల మిశ్రమం యొక్క నిల్వ మరియు అమ్మకం సంబంధిత ప్రకటన యఫ్.సి.ఒ. 1985 ఆర్డర్ – రిక్వైర్‌మెంట్ నెం. 2900(ఇ) తేది 24 అక్టోబర్ 2015ని దయచేసి చూడగలరు.

భారత ప్రభుత్వ వ్యవసాయ మంత్రిత్వ శాఖచే జారీ చేయబడిన ఆర్డర్ నం. 2900(ఇ) తేది: 24 అక్టోబర్ 2015 మరియు వాటి తరువాత చేయబడిన సవరణలను అనుసరించి సాధారణ ప్రజానీకానికి ఈ క్రింది విషయమును తెలియచేయుచున్నాము. ఈ ఆర్డరు ప్రకారం 100 శాతం నీటిలో కరిగే రసాయనిక ఎరువుల మిశ్రమాలు ఎన్.పి.కె. (19:19:19:) ఎన్.పి.కె. (18:18:18) తెలంగాణ రాష్ట్రంలో నిల్వ మరియు అమ్మకము ఇండియన్ ఫార్మర్స్ ఫెర్టిలైజర్ ఆపరేటివ్ లి|| వారిచే గావింపబడును.

| వివరము | 19:19:19 | 18:18:18 |
|---|---|---|
| 1. మొత్తం నైట్రోజన్, బరువు ద్వారా శాతం (కనిష్ఠం) | 19 | – |
| 2. నైట్రేట్ నైట్రోజన్, బరువు ద్వారా శాతం (కనిష్ఠం) | 1.5 | – |
| 3. యూరియా నైట్రోజన్, బరువు ద్వారా శాతం (కనిష్ఠం) | – | 18 |
| 4. అమోనియా నైట్రోజన్, బరువు ద్వారా శాతం (కనిష్ఠం) | 3.5 | – |
| 5. నీటిలో కరిగే భాస్వరం, బరువు ద్వారా శాతం (కనిష్ఠం) | 19 | 18 |
| 6. నీటిలో కరిగే పోటాషియం, బరువు ద్వారా శాతం (కనిష్ఠం) | 19 | 18 |
| 7. సల్ఫర్, బరువు ద్వారా శాతం (కనిష్ఠం) | – | 6.1 |
| 8. తేమ, బరువు ద్వారా శాతం (గరిష్ఠం) | 0.5 | 0.5 |

తేది: 07.06.2019 ఇట్లు స్టేట్ మార్కెటింగ్ మేనేజరు, ఇఫ్‌కో-తెలంగాణ

రాష్ట్ర కార్యాలయము: డో.నం. 10-5-22, మాసబ్ ట్యాంక్, హైదరాబాద్-500028, తెలంగాణ, ఫోన్ నం. 040-23399692



దక్షిణాఫ్రికాతో ప్రపంచకప్ మ్యాచ్‌లో ధోనీ ధరించిన గ్లౌవ్స్‌పై ఐసీసీకి ఉన్న అభ్యంతరం ఏమిటో నాకు అర్థం కావడం లేదు. టెరిటోరియల్ ఆర్మీ ప్యారాచూట్ రెజిమెంట్‌లో లెఫ్టినెంట్ కల్నల్ హోదాలో ఉన్న ధోనీ నుంచి స్ఫూర్తి పొందే అభిమానులు ఎంతోమంది ఉన్నారు. 'బలిదాన్' గుర్తు ఉన్న గ్లౌవ్స్ వల్ల ఐసీసీకి వచ్చిన సమస్య ఏమిటీ?


**ఆర్పీ సింగ్, భారత మాజీ క్రికెటర్**



ఏ ఆటగాడైనా నియమ, నిబంధనలు పాటించాల్సిందే. ఐసీసీ నిర్దేశిత ప్రమాణాలకు అనుగుణంగా లేకపోతే ధోనీ గ్లౌవ్స్‌పై గుర్తును తీసేసి మ్యాచ్‌లు ఆడాలి.

**బైచుంగ్ భూటియా, భారత మాజీ ఫుట్‌బాల్ కెప్టెన్**

**చరిత్రలో నేడు**



**1812**

స్పెన్సర్ పర్సెవల్స్ హత్య నేపథ్యంలో యునైటెడ్ కింగ్‌డమ్ ప్రధానిగా రాబర్ట్ జెన్‌కిన్సన్.

**1946**



ఇండోనేషియాలో వలసవాద ధిక్కారానికి పిలుపునిచ్చిన సుకర్ణో.




**1968**

రాజ్యాంగాన్ని ఆవిష్కరించుకున్న బెర్ముడా.

చైనా అధ్యక్షుడు జీ జిన్‌పింగ్ బుధవారం రష్యా చేరుకున్నారు. రెండు దేశాలు తమ సంబంధాలను ఉన్నత స్థాయికి తీసుకుపోవాలని నిర్ణయించాయి. పాశ్చాత్య దేశాలు ఈ పర్యటనను అమెరికా, చైనా వాణిజ్య యుద్ధం నేపథ్యంలోనే చూస్తున్నాయి. కానీ బయటిశక్తుల ప్రభావానికి అతీతంగా ఆంతరంగిక కారణాల వల్లనే రెండు దేశాలు దగ్గరవుతున్నాయి. అంతర్జాతీయ సమస్యలపై రెండు దేశాలకు ఒకే వైఖరి ఉన్నది. పరస్పర వాణిజ్య ప్రయోజనాలు సాన్నిహిత్యాన్ని పెంచుతున్నాయి. రెండు దేశాల మధ్య వివాదాలను శాంతియుతంగా పరిష్కరించుకోవాలని భావిస్తున్నాయి.

**గ్లోబల్ టైమ్స్**

అమెరికా అధ్యక్షుడు ట్రంప్ తాను ఎంతో చతురతతో బేరసారాలు సాగిస్తానని గట్టిగా నమ్ముతారు. కానీ చైనాతో వాణిజ్య యుద్ధం, మెక్సికోతో విదేశాంగ విధానాన్ని వ్యాపారంతో కలగలపడం ఆయనలోని లోపాలను ఎత్తిచూపుతున్నాయి. మెక్సికోతో వాణిజ్య ఒప్పందం తమ దేశ ప్రయోజనాలకు భంగకరంగా ఉందంటూ, ట్రంప్ దానిని ఏకపక్షంగా రద్దు చేసుకున్నారు. దీంతో మెక్సికో ఇటీవలే అమెరికా, కెనెడా దేశాలతో కొత్త ఒప్పందం కుదుర్చుకున్నది. కానీ కొత్త ఒప్పందాన్ని అమెరికా చట్టసభ ధ్రువీకరించే లోపే, ట్రంప్ మెక్సికో ఉత్పత్తులపై కొత్త సుంకాలు విధించాడు!

**సౌత్ చైనా మార్నింగ్ పోస్ట్**



# సూడాన్ సంక్షోభం

అరబ్బు ప్రాంతమంతా వైషమ్యాలతో అట్టుడుకుతున్న తరుణంలో ఈశాన్య ఆఫ్రికాలోని సూడాన్‌లో తలెత్తిన సంక్షోభం తీవ్ర ఆందోళన కలిగిస్తున్నది. ప్రజాస్వామ్య ఉద్యమకారులపై సైనిక ప్రభుత్వం కాల్పులు జరుపడంతో 113 మంది మరణించారు. వందలాది మంది గాయపడ్డారు. సూడాన్‌లో సైనిక ప్రభుత్వానికి, ప్రజాస్వామ్యవాదులకు పోరాటం సాగుతున్న మాట నిజమే. కానీ తరచిచూస్తే ఇందులో విదేశీ శక్తుల ప్రమేయమే ప్రధానమైందిగా కనబడుతున్నది. సిరియా, లిబియాల మాదిరిగానే సూడాన్ సంక్షోభంలోకి జారుకుంటున్నదనే భయాందోళనలు వ్యక్తమవుతున్నాయి. కొంతకాలంగా సూడాన్ ఎదుర్కొంటున్న సంక్షోభానికి మూలం అమెరికా విధించిన ఆంక్షలే. ఈ ఆంక్షల మూలంగా తంటాలు పడుతున్న సూడాన్‌కు ఐఎంఎఫ్ మరికొన్ని షరతులు విధించింది. సబ్సిడీలు ఎత్తివేయాలని, సంక్షేమ పథకాలు తగ్గించుకోవాలని సూచించింది. ఇంధనం, ఆహారంపై సబ్సిడీలు ఎత్తివేయడంతో దేశాధ్యక్షుడు ఒమర్ అల్ బషీర్‌కు వ్యతిరేకంగా నిరసనలు మొదలయ్యా యి. నిరసనలను అణిచివేసేందుకు అధ్యక్షుడు బషీర్ గతేడాది డిసెంబర్‌లో ఎమర్జెన్సీ విధించాడు. ముప్పై ఏండ్లుగా అధికారంలో ఉన్న బషీర్ రాజీనామా చేయాలంటూ ఉద్యమం తీవ్రమైంది. ఉద్యమకారులకు నాయకత్వం వహిస్తున్న కొన్నివర్గాలు ప్రభుత్వాన్ని కూలదోయవలసిందిగా సైన్యాన్ని కోరడం విచిత్రం. దీనివల్ల మొత్తం ప్రజా ఉద్యమమే పక్కదోవ పట్టింది. సైన్యం అధికారాన్ని చేజిక్కించుకొని ప్రజాస్వామ్యాన్ని స్థాపిస్తుందనే అభిప్రాయాన్ని కలిగించారు. బషీర్ ప్రభుత్వానికి వ్యతిరేకంగా పోరాడిన వైద్యులు, న్యాయవాదులు ఇతర వృత్తులవారు ఇప్పుడు సైనిక పాలనకు వ్యతిరేకంగా ఉద్యమం సాగించవలసి వస్తున్నది.

ప్రజా ఉద్యమాన్ని సాకుగా చూపి బషీర్ ప్రభుత్వాన్ని కూలదోసిన సైన్యం మొదట్లో ఉద్యమకారులతో ఒప్పందానికి వచ్చింది. మూడేండ్ల పాటు పరివర్తనా ప్రభుత్వం ఏర్పడి, పాత వ్యవస్థ అవశేషాలు తొలిగించిన తర్వాత ఎన్నికలు జరుపాలనేది సైనిక ప్రభుత్వానికి, ఉద్యమకారులకు మధ్య కుదిరిన ఒప్పందం. ఎన్నికలు జరిపే వరకు సార్వభౌమ మండలి, మంత్రిమండలి, శాసనసభ ఉండాలనే అంగీకారం కుదిరింది. పరిపాలనారంగంలో తమ పాత్ర ఉంటుందని ప్రజాస్వామ్యవాదులు భావించారు. కానీ సైనికాధికారుల వైఖరి మారిపోయింది. దీంతో సైనిక ప్రభుత్వానికి వ్యతిరేకంగా మళ్ళా ఉద్యమం మొదలైంది. సైనిక పాలకులు ఉద్యమకారులతో కుదుర్చుకున్న ఒప్పందాన్ని రద్దు చేసుకుంటున్నట్టు ప్రకటించి ప్రదర్శకులపై తీవ్రంగా అణిచివేత ప్రారంభించారు. ప్రజాస్వామ్య ఉద్యమకారుల పరిస్థితి పెనంపై నుంచి బొర్లి పొయ్యిలో పడ్డట్టయింది. ప్రజా ఉద్యమం పేరుతో అంతిమంగా అమెరికా లక్ష్యం నెరవేరింది. తమకు వ్యతిరేకంగా ఉన్న బషీర్ ప్రభుత్వాన్ని కూల్చివేయడంతోపాటు తమకు అనుకూలంగా ఉండే సైనిక ప్రభుత్వాన్ని నెలకొల్పగలిగింది. బహిరంగంగా అమెరికా సూడాన్ వ్యవహారాలతో సంబంధం లేనట్టు వ్యవహరిస్తున్నది. హింసాకాండను ఖండిస్తూ శాంతిని నెలకొల్పాలని పిలుపు ఇస్తున్నది. మరో వైపు సౌదీ అరేబియా, యునైటెడ్ ఎమిరేట్స్, ఈజిప్టు మొదలైన దేశాల ద్వారా సూడాన్‌లోని సైనిక ప్రభుత్వానికి మద్దతు ఇస్తున్నది.

**ప్రజా ఉద్యమం పేరుతో అంతిమంగా అమెరికా లక్ష్యం నెరవేరింది. తమకు వ్యతిరేకంగా ఉన్న బషీర్ ప్రభుత్వాన్ని కూల్చివేయడంతోపాటు తమకు అనుకూలంగా ఉండే సైనిక ప్రభుత్వాన్ని నెలకొల్పగలిగింది. బహిరంగంగా అమెరికా సూడాన్ వ్యవహారాలతో సంబంధం లేనట్టు వ్యవహరిస్తున్నది. హింసాకాండను ఖండిస్తూ శాంతిని నెలకొల్పాలని పిలుపు ఇస్తున్నది. మరో వైపు సౌదీ అరేబియా, యునైటెడ్ ఎమిరేట్స్, ఈజిప్టు మొదలైన దేశాల ద్వారా సూడాన్‌లోని సైనిక ప్రభుత్వానికి మద్దతు ఇస్తున్నది.**

ప్రచ్ఛన్న యుద్ధకాలంలో సౌదీ అరేబియా, యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్, కువైట్ వంటి దేశాలు అమెరికా వైపు ఉండగా, ఇరాక్, లిబియా, సిరియా వంటి దేశాలలో అరబ్బు జాతీయవాదం, సామ్యవాదం, పాశ్చాత్య వలసవాద వ్యతిరేకత ప్రాతిపదికగల ప్రభుత్వాలు ఉండేవి. ఇప్పుడు అమెరికా ఆధిపత్యానికి ఎదురులేకపోవడంతో అరబ్ దేశాలలో తమకు వ్యతిరేకంగా ఉన్న పాలక వ్యవస్థలను కూలదోయాలని, దేశాల భౌగోళిక స్వరూపాలను మార్చాలని ప్రయత్నిస్తున్నది. ఇరాన్‌పై ఆంక్షలు విధించిన అమెరికా మరోవైపు సౌదీ అరేబియా తదితర దేశాల ద్వారా అస్థిరత్వాన్ని వివిధ దేశాలలో సంక్షోభాన్ని సృష్టిస్తున్నది. హౌతీలో అంతర్యుద్ధం ఇందుకు ఉదాహరణ? హౌతీలో ప్రభుత్వాన్ని కూలదోయడానికి సౌదీ అరేబియా ద్వారా అంతర్యుద్ధాన్ని సృష్టించింది. హౌతీలో సౌదీ అరేబియాకు మద్దతుగా ఇప్పుడు సూడాన్ ప్రభుత్వం సైనిక బలగాలను పంపింది. సూడాన్‌లో కొంతకాలం సైనిక పాలన సాగించిన తర్వాత గతంలో ఊచకోతలకు పాల్పడిన ముఠా నాయకుడు హెమెటిని పాలకుడిని చేయాలని పాశ్చాత్య దేశాలు భావిస్తున్నాయి. హెమెటి ఆఫ్రికా- అరబ్బు ప్రాంతాలలో సౌదీ అరేబియాకు తోడుగా అమెరికా వ్యూహాన్ని అమలుపరుచవచ్చు. ఇప్పటికే పాశ్చాత్య దేశాల రాయబారులు హెమెటితో మంతనాలు జరుపుతున్నారు. అమెరికా-సౌదీ అరేబియా పన్నాగాలకు వ్యతిరేకంగా ఖతర్, టర్కీ ఇస్లామిక్ దళాలకు మద్దతు ఇస్తున్నాయి. భద్రతా మండలి చేత తమ అనుకూల తీర్మానాన్ని చేయించాలన్న అమెరికా ప్రయత్నాలను చైనా, రష్యా అడ్డుకున్నాయి. ఆఫ్రికా దేశాలు మాత్రం సైనిక ప్రభుత్వాన్ని వ్యతిరేకిస్తున్నాయి. ఇప్పటికే సూడాన్ విదేశీశక్తుల మధ్య ఘర్షణకు వేదికగా మారే ప్రమాదం ఏర్పడ్డది. అంతర్జాతీయ సమాజం కల్పించుకొని ఐక్యరాజ్యసమితి ద్వారా సూడాన్‌లో ప్రజాస్వామ్య స్థాపనకు సహకరించాలె.

**జనగళం**

### ఆదర్శంగా నిలువాలె

రాష్ట్రంలో గత ఆర్నెళ్లుగా ఎన్నికలే జరిగాయి. అసెంబ్లీ నుంచి మొదలు మొన్నటి, లోక్‌సభ, స్థానిక సంస్థల ఎన్నికల దాకా రాష్ట్రంలో హడావిడి కొనసాగింది. ఎన్నికల నేపథ్యంలో రాష్ట్రంలో ఎన్నికల కోడ్ అమలయ్యింది. దీంతో ఎక్కడిక్కడ అభివృద్ధి పనులు స్తంభించిపోయాయి. ఇప్పుడు రాష్ట్రంలో ఎన్నికలు ముగిశాయి. అయితే ఇప్పుడు రాష్ట్రంలో ఎన్నికల కోడ్ కూడా లేదు. కాబట్టి అభివృద్ధి పనులు శ్రీకారం చుట్టాల్సిన అవసరం ఎంతైనా ఉన్నది. అసెంబ్లీ నుంచి మొన్నటి స్థానిక సంస్థల ఎన్నికల దాకా ప్రజలు టీఆర్ఎస్‌కే పట్టం కట్టారు. ఈ నేపథ్యంలో ప్రజా సమస్యలను పరిష్కరించాల్సిన అవసరం ఎంతైనా ఉన్నది. రాష్ట్రం అభివృద్ధి పథంలో ముందుకు వెళ్తూ ఆదర్శంగా నిలువాలె.

**- కొలిపాక శ్రీనివాస్, సముద్రాల, హుస్నాబాద్**

### కఠినంగా వ్యవహరించాలె

జీవనోపాధి కోసం తెలంగాణ యువత గల్ఫ్ దేశాలకు వలస పోతున్నది. అయితే నకిలీ ఏజెంట్ల బారిన పడిన ఎందరో అభాగ్యులు మోసపోతున్నారు. ఒక పని విషయంలో ఒప్పందం కుదుర్చుకొని తీరా అక్కడికి వెళ్లినాక గొర్లు, ఒంటెలు కాసే పనులను చూపించారంటూ ఇటీవల ఓ వీడియో సామాజిక మాధ్యమాల్లో వెలుగు చూసింది. కాబట్టి రాష్ట్ర ప్రభుత్వం నకిలీ ఏజెంట్ల పట్ల కఠినంగా వ్యవహరించాలి. మోసపోయిన యువకులకు ప్రభుత్వం రక్షణగా ఉండాలి.

**- పుల్కం సంపత్‌కుమార్, రాములపల్లె, పెగడపల్లి, జగిత్యాల**

### అభినందనీయం

'నమస్తే తెలంగాణ' పత్రిక ధర్మగంట శీర్షికన రెవెన్యూ అధికారుల లీలలను ఒక్కొక్కటిగా వెలుగు చూపిస్తున్నది. కొందరు అధికారుల ఆగడాలను చూస్తుంటే విస్తుపోవాల్సిన పరిస్థితి దాపురిస్తున్నది. 'నమస్తే తెలంగాణ' పత్రిక ఇలా బాధితుల పక్షాన ఉంటూ రెవెన్యూ సమస్యలను పూర్తిస్థా యిలో పరిష్కరిస్తుండటం అభినందనీయం. అధికారులు ఇకనైనా ప్రజలకు పారదర్శక పాలన అందించాలి.

**- నారదాసు రాజేందర్, ఉప్పల్, హైదరాబాద్**

**ఉత్తరాలు, రచనలు పంపవలసిన చిరునామా:** 8-2-603/1/7,8,9, కృష్ణాపురం, రోడ్‌నంబర్.10, బంజారాహిల్స్, హైదరాబాద్-500034. editpage@ntnews.com Fax-040-23291118

**ముక్తసరి**



**దేవులపల్లి ప్రభాకరరావు**

# 'తా వలచింది రంభ...'

**17వ లోక్‌సభ ఎన్నికల్లో భారత్ కంటే పాకిస్థాన్ ఎక్కువ ప్రాధాన్యం పొందడం విశేషం. ఈ ఎన్నికల్లో ఓటర్ల తీర్పును భారత్ పేదరికం కంటే పాక్ ప్రమాదం ఎక్కువగా ప్రభావితం చేసిందంటే అతిశయోక్తి కాదు. పాక్ ప్రమాదాన్ని, టెర్రరిజం ముప్పును ఎదుర్కోవాలంటే తనవంటి గట్టి నాయకుడిని ఎన్నుకోవాలని మోదీజీ భారత ప్రజలకు, ఓటర్లకు నేరుగా చెప్పారు. ఆయన మాటను గౌరవించి దేశ ప్రజలు ఆయనే గట్టి నాయకుడని ఘంటాపథంగా తేల్చిచెప్పారు.**

తా వలచింది రంభ, తా మునిగింది గంగ.. అంటారు పెద్దలు. తనకు ఇష్టమైనది రంభను మించిన సుందరాంగి; తాను మునిగింది ఊరవతలి మురికి కాలువైనా గంగా ప్రవాహం కంటే పవిత్రమైన ఝరి వలె కన్పిస్తుంది. మిత్రుడు యాదగిరి తండ్రి రంగయ్య తన ముద్దుల మనుమడికి చిలుకకు చెప్పినట్లు చెప్పినాడు ఆ సంబంధం అసలే వద్దని. నాసాలో పెద్ద ఉద్యోగంలో ఉన్న మనుమడు తాత మాటను ఖాతరు చేయలేదు-ఆర్నెల్లకే తలాక్ చెప్పక తప్పలేదు. ఇటీవల, జోరు, హోరు, పోరు ప్రచారం రెండు నెలలు కొనసాగిన తర్వాత 17వ లోక్‌సభ ఎన్నికల వాతావరణం చల్లబడినట్లు, విపరీతంగా చెలరేగిన 'తూతూమైమై' దుమారం తగ్గినట్లు అనిపిస్తున్నది. అసలు బలమేదో, నకిలీ బలమేదో క్రమంగా స్పష్టంగా వెల్లడవుతున్నది.

ఇటీవలి 17వ లోక్‌సభ ఎన్నికల ప్రచారంలో, జాతీయ స్థాయిలో తిట్లు, దూషణలు, ఆరోపణలు, ప్రత్యారోపణలు, నిందలు గతంలో ఎన్నడూ లేనంతగా దిగజారాయని, ఉన్నత ప్రమాణాలు మచ్చుకైనా కన్పించలేదని 1951 నుంచి ఎన్నికల రంగంలో అనుభవం ఉన్నవారు అంటున్నారు; 'భారత ప్రజాస్వామ్యం ఎటూ నీ పయనం' అంటూ వాపోతున్నారు. పాలక పక్షం బీజేపీ ఎన్నికల ప్రచారానికి అన్నీ తానై సారథ్యం వహించిన ప్రధాని మోదీజీ అతి చాకచక్యంతో వ్యవహరించారు; ఆయన అఖండ ప్రచారంలో ఎన్నడూ ఎక్కడా మాట వరుసకైనా తమ గత ఐదేండ్ల పాలనలో సామాన్యుల బతుకులు బాగుపడటానికి తమ ప్రభుత్వం ఏం చేసిందో చెప్పలేదు 'మీ ప్రభుత్వం మా కోసం ఏం చేసిందని' నిరుపేద ఓటర్లు అడుగలేదు. తొలిసారి అధికారంలోకి వచ్చేందుకు 2014లో 16వ లోక్‌సభ ఎన్నికల సమయాన మోదీజీ పుంఖానుపుంఖంగా, నాలుగు చేతులతో కుప్పించిన హామీలలో ఒక్కటైనా అమలుకాలేదని ఈ దేశంలోని పేద ప్రజలకు, ఓటర్లకు బాగా తెలుసు. అయినా, కనీసం 2014 ఎన్నికల వాగ్దానాలను నెరవేర్చడానికైనా 2019లో తిరిగి ఆయనకే అధికారాన్ని అప్పగించడం మేలని ఓటర్లు భావించి ఉంటారు. 2014 హామీలు నెరవేరేవరకు దేశ ప్రజలు మోదీజీని, ఆయన పార్టీని వదిలిపెట్టకపోవచ్చు! తమ జీవిత సమస్యలను, వాటి పరిష్కార మార్గాలను ప్రస్తావించకుండా, 2014 ఎన్నికల వాగ్దానాలు, హామీల సంగతి ఏమైందో చెప్పకుండా మోదీజీ పుల్వామా వధ అనంతరం పాకిస్థాన్‌లోకి వీరోచితంగా చొచ్చుకపోయి బాలాకోట్ టెర్రరిస్టు శిబిరంపై బాంబులు కురిపించామని అనర్గళంగా ప్రసంగించినప్పుడు ప్రజలు, ఓటర్లు జోష్‌తో పొంగిపోయారు. కళ్లు మూసుకొని మరో ఆలోచన లేకుండా కమలం బటన్ నొక్కారు. సమయానికి పుల్వామా, బాలాకోట్ ముచ్చట అందకపోతే మోదీజీ ఎన్నికల ప్రచార సభలలో ఏం మాట్లాడేవాడన్న ధర్మ సందేహం యాదగిరి వంటి కొందరికి కలుగకపోలేదు. పుల్వామా కాకపోతే మరో నామా-మోదీజీగామా అవతారమెత్తడానికి ఏదో ఒకటి. పెద్ద నోట్లు రద్దు చేసినప్పుడు ఇక టెర్రరిజం అంతమవుతుందని మోదీజీ దేశ ప్రజలకు భరోసానిచ్చారు. కానీ, టెర్రరిజం నడ్డి విరుగలేదు. నయా రూపంలో, శ్రీనగర్ సమీపంలోనే పుల్వామా దాడి జరిగి మన సీఆర్‌పీఎఫ్ జవాన్లు 40 మంది మరణించడానికి కారణమైంది. పుల్వామా ప్రస్తావన లేకపోతే మోదీ జీ ఎన్నికల ప్రసంగాలు దేశ ప్రజల్లో, ఓటర్లలో దేశభక్తిని రగిలించడం, ఓట్ల పండుగ చేసుకోవడం సాధ్యం కాకపోయేది.

17వ లోక్‌సభ ఎన్నికల్లో భారత్ కంటే పాకిస్థాన్ ఎక్కువ ప్రాధాన్యం పొందడం విశేషం. ఈ ఎన్నికల్లో ఓటర్ల తీర్పును భారత్ పేదరికం కంటే పాక్ ప్రమాదం ఎక్కువగా ప్రభావితం చేసిందంటే అతిశయోక్తి కాదు. పాక్ ప్రమాదాన్ని, టెర్రరిజం ముప్పును ఎదుర్కోవాలంటే తనవంటి గట్టి నాయకుడిని ఎన్నుకోవాలని మోదీజీ భారత ప్రజలకు, ఓటర్లకు నేరుగా చెప్పారు. ఆయన మాటను గౌరవించి దేశ ప్రజలు ఆయనే గట్టి నాయకుడని ఘంటాపథంగా తేల్చిచెప్పారు. వార్షిక అభివృద్ధి రేటు క్షీణిస్తున్నదని, గత నాలుగున్నర దశాబ్దాలలో ఎన్నడూ లేనంతగా నిరుద్యోగ సమస్య తీవ్రరూపం ధరించిందని వెల్లడయినప్పటికీ జనం తీర్పు శిరోధార్యం. 'తా వలచిందే రంభ' అన్నట్లు జనం మెచ్చి నవాడే దేశాధినేత. ఆకలిమంటలు దహిస్తున్న వాళ్లకు మతతత్వం, మత బోధనలు తలకెక్కవని స్వామి వివేకానందుడు, గాంధీజీ చెప్పిన మాట కు భిన్నంగా ఈ ఎన్నికల్లో ఇండియన్ ఓటర్లు తీర్పు ఇవ్వడం విచిత్రం. స్వతంత్ర భారతదేశం గత డెబ్బై ఏండ్లలో చేసిన యుద్ధాలన్నిటిలో గొప్ప ది 1965 భారత్-పాక్ యుద్ధం. అప్పటి ప్రధాని లాల్‌బహద్దుర్ శాస్త్రి 'జై జవాన్ -జై కిసాన్' నినాదంతో ఆ యుద్ధంలో ఘన విజయం సాధించారు పాక్ పాటన్‌టాంకులు పంజాబ్ (భారత్) పొలాలలో ధ్వంసమైనాయి; ఈగల వంటి మన గ్నాట్ విమానాలు భారీ పాక్ యుద్ధ విమానాలను ధ్వంసం చేశాయి; భారత సేనలు లాహోర్ వరకు పురోగమించాయి. పాకిస్థాన్ కాళ్లబేరానికి వచ్చింది. అయినా లాల్‌బహద్దుర్ శాస్త్రి విర్రవీగలేదు, రొమ్ము విరువలేదు. ఆయన ఆరడుగుల మనిషి కాడు, అరువై అంగుళాల ఛాతీ లేదు. కానీ, నిజానికి ఆయనే చాలా గట్టి నాయకుడు.

**తన విదేశీ పర్యటనల వల్లనే ప్రపంచమంతటా భారతదేశం గురించి తెలిసిందని మోదీజీ పదేపదే అంటారు. మోదీజీ కంటే ఎంతో ముందు, ఆయన పుట్టక ముందు, స్వామి వివేకానంద, విశ్వకవి రవీంద్రనాథ్ ఠాగోర్, గాంధీ మహాత్ముడు, జవహర్‌లాల్ నెహ్రూ వంటి మహా పురుషలెందరో ప్రపంచమంతటా పర్యటించి భారతదేశ ఔన్నత్యాన్ని వివరించారు.**

17వ లోక్‌సభ ఎన్నికల నాటికి భారత ప్రజాస్వామ్య వ్యవస్థ పరిణతి చెందలేదు కానీ పరిధి పెరిగింది. 1951లో మొదటి సాధారణ ఎన్నికల ప్రక్రియ ప్రారంభమయ్యే నాటికి దేశ జనాభా 36 కోట్లు. ఓటర్ల సంఖ్య అంతకన్న చాలా తక్కువ. 1985లో అప్పటి ప్రధాని రాజీవ్‌గాంధీ 18 ఏండ్ల వయసున్న యువతీయువకులందరికీ ఓటు హక్కు కల్పించడం వల్ల సగటున ఏటా రెండు కోట్ల చొప్పున ఓటర్ల సంఖ్య దేశమంతటా పెరుగుతున్నది. 17వ లోక్‌సభ ఎన్నికల నాటికి ఓటర్ల సంఖ్య 90 కోట్లు; ఇన్ని కోట్ల మంది ఓటర్లతో ప్రపంచంలో మనదే అన్నటికంటే పెద్ద ప్రజాస్వామ్య వ్యవస్థ అని గర్వపడుతున్నాం. గర్వపడవలసిందే. అయితే, తమ ఓటు విలువైనదని, రాజ్యాంగాన్ని, భారత ప్రజాస్వామ్య వ్యవస్థను పరిరక్షించడంలో తమ ఓటుహక్కు, ఓటు ఆయుధం కీలక పాత్ర నిర్వహించగలుగుతుందని గుర్తించిన, గ్రహించిన చైతన్యవంతులు ఎందరు అన్నది ముఖ్య ప్రశ్న. ఓటుహక్కును వినియోగించుకోవాలన్న, వృథా చేయరాదన్న సామాజిక, ప్రజాస్వామ్య స్పృహ ఉన్నవారు ఎందరు? మొన్నటి ఎన్నికల్లో ఓటు హక్కున్న 90 కోట్ల మందిలో దేశమంతటా కేవలం 60 కోట్ల మంది మాత్రమే (మూడింట రెండు వంతుల మంది మాత్రమే) ఓటు హక్కును వినియోగించుకున్నారని కేంద్ర ఎన్నికల కమిషన్ వెల్లడించింది. ప్రధాని మోదీకి, ఆయన పార్టీ జాతీయ అధ్యక్షుడికి, ఆయన పార్టీకి చెందిన ఇతర నేతలకు క్లీన్‌చిట్‌లు ఇవ్వడంలో ఎక్కడ, ఎన్నడులేని శ్రద్ధాసక్తులను విధేయతతో ప్రదర్శించిన కేంద్ర ఎన్నికల కమిషన్ 17వ లోక్‌సభ ఎన్నికలను నిష్పాక్షికంగా నిర్వహించలేకపోయిందన్న విమర్శలు చెలరేగాయి. ఇన్ని విమర్శలు కేంద్ర ఎన్నికల కమిషన్ మీద ఇంతకుముందెన్నడు చెలరేగలేదని ఈసీతో గతంలో సంబంధం ఉన్న ఉన్నతాధికారులు విస్మయపడుతున్నారు. అమెరికా, రష్యా, బ్రిటన్, ఫ్రాన్స్, జర్మనీ, ఇటలీ, జపాన్ దేశాల మొత్తం జనాభా కంటే మన మొత్తం ఓటర్ల సంఖ్య ఎక్కువయినప్పటికీ ఇటీవల ఎన్నికల్లో 67 చిల్లర శాతం ఓటర్లే తమ ఓటు హక్కును వినియోగించుకోవడం, అందులో 37.46 శాతం ఓట్ల తోనే మోదీజీ రెండవసారి అధికారం చేపట్టడం, ఆయన పార్టీ (బీజేపీ) గెలిచిన లోక్‌సభ స్థానాల సంఖ్య 303 దగ్గరే నిలిచి పోవడం మీడియాలో కొందరు అతిశయోక్తులతో ప్రచారం చేస్తున్నట్లు ఘన విజయం కాదు అని నిష్పాక్షిక జాతీయ, అంతర్జాతీయ విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. తమ పార్టీలో నిలువునా పెద్ద చీలిక సంభవించి మొరార్జీ దేశాయి నాయకత్వంలో మితవాదులందరూ బయటికి వెళ్లి సంయుక్త సోషలిస్ట్ పార్టీ, ప్రజా సోషలిస్ట్ పార్టీ, స్వతంత్ర పార్టీ, భారతీయ జనసంఘ్ (ఇప్ప టి బీజేపీ) తదితర పార్టీలతో కూటమి పెట్టి తనను ఓడించడానికి కంకణం కట్టినప్పుడు (మోదీజీ పరిభాషలో చెప్పాలంటే మిలావత్ అయినప్పుడు) ఇందిరాగాంధీ ఒంటరిగా 1971 లోక్‌సభ ఎన్నికల రంగంలో దిగి 43.68 ఓట్లతో 352 స్థానాలు (అప్పుడు లోక్‌సభలో మొత్తం స్థానాలు 518 మాత్రమే) గెలిచారు. అదా ఘన విజయం, ఇదా ఘన విజయం?

తన విదేశీ పర్యటనల వల్లనే ప్రపంచమంతటా భారతదేశం గురించి తెలిసిందని మోదీజీ పదేపదే అంటారు. మోదీజీ కంటే ఎంతో ముందు, ఆయన పుట్టక ముందు, స్వామి వివేకానంద, విశ్వకవి రవీంద్రనాథ్ ఠాగోర్, గాంధీ మహాత్ముడు, జవహర్‌లాల్ నెహ్రూ వంటి మహా పురుషలెందరో ప్రపంచమంతటా పర్యటించి భారతదేశ ఔన్నత్యాన్ని వివరించారు. 2014 ఎన్నికల్లో 31 శాతం ఓట్లతో మోదీజీ తొలిసారి అధికారం చేపట్టారు. మొన్నటి ఎన్నికల్లో ఆయన పార్టీకి వచ్చినవి 37 శాతం ఓట్లు. ఐదేండ్ల పాలనలో ఆయనకు, ఆయన పార్టీకి అదనంగా చేరినవి 6 శాతం ఓట్లు మాత్రమే. ఇక తమ పార్టీ బీజేపీ దేశంలో బహిష్కృతం కాదని, తమది ఉత్తర భారతదేశం పార్టీ కాదని మొన్నటి ఎన్నికల్లో గెలువగాదే మోదీజీ ఉత్సాహంతో అన్నారు. ఈ రెండూ నిజం కావు, ఓటు హక్కు వినియోగించిన అరువై కోట్ల మందిలో అత్యధికులు, 63 శాతం మంది మోదీజీకి, ఆయన పార్టీకి దూరంగా ఉన్నారు. దక్షిణ భారతం మోదీజీకి, ఆయన పార్టీకి ఈసారి కూడా వ్యతిరేకంగా నిలిచిందన్నది కఠిన యథార్థం. కమలం వికాసానికి తెలంగాణ కల్మష కాసారం కాదు, కాబోదు. మొన్నటి ఎన్నికల్లో, తెలంగాణలో నాలుగు స్థానాలలో బీజేపీ కట్టినవి పునాదుల్లేని పేకమేడలు. ఎప్పుడు కూలుతాయో తెలియదు. జాతీయవాదం ముసుగేసుకున్న మత దురభిమానం గురించి గాంధీజీ అన్న మాటలు .. "I do not want India to rise on the ruin of other nations..."

# విద్యా ముసాయిదా మార్పు తెచ్చేనా?

**విద్య**



**అస్నాల శ్రీనివాస్**

నరేంద్ర మోదీ నేతృత్వంలో 2014లో అధికారంలోకి వచ్చాక దేశ అవసరాలకు అనువైన 'నూతన విద్యా విధానాన్ని రూపొందిస్తామన్న హామీ ఇచ్చింది. నాలుగున్నరేండ్ల తర్వాత, రెండోసారి అధికారంలోకి వచ్చాక 2019, మే 31న ముసాయిదాను ప్రకటించింది. తన తొలి పాలనలో ప్రజలకు గుణాత్మక విద్యను అందుబాటులో ఉంచుతామని జీడీపీలో 6 శాతం కేటాయిస్తామని హామీలు ఇచ్చింది. అయితే వీటి అమలుకోసం కనీస కార్యచరణను చేపట్టలేదు. మోదీ తన తొలి పాలనాకాలంలో నూతన విద్యా విధాన రూపకల్పనకు టీఎస్ఆర్ సుబ్రమణ్యం కమిటీని వేసింది. ఈ కమిటీ సిఫారసులు సంఘ్‌పరివార్ విద్యా సాంస్కృతిక దృక్పథాన్ని సరిగ్గా ప్రతిఫలించలేదన్న కారణంగా వీటిని సమీక్షిస్తూ మరింత మెరుగైన విధానాలను రూపొందించడానికి ఇస్రో మాజీ చైర్మన్ కస్తూరి రంగన్‌తో కమిటీని వేసింది. దీని గడువును నాలుగు సార్లు పొడిగించి, కాలయాపన చేసింది.

మే 2019లో రెండోసారి అధికారంలోకి వచ్చాక విద్యారంగా ప్రక్షాళనకు వంద రోజుల కార్యాచరణ ప్రణాళికను ప్రకటించింది. దీనిలో భాగంగా కస్తూరి రంగన్ కమిటీ రూపొందించిన 'నూతన విద్యా విధానం 2019' ముసాయిదాను మానవ వనరుల మంత్రిత్వ శాఖకు సమర్పించి, ప్రజలకు అందుబాటులో ఉంచింది. గ్రాస్ ఎన్‌రోల్‌మెంట్ రేషియోను పెంచుతామని, బోధన అభ్యసనను వినూత్నంగా నిర్వహిస్తామని, మౌలిక సౌకర్యాలకు, పరిశోధన రంగాలకు నిధులను కేటాయిస్తామని తెలియజేసింది. వైజ్ఞానిక దృక్పథం, విమర్శనాత్మక ఆలోచన, సమస్య పరిష్కార సామర్థ్యాలు, సామాజిక బాధ్యత, నైతికతల నిలయాలుగా ఉన్నత విద్యాసంస్థలను తీర్చిదిద్దుతామని తెలియజేసింది. కానీ మోదీ తొలి ఐదేండ్ల పాలనలో విద్యారంగ నిర్వహణను పరిశీలిస్తే నూతన విద్యావిధానం అమలు సమీప భవిష్యత్తులో కూడా సాధ్యం కాదని బోధపడుతుంది. వర్సిటీలలో స్వేచ్ఛ సృజనాత్మక ఆలోచనలపై ఆంక్షల ఉక్కుపాదం మోపుతూ రెచ్చగొడుతున్నాయి. సామాజిక, సాంస్కృతిక, చారిత్రక అంశాలపై స్వతంత్రంగా పరిశోధనను నిర్వహించే సంస్థలైన భారత సామాజిక శాస్త్రాల మండలి, భారత చారిత్రక పరిశోధన మండలి వంటి సంస్థలను సంఘ్ పరివార్ శక్తులు తమ గుప్పిట్లోకి తీసుకున్నాయి. ఇటీవల అఖిల భారత వైద్య పరిశోధన మండలి 'వైద్యశాస్త్రంపై జ్యోతిష్య ప్రభావం' సదస్సును నిర్వహించి, వైజ్ఞానిక స్ఫూర్తిని అపహాస్యం చేశాయి.

రాష్ట్రాలు నిర్వహించే యూనివర్సిటీల నిర్వహణకు నిధుల పరంగా మద్దతు ప్రస్తావన లేదు. వీటిలో వేలాది బోధనా ఖాళీలున్నాయి. కేంద్రం మద్దతు లేకపోవడంతో ఆయా రాష్ట్ర ప్రభుత్వాలు వీటిని గాలికి వదిలేశాయి. ఇవి స్థాపించిన తొలి నాలుగు దశాబ్దాలలో అద్భుతమైన మానవ వనరులను సృష్టించాయి. ఉన్నత విద్యలో అసమానతల క్రమానుగత శ్రేణిని పెంచి పోషించే ధోరణులు కనిపిస్తున్నాయి. ఉన్నత విద్యా సంస్థలను టైప్-1, టైప్-2, టైప్-3 గ్రేడులుగా విభజించాలని సూచించింది. ఇది విద్యార్థులను అధ్యాపకులను డీమోరలైజ్ చేయడానికి దారి తీస్తుంది. ఇప్పటికే 60 ఉన్నత విద్యాసంస్థలకు స్వయం ప్రతిపత్తిని కట్టబెట్టింది. కోర్సుల రూపకల్పనలో స్వేచ్ఛ ఉన్నా వాటి నిర్వహణ కోసం అధికంగా ఫీజులు వసూలు చేయడం ప్రారంభించాయి.

ముసాయిదాలో వైజ్ఞానిక శాస్త్రాలలో ఆర్యభట్ట, చరక, శుశృత, భాస్కరచార్య వంటి భారతీయ శాస్త్రవేత్తల కృషిని కొనియాడింది. సామాజిక విద్యను అందించిన తక్షశిల, నలంద విశ్వవిద్యాలయాలను శ్లాఘించింది. మోదీతో పాటు తన సహచర మంత్రులు ప్రవచిస్తున్న కాల్పనిక పురాణాలలో క్లోనింగ్ విమానాల తయారీ, ఇంటర్నెట్, అవయవ మార్పిడీ అంశాలను మాత్రం ప్రస్తావించలేదు. బౌద్ధం తాత్త్వికధారతో పొరుగు దేశం చైనా సూపర్ పవర్‌గా ఎదుగుతుందని తెలియజేసింది.

**ఉన్నత విద్యను వినిమయ వ్యాపార వస్తువుగా మార్చిన ప్రైవేట్ సంస్థలను నియంత్రించే అంశాలు మచ్చుకైనా ముసాయిదాలో లేవు. వాటిని ప్రోత్సహించే ధోరణులే కనిపిస్తున్నాయి. ప్రైవేట్ సంస్థలు పబ్లిక్ అనే పదాన్ని ఉపయోగించకూడదని సూచన మాత్రం చేశారు. ఇటీవల ఉనికిలో లేని జియో విద్యాసంస్థకు వెయ్యి కోట్లు, సైన్స్ కాంగ్రెస్ నిర్వహించిన జలంధర్‌లోని లవ్లీ ప్రొఫెషనల్ విద్యా సంస్థకు నిధులు ఇవ్వడమే దీనికి తార్కాణం.**

ఉన్నత విద్యను వినిమయ వ్యాపార వస్తువుగా మార్చిన ప్రైవేట్ సంస్థలను నియంత్రించే అంశాలు మచ్చుకైనా ముసాయిదాలో లేవు. వాటిని ప్రోత్సహించే ధోరణులే కనిపిస్తున్నాయి. ప్రైవేట్ సంస్థలు పబ్లిక్ అనే పదాన్ని ఉపయోగించకూడదని సూచన మాత్రం చేశారు. ఇటీవల ఉనికిలో లేని జియో విద్యాసంస్థకు వెయ్యి కోట్లు, సైన్స్ కాంగ్రెస్ నిర్వహించిన జలంధర్‌లోని లవ్లీ ప్రొఫెషనల్ విద్యా సంస్థకు నిధులు ఇవ్వడమే దీనికి తార్కాణం. రీసెర్చ్ ఫౌండేషన్ నుంచి నిధులను వైజ్ఞానిక, సాంకేతికశాస్త్రాలతో పాటు మానవీయ సామాజిక శాస్త్రాలను కేటాయించాలని సూచించింది. ముసాయిదాలో 1986, 1992 విద్యా విధానాలను మరికొన్ని కమిటీల సూచనలను నామమాత్రంగా ప్రస్తావించింది. కానీ ప్రజాతంత్ర విద్యా రూపకల్పనకు కొఠారి కమిషన్ సూచించిన సిఫార్సులను ప్రస్తావించలేదు. విద్య సమానత్వ సాధనకు చోదకశక్తిగా పనిచేయాలంటే ఉమ్మడి విద్య వ్యవస్థను ఏర్పాటుచేయాలని, జీడీపీలో 6 శాతం కేంద్ర బడ్జెట్‌లో 10 శాతం నిధులను కేంద్రం కేటాయించాలని సూచించింది. 2014లో తన ఎన్నికల మ్యానిఫెస్టోలో జీడీపీలో 6 శాతం కేటాయిస్తానన్న వాగ్దానాన్ని నిలుపుకోలేకపోయింది. అలాగే శాస్త్ర, సాంకేతిక రంగాలకు 3 శాతం కేటాయిస్తామన్న మోదీ గత ఐదేండ్లలో 0.7 శాతం మాత్రమే కేటాయించారు. ముసాయిదా ప్రస్తుతం విద్యావ్యవస్థకు కేంద్ర బడ్జెట్‌లో కేటాయిస్తున్న 10 శాతం నిధులను 2025 నాటికి 20 శాతం పెంచాలని సూచించింది. స్వాతంత్ర్యం వచ్చిన తొలి మూడు దశాబ్దాలు మినహా తర్వాత ఏ ప్రభుత్వాలు కూడా 10 శాతం కేటాయించలేదు. మోదీ హయాంలో ఇది మరింతగా దిగజారింది. కేంద్ర బడ్జెట్ 2015లో 3.75 శాతం, 2016లో 3.65 శాతం, 2017లో 3.59 శాతం, 2018లో 3.48 శాతం, 2019లో 3 శాతం నిధులను మాత్రమే కేటాయించింది.

యూఎన్ఓ 'సుస్థిరాభివృద్ధి లక్ష్యాలు-2030లో నాలుగవ లక్ష్యం సమ్మిళిత, సమాన నాణ్యత గల విద్యను అందించడం, అందరికి జీవిత కాలంపాటు అభ్యసన అవకాశాలను కల్పించాలి. ఈ లక్ష్యసాధనకు ప్రభుత్వమే. విద్యారంగాన్ని నిర్వహించాలి. ఇప్పటికే విద్యాపర అసమానతలతో సమాజం రెండు వర్గాలుగా చీలిపోతున్న ధోరణులు కనిపిస్తున్నాయి. రాజ్యాంగ తాత్త్విక దృక్పథంతో ప్రజాతంత్ర విద్యావిధానాన్ని అమలు కోసం రాజకీయపక్షాలు, పౌర సమాజం దృఢ సంకల్పంతో వ్యవహరించినప్పుడే నాగరికత వికాసంలో, సమ్మిళిత వృద్ధిలో భారత్ శిఖరాయమా న స్థితికి చేరుకుంటుంది.

Printed and Published by Damodar Rao Divakonda, on behalf of Telangana Publications Pvt Ltd, Printed at Telangana Publications Pvt. Ltd, S.No.863/A, 863/C, Nustulapur, Opp: Grampanchayat Office, Timmapur Mandal, Dist: Karimnagar - 505 481,
Published at Telangana Publications Pvt. Ltd, S.No.863/A, 863/C, Nustulapur, Opp: Grampanchayat Office, Timmapur Mandal, Dist: Karimnagar - 505 481, Telangana State. Editor: Katta Shekar Reddy. Ph: +91 878 2283899, Toll Free: 1800 425 3666. RNI No. TELTEL/2011/38229.

# 'కారు'దిద్దిన కాపురం!

## ఐదేండ్లు దూరంగా ఉన్నా.. ఎంపీపీ ఎన్నికతో ఒక్కటైన దంపతులు



భర్త లక్ష్మణ్‌తో రామడుగు ఎంపీపీగా ఎన్నికైన కలిగేటి కవిత

**రామడుగు:** మనస్పర్థలతో ఐదేండ్లు దూరంగా ఉన్న ఆ దంపతులు ఇటీవల జరిగిన ఎంపీటీసీ ఎన్నికలతో ఒక్కటయ్యారు. మొన్న ఎంపీటీసీగా గెలిచిన ఆమె అదృష్టం కలిసివచ్చి శుక్రవారం ఎంపీపీగా ఎన్నికయ్యారు. కరీంనగర్ జిల్లా రామడుగు మండలం కొరటపల్లికి చెందిన టీఆర్‌ఎస్ పార్టీ నాయకుడు కలిగేటి లక్ష్మణ్‌కు కొత్తపల్లికి చెందిన కవితకు 2008లో వివాహం జరిగింది. పెళ్లైన ఐదేండ్లకు మనస్పర్థల రావడతో వేర్వేరుగా ఉన్నారు. ఇటీవల పంచాయతీ ఎన్నికల్లో సర్పంచుగా పోటీ చేసిన లక్ష్మణ్ ఓడిపోయారు. ప్రాదేశిక ఎన్నికల్లో భాగంగా మోతె ఎంపీటీసీ స్థానం ఎస్సీ మహిళకు కేటాయించగా, తన తల్లిని టీఆర్‌ఎస్ అభ్యర్థిగా నిలిపేందుకు లక్ష్మణ్ ప్రయత్నించారు. ఐదేండ్లుగా లక్ష్మణ్-కవిత దంపతులు విడిగా ఉంటున్నారని తెలుసుకున్న టీఆర్‌ఎస్ నాయకులు తన భార్యకు బీఫారం ఇస్తామని లక్ష్మణ్‌కు చెప్పారు. దీంతో విడివిడిగా ఉంటున్నప్పటికీ కవితను ఒప్పించి బరిలో నిలిపారు. ఓటర్లు దీవించడంతో ఆమె ప్రత్యర్థిపై 480 ఓట్ల మెజారిటీతో ఎంపీటీసీగా గెలుపొందింది. రిజర్వేషన్‌లో భాగంగా రామడుగు ఎంపీపీ ఎస్సీ జనరల్ స్థానానికి కేటాయించగా కవిత ఎంపీపీ పీఠాన్ని కైవసం చేసుకొంది. విడిపోయి కోర్టును ఆశ్రయించిన జంట టీఆర్‌ఎస్ పార్టీ పుణ్యమాని ఒక్కటి కావడంతో లక్ష్మణ్-కవితది 'కారు'దిద్దిన కాపురం అంటూ సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

## భర్త సర్పంచ్.. భార్య ఎంపీపీ



ఎంపీపీగా ఎన్నికైన వనజ



పస్పుల సర్పంచ్ దత్తప్ప

**మక్తల్ రూరల్:** భార్యాభర్తలు రాజకీయాల్లో ఉండటం సహజమే అయినా ఇద్దరూ ఒకే దఫా ప్రజాప్రతినిధులుగా గెలవడం అరుదే. నారాయణపేట జిల్లా మక్తల్ మండలం పస్పుల గ్రామానికి చెందిన టీఆర్‌ఎస్ సీనియర్ నేత దత్తప్ప ఇటీవల జరిగిన పంచాయతీ ఎన్నికల్లో సర్పంచుగా ఎన్నికయ్యారు. తాజాగా జరిగిన ప్రాదేశిక ఎన్నికల్లో ఆయన భార్య వనజమ్మ పంచదేవ్‌పహాడ్ ఎంపీటీసీగా గెలవడంతోపాటు శుక్రవారం మక్తల్ ఎంపీపీగా ఎన్నికయ్యారు. భార్య ఎంపీపీగా, భర్త సర్పంచుగా ప్రాతినిధ్యం వహించనున్నారు.

## భార్య ఎంపీపీ, భర్త జెడ్పీటీసీ



బాదినేని రాజేందర్, రాజమణి

**ధర్మపురి,నమస్తేతెలంగాణ:** జగిత్యాల జిల్లా ధర్మపురి నియోజకవర్గంలోని బుగ్గారం ఎంపీపీగా బాదినేని రాజమణి ఎన్నికయ్యారు. ఆమె భర్త బాదినేని రాజేందర్ బుగ్గారం జెడ్పీటీసీగా గెలుపొందారు. రాజమణి నిన్నటి వరకు ధర్మపురి జెడ్పీటీసీగా సేవలందించారు.



కరీంనగర్ జిల్లా చొప్పదండి మండలం దేశాయిపేట ఎంపీటీసీ సభ్యుడు కూకట్ల తిరుపతిని తీసుకొస్తున్న కుటుంబసభ్యులు

## చొప్పదండిలో ఉద్రిక్తం

**చొప్పదండి, నమస్తే తెలంగాణ:** కరీంనగర్ జిల్లా చొప్పదండి ఎంపీపీ ఎన్నికపై హైడ్రామా కొనసాగింది. అధ్యక్ష పీఠం దక్కించుకొనేందుకు టీఆర్‌ఎస్, బీజేపీ వర్గాలు తమ ఎంపీటీసీలతో క్యాంపులు నిర్వహించాయి. కోఆప్షన్, ఎంపీపీ, వైస్ ఎంపీపీల ఎన్నిక కోసం శుక్రవారం మధ్యాహ్నం ఇరుపార్టీల వారు తమ సభ్యులతో వాహనాల్లో చొప్పదండికి తరలివచ్చారు. టీఆర్‌ఎస్ క్యాంపునకు సంబంధించిన ఎంపీటీసీలు వాహనాల్లో నుంచి దిగుతుండగా బీజేపీ శ్రేణులు నినాదాలు చేస్తూ అడ్డుపడ్డాయి. దేశాయ్‌పేట ఎంపీటీసీ కూకట్ల తిరుపతిని తమకు అప్పగించాలని ఆయన కుటుంబ సభ్యులు, బీజేపీ శ్రేణులు వాగ్వాదానికి దిగడంతో తోపులాట జరిగింది. బారికేడ్ల నుంచి ఎంపీపీ కార్యాలయం గేటు వరకు తిరుపతిని తోసుకుంటూ తీసుకెళ్లారు. పోలీసుల జోక్యం చేసుకున్నా గొడవ సర్దుకుపోలేదు.

# టీఆర్‌ఎస్ క్లీన్‌స్వీప్

## ఏడు జిల్లాల్లోని అన్ని ఎంపీపీలు కైవసం
## ఉపాధ్యక్షులు, కోఆప్షన్ సభ్యులు సైతం..
### పత్తాలేకుండాపోయిన ప్రతిపక్షాలు.. రాష్ట్రవ్యాప్తంగా టీఆర్‌ఎస్ జోరు

**నమస్తే తెలంగాణ నెట్‌వర్క్:** ఎన్నిక ఏదైనా గెలుపు తమదేనని టీఆర్‌ఎస్ మరోసారి రుజువుచేసింది. శుక్రవారం జరిగిన మండల పరిషత్ అధ్యక్ష ఎన్నికల్లో ఏడు జిల్లాల్లో గులాబీ పార్టీ క్లీన్‌స్వీప్ చేసింది. రాష్ట్రవ్యాప్తంగా ఎంపీపీ, వైస్ ఎంపీపీ, కోఆప్షన్ సభ్యుల ఎన్నికల్లో కారు దూసుకుపోయింది. ప్రతిపక్షాలు పత్తాలేకుండా పోయాయి. చాలాచోట్ల కాంగ్రెస్, బీజేపీ కనీసం తమ అభ్యర్థులను ప్రతిపాదించిన పరిస్థితి కనిపించలేదు. సిద్దిపేట జిల్లాలో మొత్తం 23 ఎంపీపీ స్థానాలను చేజిక్కించుకున్నది. కరీంనగర్ జిల్లాలోని మొత్తం 15 ఎంపీపీ స్థానాలను గులాబీ పార్టీ కైవసం చేసుకున్నది. పెద్దపల్లిలో మొత్తం 13 ఎంపీపీ పీఠాలనూ టీఆర్‌ఎస్ దక్కించుకున్నది. కుమ్రంభీం ఆసిఫాబాద్ జిల్లాలో మొత్తం 15 , వరంగల్ అర్బన్‌లో ఏడింటికి ఏడు ఎంపీపీ స్థానాల్లో గులాబీ పార్టీ పాగావేసింది. వనపర్తి జిల్లాలోని 14 స్థానాల్లోనూ టీఆర్‌ఎస్ గెలుపొందింది. మేడ్చల్ జిల్లాలోని ఐదు మండల పరిషత్ అధ్యక్ష పీఠాలను దక్కించుకున్నది. వరంగల్ రూరల్ జిల్లాలో 16 స్థానాలకుగాను 15 చోట్ల, రాజన్న సిరిసిల్ల జిల్లాలో 12 స్థానాలకుగాను 11, నిజామాబాద్‌లో 27కుగాను 24, కామారెడ్డిలో 22కుగాను 20 ఎంపీపీ పీఠాల్లో టీఆర్‌ఎస్ పాగావేసింది.



తన భార్య తిరుమల(మాజీ ఎంపీపీ)తో నూతన ఎంపీపీ చిలుక రవీందర్

## నాడు పత్ని.. నేడు పతి

**చొప్పదండి, నమస్తేతెలంగాణ:** శుక్రవారం జరిగిన ఎంపీపీ ఎన్నికల్లో చొప్పదండి ఎంపీపీగా రుక్మాపూర్ ఎంపీటీసీ చిలుక రవీందర్ ఎన్నికయ్యారు. గతంలో ఇదే గ్రామం నుంచి ఎంపీటీసీగా ఎన్నికైన రవీందర్ భార్య తిరుమల 2003 నుంచి 2006 వరకు ఎంపీపీగా బాధ్యతలు నిర్వహించారు. భార్యాభర్తలు ఇద్దరూ రెండు దఫాలుగా ఎంపీపీగా బాధ్యతలు నిర్వర్తించే అవకాశం రావడం అదృష్ట మని రవీందర్ సంతోషం వ్యక్తం చేశారు.

## భార్య కలెక్టర్..
# భర్త కోఆప్షన్ మెంబర్



కోఆప్షన్ సభ్యుడిగా ఎన్నికైన కైసర్ అహ్మద్

**ధర్మపురి, నమస్తే తెలంగాణ:** భార్య ఓ జిల్లా కలెక్టర్‌గా విధులు నిర్వహిస్తుండగా ఆమె భర్త కోఆప్షన్ మెంబర్‌గా ఎన్నికయ్యారు. వివరాల్లోకి వెళ్తే.. వికారాబాద్ జిల్లా కలెక్టర్‌గా విధులు నిర్వహిస్తున్న అయేషా మస్రత్ ఖానమ్ భర్త కైసర్ అహ్మద్ ధర్మపురి మండల కో ఆప్షన్ సభ్యుడిగా ఎన్నికయ్యారు. ధర్మపురి మండలం రాయపట్నానికి చెందిన కైసర్ అహ్మద్‌కు, అయేషా మస్రత్ ఖానమ్‌కు 20 ఏళ్ల క్రితమే వివాహమైంది. అయేషా గతంలో జగిత్యాల జిల్లా సారంగాపూర్ ఎంపీడీవోగా, మంథని ఆర్డీవోగా, కరీంనగర్ డీఆర్డీవోగా, ఖమ్మం జేసీగా కూడా పనిచేశారు.

# అధ్యక్షా.. వాయిదా పడింది

## ఎంపీపీ పోరులో ఆసక్తికర ఘటనలు.. కలిసిరాని రిజర్వేషన్లు
### పలుచోట్ల ఎంపీపీ, వైస్ ఎంపీపీ ఎన్నిక వాయిదా

**నమస్తే తెలంగాణ నెట్‌వర్క్:** మారుతున్న రాజకీయ సమీకరణాలు.. పార్టీల పదునైన వ్యూహాలు.. అభ్యర్థుల అలకలు.. రక్తికట్టించే సన్నివేశాలు ఇలా అన్నీ కలిపి రాష్ట్రంలోని పలుచోట్ల శుక్రవారం మండల పరిషత్ అధ్యక్షుల ఎన్నికలు వాయిదా పడ్డాయి. సంఖ్యా బలం లేక కొన్నిచోట్ల.. సరిపోయే బలం ఉన్నా రిజర్వేషన్ కలిసిరాక మరికొన్నిచోట్ల ఎంపీపీ, వైస్ ఎంపీపీ ఎన్నికలను అధికారులు వాయిదా వేశారు. రాష్ట్రవ్యాప్తంగా శుక్రవారం 26 స్థానాల్లో ఎన్నికలు వాయిదా పడ్డాయి.

- కామారెడ్డి జిల్లా దోమకొండ మండలంలో ఎంపీపీ స్థానం బీసీ మహిళకు రిజర్వు అయింది. మండలంలో తొమ్మిది ఎంపీటీసీ స్థానాలకు 5 కాంగ్రెస్, 4 టీఆర్‌ఎస్ గెలుచుకున్నాయి. కాంగ్రెస్ పార్టీకి కోరం ఉన్నప్పటికీ బీసీ మహిళా అభ్యర్థి లేరు. టీఆర్‌ఎస్ పార్టీకి బీసీ మహిళా ఎంపీటీసీ ఉన్నా కోరం లేదు. టీఆర్‌ఎస్ ఎంపీటీసీ సభ్యులు హాజరుకాకపోవడంతో ఎంపీపీ ఎన్నికను వాయిదా వేశారు. నిజామాబాద్ జిల్లా బోధన్ ఎంపీపీ ఎన్నిక కూడా వాయిదాపడింది.
- ఆదిలాబాద్ జిల్లా గుడిహత్నూర్‌లో కో ఆప్షన్ సభ్యుడి నామినేషన్ దాఖలుకు ఎంపీటీసీ సభ్యులు ఆలస్యంగా రావడంతో నామినేషన్లు స్వీకరించలేదు. మంచిర్యాల జిల్లా భీమిని మండలంలో కోరం లేక ఎంపీపీ ఎన్నిక వాయిదా పడింది.
- జగిత్యాల జిల్లా సారంగాపూర్ మండల పరిషత్ కార్యాలయంలో కో ఆప్షన్ సభ్యుడి ఎన్నిక కోసం బాబుమియా నామినేషన్ దాఖలు చేసి, కొద్దిసేపటికే ఉపసంహరించుకోవడంతో ఎన్నిక వాయిదా వేశారు.
- ఖమ్మం జిల్లా కూసుమంచిలో టీఆర్‌ఎస్‌కు ఆధిక్యం ఉన్నా ఎంపీపీ పదవికి ఇద్దరు పోటీ పడటంతో ఎన్నిక వాయిదాపడింది. భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో ఆళ్లపల్లి, లక్ష్మీదేవిపల్లి, సుజాతనగర్, ములకలపల్లి మండలాల్లో కోరం లేక ఎంపీపీ ఎన్నికను అధికారులు వాయిదా వేశారు.
- నల్లగొండ జిల్లాలో నేరేడుగొమ్ము, చందంపేట, కేతేపల్లి, సూర్యాపేట జిల్లాలోని చిలుకూరు ఎంపీపీ ఎన్నిక వాయిదా పడింది.
- రంగారెడ్డి జిల్లాలోని ఆమనగల్లు, మాడ్గుల, సంగారెడ్డి జిల్లాలో రెండు మండలాలకు ఎంపీపీ ఎన్నికలు వాయిదా పడ్డాయి.
- పాలమూరు జిల్లా మహబూబ్‌నగర్ రూరల్ మండలంలో కోఆప్షన్ సభ్యుల ఎన్నికకు సమయం అయిపోయాక నామినేషన్ దాఖలు చేయడంతో అధికారులు తిరస్కరించారు. జోగుళాంబ గద్వాల జిల్లా అలంపూర్‌లో ఎంపీపీ, వైస్ ఎంపీపీ ఎన్నిక వాయిదా పడింది. జడ్చర్ల పాలకవర్గ పదవీకాలం పూర్తికాకపోవడంతో ఎన్నిక జరుగలేదు.
- మెదక్ జిల్లా టేక్మాల్‌లో కో ఆప్షన్ సభ్యుడి ఎన్నిక కోసం సమయానికి నామినేషన్ వేయకపోవడంతో ఎన్నిక వాయిదా పడగా, చిలిపిచేడ్‌లో కోరం లేక ఎన్నిక వాయిదా పడింది.
- జనగామ జిల్లా తరిగొప్పుల ఎంపీపీ ఎన్నిక ప్రక్రియలో భాగంగా కో ఆప్షన్ సభ్యుల నుంచి నామినేషన్ దాఖలు కాకపోవడంతో ఎన్నికను వాయిదా వేశారు.

### ఉన్నదే ఇద్దరు.. ఎన్నుకొనేదెవరు!

జయశంకర్ భూపాలపల్లి జిల్లా పలిమెల మండలంలో ఇద్దరు ఎంపీటీసీ సభ్యులు మాత్రమే ఉన్నారు. మండల పరిషత్ అధ్యక్ష, ఉపాధ్యక్ష ఎన్నికలో ఒకరు పోటీ చేస్తే మరొకరు ప్రతిపాదించడంతోపాటు ఇంకొకరు బలపర్చాల్సి ఉంటుంది. మండలంలో ఇద్దరే ఎంపీటీసీలు ఉండటంతో ఎంపీపీ, వైస్‌ఎంపీపీ ఎన్నికలకు అవకాశం లేకుండా పోయింది. ఇక్కడ లెంకలగడ్డ గ్రామానికి చెందిన సయ్యద్ నిజాంను కోఆప్షన్ సభ్యుడిగా ఎన్నుకున్నారు.

### ముగ్గురు గెలిచారు.. ఇద్దరే వచ్చారు

ఆదిలాబాద్ జిల్లా మావల మండలంలో ముగ్గురు ఎంపీటీసీ సభ్యులు ఉన్నారు. టీఆర్‌ఎస్ నుంచి ఒకరు, కాంగ్రెస్ నుంచి ఒకరు, స్వతంత్ర అభ్యర్థి ఒకరు ఎంపీటీసీలుగా గెలిచారు. శుక్రవారం కో ఆప్షన్ సభ్యుడి పదవి కోసం మావల గ్రామానికి చెందిన రహీంఖాన్ ఒక్కరే నామినేషన్ వేయడంతో ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఎంపీపీని ఎన్నుకొనేందుకు ఒకరు ప్రతిపాదించాల్సి ఉండగా, మరొకరు బలపరచాల్సి ఉంటుంది. కానీ, ఎన్నికకు స్వతంత్ర అభ్యర్థి హాజరుకాలేదు. దీంతో అధ్యక్ష ఎన్నిక వాయిదా పడింది.

### చందూర్.. ఆసక్తికర పోరు

నిజామాబాద్ జిల్లా చందూర్ మండలంలో మూడు ఎంపీటీసీస్థానాలు ఉన్నాయి. ఎంపీపీ ఎస్టీ జనరల్‌కు రిజర్వు అయింది. కాంగ్రెస్ నుంచి ఎస్టీ మహిళతో పాటు ఒక బీసీ అభ్యర్థి ఎంపీటీసీగా గెలుపొందగా, టీఆర్‌ఎస్ నుంచి ఎస్టీ అభ్యర్థి గెలుపొందాడు. ఎంపీపీగా నామినేషన్ వేయడానికి కాంగ్రెస్‌కు చెందిన ఒకరు ప్రతిపాదిత ఎంపీటీసీ ఉన్నా.. బలపరచడానికి మరో ఎంపీటీసీ కరువయ్యారు. దీంతో ఎంపీపీ ఎన్నిక వాయిదా పడింది.

### ఒక్కరే హాజరు..

జగిత్యాల అర్బన్ మండలంలో నాలుగు ఎంపీటీసీలున్నాయి. ఇందులో టీఆర్‌ఎస్ రెండు గెలుపొందగా, కాంగ్రెస్, ఇండిపెండెంట్ చెరొకటి గెలుపొందారు. ఎంపీపీ స్థానం ఎస్సీకి రిజర్వు అయింది. కాంగ్రెస్ నుంచి గెలిచిన ధరూర్ ఎంపీటీసీ సభ్యురాలు మ్యాదరి వనిత మాత్రమే ఎస్సీ అభ్యర్థి. ఆమె ఒక్కరే వచ్చి.. మిగతావారు హాజరుకాకపోవడంతో ఎంపీపీ ఎన్నికను అధికారులు వాయిదా వేశారు.



జగిత్యాల అర్బన్ ఎంపీపీ ఎన్నికల్లో పాల్గొన్న ధరూర్ ఎంపీటీసీ సభ్యురాలు వనిత. కోరం లేకపోవడంతో ఇక్కడ ఎన్నిక వాయిదా పడింది.

## గోడ దూకి పారిపోయాడు..

**తిరుమలగిరి. నమస్తే తెలంగాణ:** సూర్యాపేట జిల్లా తిరుమలగిరి మండలంలో ఆరు ఎంపీటీసీ స్థానాలుండగా టీఆర్‌ఎస్, కాంగ్రెస్ చెరో మూడు గెలుచుకున్నాయి. శుక్రవారం ఉదయం కో ఆప్షన్ సభ్యుడిని ఎన్నుకున్నారు. మధ్యాహ్నం 3 గంటలకు ఎంపీపీ ఎన్నిక నిర్వహిస్తామని తెలుపగా, తాటిపాముల ఎంపీటీసీ కొర్ర ప్రవీణ్ కార్యాలయం గోడదూకి వెళ్లిపోయాడు. మరో ఇద్దరు కాంగ్రెస్ ఎంపీటీసీలు కూడా ఎన్నికకు హాజరుకాకపోవడంతో టీఆర్‌ఎస్ పార్టీ ఎంపీటీసీలే ఎంపీపీ, వైస్ ఎంపీపీ పీఠాలను దక్కించుకున్నారు.

# దండేపల్లిలో హైడ్రామా

**మంచిర్యాల ప్రతినిధి, నమస్తే తెలంగాణ:** మంచిర్యాల జిల్లా దండేపల్లి ఎంపీపీ ఎన్నికలో హైడ్రామా నడిచింది. టీఆర్‌ఎస్ విజయాన్ని అడ్డుకొనేందుకు కాంగ్రెస్ ప్రయత్నించినా.. చివరకు ఆ స్థానం గులాబీ ఖాతాలోకే చేరింది. దండేపల్లి మండలంలో 14 ఎంపీటీసీలకు ఆరు టీఆర్‌ఎస్ గెలుపొందగా, 8 కాంగ్రెస్ గెలుచుకున్నది. ఎంపీపీ స్థానం బీసీ జనరల్‌కు రిజర్వు అయింది. ఇక్కడ పోటీలో లక్ష్మీకాంతాపూర్ ఎంపీటీసీ పసర్తి అనిల్ (కాంగ్రెస్), చింతపల్లి ఎంపీటీసీ గడ్డం శ్రీనివాస్ (టీఆర్‌ఎస్) ఎంపీపీ బరిలో నిలిచారు. ఎంపీపీ ఎన్నికకు కాంగ్రెస్ నేతలు ఏడుగురే హాజరయ్యారు. అనిల్‌ను కాంగ్రెస్ నేతలు దాచేశారంటూ ఆయన మద్దతుదారులు, కుటుంబసభ్యులు ఆందోళనకు దిగారు. గడ్డం శ్రీనివాస్ ఎన్నికల సమయంలో జరిగిన తప్పిదాలపై తమకు వివరణ కావాలని పట్టుబట్టారు. పెట్రోల్ పోసుకుని ఆత్మహత్య చేసుకుంటానంటూ బయటకు పరిగెత్తారు. మరోవైపు తనను కిడ్నాప్ చేశారని పసర్తి అనిల్ వాట్సప్‌లో పంపిన వీడియో కలకలం సృష్టించింది. ఆయన కాంగ్రెస్ క్యాంపు నుంచి బయటకు వచ్చి కరీంనగర్‌కు చేరుకోగా, అక్కడ నుంచి టీఆర్‌ఎస్ నేతలు ఎన్నికల కేంద్రానికి తీసుకొచ్చారు. మార్గమధ్యంలోనూ కాంగ్రెస్ నేతలు.. అనిల్‌ను మరోసారి కిడ్నాప్‌చేసే ప్రయత్నం చేశారు. కానీ, వారి ప్రయత్నాన్ని టీఆర్‌ఎస్ శ్రేణులు తిప్పికొట్టాయి. ఎంపీపీ ఎన్నిక సమయంలో కాంగ్రెస్, టీఆర్‌ఎస్ సమాన సంఖ్య ఉండటంతో డ్రా తీశారు. ఈ డ్రాలో టీఆర్‌ఎస్ అభ్యర్థి గడ్డం శ్రీనివాస్‌ను విజయం వరించింది. మరోవైపు కోఆప్షన్ పదవి స్థానికుడికి ఇవ్వాలని కాసిపేటలో ఒక కార్యకర్త వాటర్ ట్యాంకు ఎక్కడంతో కాసేపు ఉద్రిక్త నెలకొన్నది. స్థానికుడికే ఇస్తామని హామీ ఇవ్వడంతో సమస్య సద్దుమణిగింది.

### ఎంపీపీ ఎన్నికల ఫలితాలు..

| జిల్లా | మొత్తం స్థానాలు | టీఆర్‌ఎస్ | కాంగ్రెస్ | బీజేపీ | ఇతరులు | వాయిదా |
|---|---|---|---|---|---|---|
| కరీంనగర్ | 15 | 15 | - | - | - | - |
| జగిత్యాల | 18 | 15 | 1 | - | - | 2 |
| పెద్దపల్లి | 13 | 13 | - | - | - | - |
| రాజన్న సిరిసిల్ల | 12 | 11 | - | 1 | - | - |
| మంచిర్యాల | 16 | 14 | 1 | - | - | 1 |
| ఆసిఫాబాద్ | 15 | 15 | - | - | - | - |
| ఆదిలాబాద్ | 17 | 10 | 1 | 3 | 1 | 2 |
| నిర్మల్ | 18 | 13 | 5 | - | - | - |
| నిజామాబాద్ | 27 | 24 | - | 1 | 2 | - |
| కామారెడ్డి | 22 | 20 | 1 | - | 1 | - |
| వరంగల్ అర్బన్ | 7 | 7 | - | - | - | - |
| వరంగల్ రూరల్ | 16 | 15 | 1 | - | - | - |
| జనగామ | 12 | 10 | 1 | - | - | 1 |
| మహబూబాబాద్ | 16 | 14 | 2 | - | - | - |
| భూపాలపల్లి | 11 | 5 | 3 | - | 1 | 1+1 |
| ములుగు | 8 | 6 | 2 | - | - | - |
| నల్లగొండ | 31 | 21 | 7 | - | - | 3 |
| సూర్యాపేట | 23 | 18 | 4 | - | - | 1 |
| యాదాద్రి | 17 | 10 | 7 | - | - | - |
| ఖమ్మం | 20 | 17 | - | - | 2 | 1 |
| భద్రాద్రి | 20 | 13 | 2 | - | 1 | 4 |
| మహబూబ్‌నగర్ | 13 | 11 | 1 | - | - | 1 |
| నారాయణపేట | 11 | 8 | 1 | 2 | - | - |
| నాగర్‌కర్నూల్ | 20 | 17 | 2 | - | - | 1 |
| వనపర్తి | 14 | 14 | - | - | - | - |
| జోగుళాంబ గద్వాల | 12 | 10 | 1 | - | - | 1 |
| సంగారెడ్డి | 25 | 16 | 7 | - | - | 2 |
| మెదక్ | 20 | 13 | 3 | - | 2 | 2 |
| సిద్దిపేట | 23 | 23 | - | - | - | - |
| రంగారెడ్డి | 21 | 13 | 3 | 2 | 1 | 2 |
| వికారాబాద్ | 18 | 14 | 4 | - | - | - |
| మేడ్చల్ | 5 | 5 | - | - | - | - |
| మొత్తం | 536 | 430 | 60 | 9 | 11 | 26 |

నోట్: జయశంకర్ భూపాలపల్లి జిల్లా పలిమెల మండలంలో కేవలం ఇద్దరు ఎంపీటీసీలు మాత్రమే ఉన్నారు. సంఖ్యా బలం లేనందున ఎంపీపీ, వైస్ ఎంపీపీ ఎన్నిక నిర్వహించలేదు. కోఆప్షన్ సభ్యుడిని మాత్రం ఎన్నుకున్నారు. ఇక్కడి పరిస్థితిని ఎన్నికల అధికారులకు నివేదించనున్నారు.



మహబూబ్‌నగర్ జిల్లా హన్వాడ ఎంపీపీగా ఎన్నికైన బాలరాజుకు మిఠాయి తినిపిస్తున్న మంత్రి శ్రీనివాస్‌గౌడ్



ఎమ్మెల్సీ పల్లా రాజేశ్వర్‌రెడ్డిని మర్యాద పూర్వకంగా కలిసిన నూతనంగా ఎన్నికైన వరంగల్ అర్బన్ జిల్లా ధర్మాసాగర్, వేలేరు ఎంపీపీలు, వైస్ ఎంపీపీలు



మంచిర్యాల జిల్లా చెన్నూర్‌లో విజేతలకు స్వీట్లు తినిపిస్తున్న ఎమ్మెల్యే బాల్క సుమన్

# గులాబీ సంబురం

## టీఆర్‌ఎస్ శ్రేణుల్లో విజయోత్సాహం
### జిల్లాల్లో పటాకులు కాల్చి.. మిఠాయిలు పంచి
### నూతన ఎంపీపీలను అభినందించిన మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు

**నమస్తే తెలంగాణ నెట్‌వర్క్:** ప్రాదేశిక ఎన్నికల్లో టీఆర్‌ఎస్ సత్తాచాటింది. ఎంపీటీసీ సభ్యులే కాక మెజార్టీ ఎంపీపీ పీఠాలను దక్కించుకున్నది. శుక్రవారం జరిగిన ఎంపీపీ ఎన్నికల్లో రాష్ట్రవ్యాప్తంగా 430 మండల పరిషత్‌లను గెలుపొందగా టీఆర్‌ఎస్ కార్యకర్తలు విజయోత్సాహంలో మునిగిపోయారు. ఆయా జిల్లాల్లో కార్యకర్తలు, నాయకులు మిఠాయిలు పంచుకొని, పటాకులు కాల్చి పెద్దఎత్తున సంబురాలు జరుపుకొన్నారు. కరీంనగర్ జిల్లాలోని ఎంపీపీ స్థానాలన్నీ టీఆర్‌ఎస్సే గెలుపొందింది. కరీంనగర్ నియోజకవర్గంలోని కరీంనగర్ రూరల్, కొత్తపల్లి ఎంపీపీలను కైవసం చేసుకున్న నేపథ్యంలో నగరంలో ఎమ్మెల్యే గంగుల కమలాకర్ ఆధ్వర్యంలో ఎమ్మెల్సీ నారదాసు లక్ష్మణ్‌రావు కొత్తగా ఎన్నికైన ఎంపీపీలు తిప్పర్తి లక్ష్మయ్య, పిల్లి శ్రీలతామహేశ్‌తో కలిసి టీఆర్‌ఎస్ కార్యకర్తలు భారీ విజయోత్సవ ర్యాలీ నిర్వహించారు. సామాన్య కార్యకర్తలను ఎంపీపీలుగా చేసిన ఘనత టీఆర్‌ఎస్‌కే దక్కుతుందని గంగుల కమలాకర్ పేర్కొన్నారు. వరంగల్ అర్బన్ జిల్లాలో ఏడు స్థానాలకుగాను అన్నింటిని టీఆర్‌ఎస్ కైవసం చేసుకోవడంతో పార్టీ నాయకులు, కార్యకర్తలు సంబురాలు జరుపుకొన్నారు. సిద్దిపేట జిల్లాలో 23 ఎంపీపీ స్థానాలను టీఆర్‌ఎస్ పార్టీ కైవసం చేసుకోగా.. నూతనంగా ఎంపికైన ఎంపీపీలను మాజీ మంత్రి, సిద్దిపేట శాసన సభ్యులు హరీశ్‌రావు అభినందించారు.మెదక్ జిల్లా హవేళి ఘనపూర్ మండలం నుంచి ఎంపీపీగా ఎన్నికైన శేరి నారాయణరెడ్డికి ఆయన సోదరుడు ఎమ్మెల్సీ శేరి సుభాష్‌రెడ్డి పాదాభివందనం చేసి గెలుపు సంబరాల్లో పాల్గొన్నారు. టీఆర్‌ఎస్ నాయకులు నారాయణరెడ్డిని శాలువాతో సన్మానించి స్వీట్లు తినిపించారు.

### పార్టీలకతీతంగా గ్రామాల అభివృద్ధి జరగాలి: మంత్రి శ్రీనివాస్‌గౌడ్

నూతనంగా ఎన్నికైన ఎంపీపీ, వైస్ ఎంపీపీలు పార్టీలకతీతంగా గ్రామాల్లో ఆదర్శ పాలన చేపట్టాలని ఎక్సైజ్, క్రీడా శాఖ మంత్రి శ్రీనివాస్ గౌడ్ కోరారు. హన్వాడలో జరిగిన ఎంపీపీ, వైస్ ఎంపీపీ ఎన్నికకు మంత్రి హాజరై, ఏకగ్రీవంగా ఎన్నికైన ఎంపీపీ బాలరాజు, వైస్ ఎంపీపీ లక్ష్మికి మిఠాయిలు తినిపించి అభినందించారు.

### పల్లా రాజేశ్వర్‌రెడ్డి అభినందనలు

వరంగల్ అర్బన్ జిల్లా ధర్మసాగర్, వేలేరు ఎంపీపీలుగా ఎన్నికైన నిమ్మ కవితరెడ్డి, కేశిరెడ్డి సమ్మిరెడ్డి, వైస్ ఎంపీపీలుగా బండారి రవీందర్, అంగోత్ సంపత్, కో-అప్షన్ సభ్యులు, ఎంపీటీసీలు ప్రభుత్వ విప్ పల్లా రాజేశ్వర్‌రెడ్డి కలిశారు. ఈ సందర్భంగా పల్లా రాజేశ్వర్‌రెడ్డి వారిని అభినందించారు.



జనగామ ఎంపీపీగా ఎన్నికైన కళింగరాజు, టీఆర్‌ఎస్ శ్రేణులతోకలిసి సంబురాల్లో పాల్గొన్న ఎమ్మెల్యే ముత్తిరెడ్డి యాదగిరిరెడ్డి



మహబూబాబాద్ ఎంపీపీగా ఎన్నికైన భూక్య మౌనికకు మిఠాయి తినిపిస్తున్న ఎమ్మెల్యే బానోతు శంకర్‌నాయక్



వరంగల్‌లో సంబురాల్లో పాల్గొన్న ఎమ్మెల్యే నన్నపునేని నరేందర్





మెదక్‌జిల్లా హవేళీఘనపూర్ ఎంపీపీగా ఎన్నికైన సోదరుడు శేరి నారాయణరెడ్డిని అభినందిస్తున్న ఎమ్మెల్సీశేరి సుభాష్‌రెడ్డి... వరంగల్‌లో సంబురాలు జరుపుకొంటున్న టీఆర్‌ఎస్ నాయకులు

# నేడు లేదా రేపు ఎంసెట్ ఫలితాలు!

- కన్వీనర్ యాదయ్య

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** రాష్ట్రంలో ఇంజినీరింగ్, ఫార్మసీ, అగ్రికల్చర్ కాలేజీల్లో సీట్ల భర్తీ కోసం మే 3 నుంచి 9 వరకు కంప్యూటర్ ఆధారంగా నిర్వహించిన ఎం సెట్ ఫలితాలు శనివారం లేదా ఆదివారం విడుదలయ్యే అవకాశాలు ఉన్నాయని ఎంసెట్-2019 కన్వీనర్ ప్రొఫెసర్ ఎన్ యాదయ్య తెలిపారు. ఇంటర్ ఫలితాల సీడీ తమకు శుక్రవారం అందినట్టు చెప్పారు. విద్యార్థులకు వచ్చిన మార్కులతో 25 శాతం వెయిటేజీ లెక్కించి ఎంసెట్ ఫలితాలు విడుదల చేస్తామన్నారు. ఈ నేపథ్యంలో ఎంసెట్ ఫలితాలు ఎప్పుడు విడుదల చేసే విషయాన్ని శనివారం ఉదయం తెలియజేస్తామని కన్వీనర్ పేర్కొన్నారు.

# 16న గురుకులాల డిగ్రీ ప్రవేశపరీక్ష

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** ఈ నెల 16న తెలంగాణ గురుకుల డిగ్రీ కళాశాలల్లో ప్రవేశాలకు రాష్ట్రస్థాయి ప్రవేశపరీక్ష నిర్వహిస్తున్నట్టు తెలంగాణ సోషల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ ఎడ్యుకేషనల్ ఇన్‌స్టిట్యూషన్స్ సొసైటీ కార్యదర్శి ఆర్‌ఎస్ ప్రవీణ్‌కుమార్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10.30 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు ఉం టుందని పేర్కొన్నారు. ఆర్మ్‌డ్ ఫోర్సెస్ ప్రిపరేటరీ డిగ్రీ కళాశాలలో అడ్మిషన్లకు అదేరోజు మధ్యాహ్నం 2.30 నుంచి 4 గంటల వరకు రెండో పేపర్ జరుగుతుందని, అభ్యర్థులు జూన్ 12 నుం చి హాల్‌టికెట్లను tgugcet. cgg.gov. in నుంచి డౌన్‌లోడ్ చేసుకోవచ్చన్నారు.

# అందరూ చూస్తుండగానే హత్యాయత్నం

- ఎస్సార్‌నగర్‌లో నడిరోడ్డుపై ఘాతుకం

**అమీర్‌పేట్, నమస్తే తెలంగాణ:** ఎస్సార్‌నగర్ చౌరస్తాలో శుక్రవారం సాయంత్రం అందరూ చూస్తుండగా నవవరుడిపై హత్యాయత్నం జరిగింది. మాంసంకొట్టే కత్తులతో మామ, బావమరుదులు యువకుడిపై దాడిచేశారు. ప్రేమ వివాహం చేసుకున్న నవదంపతుల కుటుంబాలకు పోలీసులు కౌన్సెలింగ్ నిర్వహించిన నిమిషాల వ్యవధిలోనే.. పోలీస్‌స్టేషన్‌కు కూతవేటు దూరంలో ఈ ఘటన జరుగడం కలకలం సృష్టించింది. బోరబండ బంజారానగర్ హాజీమస్తాన్ బేకరీ సమీపంలో ఆలీ అనే ఎలక్ట్రీషియన్ కుటుంబంతో నివాసముంటున్నారు. సమీపంలోనే సంగారెడ్డి జిల్లా సదాశివపేట శాంతినగర్‌కు చెందిన ఇంతియాజ్ (23) నివాసముంటూ ప్రైవేట్ ఉద్యోగం చేసుకుంటున్నారు. ఇంతియాజ్, ఆలీ కుమార్తె జెనా ఫాతిమా (19) మధ్య ఏర్పడిన పరిచయం ప్రేమగా మారడంతో వారిద్దరు ఈ నెల 5న శాంతినగర్‌లో పెద్దల సమక్షంలో పెండ్లిచేసుకున్నారు. అప్పటికే ఫాతిమా కనబడటం లేదంటూ ఆమె కుటుంబసభ్యులు ఎస్సార్‌నగర్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదుచేశారు. ఈ విషయం తెలుసుకున్న ఇంతియాజ్ పెండ్లి విషయాన్ని పోలీసులకు వివరించి.. అమ్మాయి కుటుంబసభ్యుల నుంచి ప్రాణహాని ఉందని, తనకు రక్షణ కల్పించాలంటూ వేడుకున్నాడు. దీంతో ఇరు కుటుంబసభ్యులకు శుక్రవారం ఎస్సార్‌నగర్ పోలీసులు కౌన్సెలింగ్ నిర్వహించారు. ఇంతియాజ్ కుటుంబ సభ్యులతో కలిసి క్వాలిస్ వాహనంలో సదాశివపేటకు తిరుగు ప్రయాణమవగా.. ఫాతిమా తండ్రి, సోదరులు ఆటోలో వచ్చి అడ్డగించారు. మాంసం కొట్టే కత్తులతో తల, మెడ, వీపుభాగాల్లో విచక్షణారహితంగా దాడిచేయడంతో తీవ్రగాయాలతో రోడ్డుపై పడినపోయిన ఇంతియాజ్‌ను స్థానికులు దవాఖానకు తరలించారు. అతడి పరిస్థితి విషమంగా ఉన్నట్టు సమాచారం.

---

తెలంగాణ ప్రభుత్వము
జిల్లా కలెక్టర్ జయశంకర్ భూపాలపల్లి వారి ప్రాథమిక ప్రకటన
ఫారం-VI
(ప్రాథమిక నోటిఫికేషన్)
భూ సేకరణ పునరావాసం, పునరావాస కల్పనలో పారదర్శకత మరియు హేతు బద్ధమైన పరిహారాన్ని పొందే హక్కు చట్టం-2013
(కేంద్ర చట్టం 2013/30 యొక్క సెక్షన్ (1)11 రూల్ (19) సబ్ సెక్షన్ (1) అనుసరించి)

జిల్లా కలెక్టర్ గారి ఫైల్ నం: G/204/2017, తేది: 28.05.2019
గెజిట్ నం. JSK/BHPL/LA/17/2019, తేది: 04.06.2019

[illegible]

షెడ్యూల్ (పట్టాదారు ప్రకారము)

గ్రా: దుమ్ముగూడెం H/o: పెద్దపల్లి    మం: మంగపేట (ములుగు)    జిల్లా: జయశంకర్ భూపాలపల్లి

| క్ర.సం. | సర్వే నం. | పట్టాదారు పేరు | అనుభవదారు పేరు |
|---|---|---|---|
| 1 | 2 | 3 | 4 |
| [illegible] | [illegible] | [illegible] | [illegible] |

షెడ్యూల్ (అనుభవదారుల ప్రకారము)

| క్ర.సం. | సర్వే నం. | పట్టా నం. | అనుభవదారుని పేరు | విస్తీర్ణం | [illegible] | కట్టడాలు మరియు చెట్లు |
|---|---|---|---|---|---|---|
| 1 | 2 | 3 | 4 | 5 | 6 | 7 |
| [illegible] | [illegible] | [illegible] | [illegible] | [illegible] | [illegible] | [illegible] |

[illegible]

DIPR R.O. No. 240/LA/PP/AGENCY/2019-20




## 10 నుంచి టెన్త్ అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ

- హాజరుకానున్న 61,431 మంది విద్యార్థులు

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** ఈ నెల 10వ తేదీ నుంచి పదో తరగతి అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షలు ప్రారంభం కానున్నాయి. పరీక్షలు ఈ నెల 24 వరకు కొనసాగుతాయి. ప్రతి రోజు ఉదయం 9.30 నుంచి మధ్యాహ్నం 12.15 గంటల వరకు జరుగనున్నా యి. ఈ పరీక్షలకు 61,431 మంది విద్యార్థులు హాజరుకానున్నారు.
రాష్ట్రంలో 260 పరీక్షా కేంద్రాలను ఏర్పాటుచేసినట్టు ప్రభుత్వ పరీక్షల విభాగం డైరెక్టర్ బీ సుధాకర్ తెలిపారు. www.bse.telangana.gov.in నుంచి ప్రధానోపాధ్యాయులు హాల్‌టిక్కెట్లను డౌన్‌లోడ్ చేసి విద్యార్థులకు జారీచేయాలన్నారు. మొబైల్ ఫోన్లు, ఇతర ఎలక్ట్రానిక్ పరికరాలకు పరీక్షా కేంద్రంలోకి అనుమతి లేదని తెలిపారు.

## వక్ఫ్‌బోర్డు సీఈవోగా అబ్దుల్ హమీద్

**హైదరాబాద, నమస్తే తెలంగాణ:** స్పెషల్ గ్రేడ్ డిప్యూటీ కలెక్టర్, జహీరాబాద్ ఆర్డీవో అబ్దుల్ హమీద్‌ను తెలంగాణ రాష్ట్ర వక్ఫ్‌బోర్డు సీఈవోగా రాష్ట్ర ప్రభుత్వం నియమించింది. ఈ మేరకు శుక్రవారం రాష్ట్ర రెవెన్యూశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి రాజేశ్వర్‌తివారి ఉత్తర్వులు జారీచేశారు.

## 1.40 కోట్ల హవాల నగదు పట్టివేత

డాక్టర్‌సహా నలుగురిని అదుపులో తీసుకున్న టాస్క్‌ఫోర్స్

**హైదరాబాద్ సిటీబ్యూరో, నమస్తే తెలంగాణ:** లెక్కల్లో చూపని రూ.1.40 కోట్ల నగదును హవాలామార్గంలో తరలిస్తున్న వైద్యుడితోపాటు మరో ముగ్గురిని సెంట్రల్ జోన్ టాస్క్‌ఫోర్స్ పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. సొత్తును స్వాధీనం పరుచుకున్నారు. హైదరాబాద్‌లోని యూసుఫ్‌గూడకు చెందిన మురళీచౌదరి, మౌలాలీ హౌసింగ్ బోర్డుకు చెందిన ఎస్ రాజేశ్, ప్రకాశం జిల్లా ఒంగోలు మండలానికి చెందిన కాతురి జగదీశ్, యూసుఫ్‌గూడకు చెందిన పీ శ్రీను.. శుక్రవారం టీఎస్ 09ఈఎం 8838(వెర్నా), ఏపీ 28 డీఏఫ్ 4444 (స్కోడా) కార్లలో నగదును తరలిస్తున్నారని సమాచారం అందడంతో వారి నుంచి ఈ నగదును స్వాధీనం చేసుకున్నట్టు డీసీపీ రాధాకిషన్‌రావు మీడియాకు వెల్లడించారు.

## ఏపీలో ఘోరరోడ్డు ప్రమాదం

- ఇద్దరు మహిళలు సహా ఆరుగురి మృతి

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** ఆంధ్రప్రదేశ్‌లోని తిరుపతి సమీపంలో శుక్రవారం జరిగిన ఘోర రోడ్డు ప్రమాదంలో ఇద్దరు మహిళలుసహా ఆరుగురు మృత్యువాతపడ్డారు. మరో నలుగురు తీవ్రంగా గాయపడ్డారు. తిరుపతికి 20 కిలోమీటర్ల దూరంలోని గవర్రాజుపల్లె వద్ద కారు ఆగివున్న లారీని బలంగా ఢీకొట్టడంతో ప్రమాదం జరిగినట్టు పోలీసులు తెలిపారు. ప్రమాదంలో ఐదుగురు అక్కడికక్కడే చనిపోగా, మరొకరు దవాఖానలో చికిత్స పొందుతూ ప్రాణాలు వదిలారు. మరోవైపు గాయపడ్డ నలుగురిలో ఇద్దరి పరిస్థితి విషమంగా ఉన్నట్టు పోలీసులు తెలిపారు. మృతులు గుంటూరు జిల్లాలోని రుద్రవరం గ్రామానికి చెందినవారిగా గుర్తించారు. వీరంతా తిరుమల వెళ్తుండగా ప్రమాదం జరిగినట్టు తెలిసింది. క్షతగాత్రులను చికిత్స నిమిత్తం ఎస్వీఆర్ఆర్ ప్రభుత్వ దవాఖానలో చేర్చారు.



నమస్తే తెలంగాణ
మన రాష్ట్రం - మన పత్రిక
8th
నమస్తే తెలంగాణ దినపత్రిక
8వ వార్షికోత్సవ
శుభాకాంక్షలు




మన కరీంనగర్‌లో
పెట్టుబడి చీరలకు
అద్భుత అవకాశం
లినెన్ చెక్స్
2 PCS. W/B
₹450
జార్జెట్ ప్రింట్
2 PCS. W/B
₹428
పనేతార్ చెక్స్
OR లిచ్చీ జలార్
OR ఉప్పాడ పట్టు
2 PCS. W/B
₹350
ఔరా సిల్క్
2 PCS. W/B
₹395
కాటన్ స్టైల్
4 PCS. W/B
₹500
కాటన్ డ్రెస్ మెటీరియల్
2 PCS.
₹750 Combo
బనారసి పటోలా సిల్క్ శారీ OR లినెన్ డిజిటల్ ప్రింట్
2 PCS. W/B
₹595
బాయ్స్ టీషర్ట్స్
5 PCS.
₹500
బాయ్స్ షార్ట్స్
5 PCS.
₹395
దుపట్టా
5 PCS.
₹500
కుర్తీస్
2 PCS.
₹500
ఫ్యాన్సీ చుడీధార్స్ సెట్
950
₹495
కాటన్ నైటీస్
2 PCS.
₹299 Combo
మెన్స్ వేర్
కాటన్ ట్రౌజర్స్
2 PCS.
₹999
జీన్స్ OR ఫార్మల్ షర్ట్స్ OR క్యాజువల్ షర్ట్స్ OR కాటన్ ట్రౌజర్స్
2 PCS.
₹799
SOUTH INDIA
shopping mall
ఉస్మాన్‌పుర, కరీంనగర్.
ఫోన్: 0878-224 0225

## అమెరికా మహిళ సంపన్నుల్లో ముగ్గురు భారతీయ వనితలు



జయశ్రీ



నీర్జా సేథి



నేహా నర్ఖేడా

**న్యూయార్క్, జూన్ 7:** అమెరికా సంపన్న వర్గాల్లోనూ భారతీయ మహిళలు సత్తచాటుతున్నారు. ప్రస్తుత సంవత్సరానికిగాను ఫోర్బ్స్ మ్యాగజైన్ విడుదల చేసిన అమెరికా-80 మహిళా సంపన్న వర్గాల జాబితాలో ముగ్గురు దేశీయ మహిళలకు చోటు లభించింది. వీరిలో కంప్యూటర్ నెట్‌వర్కింగ్ సంస్థయైన అరిస్టా నెట్‌వర్క్స్ ప్రెసిడెంట్, సీఈవో జయశ్రీ ఉల్లల్, ఐటీ కన్సెల్టింగ్ అండ్ అవుట్‌సోర్సింగ్ సంస్థ సింటెల్ కో-ఫౌండర్ నీర్జా సేథి, స్ట్రీమింగ్ డాటా టెక్నాలజీ కంపెనీ కన్ఫ్లుయెంట్ సీటీవో, కో-ఫౌండర్ నేహా నర్ఖేడా ఉన్నారు. అమెరికాలో రూఫింగ్, సైడింగ్, విండోస్‌లో హోల్‌సేల్ డిస్ట్రిబ్యూషన్ అగ్రగామిగా ఉన్న ఏబీసీ చైర్మన్ డయాన్ హెండ్రిక్స్‌కు ఈ జాబితాలో తొలి స్థానం లభించింది. 72 ఏండ్ల వయస్సు కలిగిన డయాన్ ఆస్తి విలువ 700 కోట్ల డాలర్లు. ఈ జాబితాలో చోటు దక్కించుకున్న భారతీయ మహిళల్లో ఉల్లల్‌కు 18వ స్థానం లభించింది. ఆమె ఆస్తి 1.4 బిలియన్ డాలర్లు. భారత సంతతికి చెందిన ఉల్లల్ లండన్‌లో జన్మించి అమెరికా వ్యాపార సామ్రాజ్యంలో తనదైన ముద్రవేస్తున్నారని ఫోర్బ్స్ పేర్కొంది. అలాగే, బిలియన్ డాలర్ల నికర ఆస్తితో సేథికి 23వ స్థానం లభించింది. 1980లో కేవలం 2 వేల డాలర్లతో ఆమె భర్త భరత్ దేశాయ్‌తో కలిసి రియల్ ఎస్టేట్ రంగంలోకి అడుగుపెట్టిన ఆమె.. ప్రస్తుతం బిలియన్ డాలర్ల కంపెనీగా అవతరించింది. 360 మిలియన్ డాలర్ల ఆస్తితో నేహాకు 60వ స్థానం దక్కింది. మరోవైపు, 2019 ఏడాదికిగాను ఫోర్బ్స్ మ్యాగజైన్ విడుదల చేసిన మహిళ జాబితాలో మీడియా మొగల్ ఓప్రా విన్‌ఫ్రెకు 10వ స్థానం దక్కగా, ఫేస్‌బుక్ చీఫ్ ఆపరేటింగ్ అధికారికి 12వ స్థానం, రియల్టీ టీవీ స్టార్ కైలీ జెన్నర్‌కు 23వ స్థానం, ఫ్యాషన్ డిజైనర్ టోరీ బుర్చ్‌కు 29వ స్థానం, పాప్ స్టార్ రిహాన్నకు 37వ స్థానం, మడోన్నాకు 39వ ప్లేస్‌లో నిలిచారు. 21 ఏండ్ల నుంచి 92 ఏండ్ల లోపు వయస్సు కలిగిన ఈ 80 మంది మహిళ సంపన్నవర్గాల ఆస్తి 81.3 బిలియన్ డాలర్లు. కనీసంగా 225 మిలియన్ డాలర్ల కంటే అధికంగా ఆస్తి కలిగివున్న వారికి మాత్రం ఈ జాబితాలో చోటు కల్పించింది.

## రాంకీ ఇన్‌ఫ్రాకు రూ.494 కోట్ల ఆర్డర్

**న్యూఢిల్లీ, జూన్ 7:** ప్రముఖ మౌలిక సదుపాయాల సంస్థ రాంకీ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్..రాజీవ్ గాంధీ రూరల్ హౌజింగ్ కార్పొరేషన్ లిమిటెడ్ నుంచి రూ.494.04 కోట్ల విలువైన ప్రాజెక్టు లభించింది. ఈ ప్రాజెక్టులో భాగం గా బెంగళూరు బీఎంఆర్‌డీఏ ప్రాంతంలో లక్ష బహుల అంతస్తుల నివాస గృహ నిర్మాణాలు నిర్మించాల్సి ఉంటుందని కంపెనీ బీఎస్‌ఈకి సమాచారం అందించింది. రాంకీ గ్రూపునకు చెందిన రాంకీ ఇన్‌ఫ్రా..పలు మౌలిక సదుపాయాల ప్రాజెక్టులు, పర్యావరణ అనుకూల ప్రాజెక్టులను నిర్వహిస్తున్నది. 1994 నుంచి వ్యాపార రంగంలోకి అడుగుపెట్టిన సంస్థ..నిర్మాణ, మౌలిక రంగంలో అగ్రగామి స్థాయికి చేరుకున్నది.


తెలంగాణ ప్రభుత్వం
పోలీస్ హౌసింగ్ కార్పొరేషన్ లిమిటెడ్ కరీంనగర్ డివిజన్
ఇ-ప్రొక్యూర్‌మెంట్ సంక్షిప్త టెండరు ప్రకటన
Ref No. 1) DB/EE/NIT-01/02W/eT.01 to T.02/2019-20 తేది: 03.06.2019
కరీంనగర్ వద్ద 2 పనులు కొరకు అర్హతగల నమోదిత కాంట్రక్టర్ల నుండి ఇ-ప్రొక్యూర్‌మెంట్ ప్లాట్‌ఫారం ద్వారా టెండర్లు కోరబడినవి. బిడ్ల దాఖలు చేయుటకు చివరి తేది: 11.06.2019న సా. 5.00 గం|| వరకు. తదుపరి వివరాలకు చూడండి www.eprocurement.gov.in/ www.tender.telangana.gov.in
సం/- కార్యనిర్వాహక ఇంజినీరు TSPHCL కరీంనగర్, ఫోన్: 0878-2249100
DIPR RO. No. 134-PP/CL/Advt/1/2019-20, Dt: 07/06/2019

తెలంగాణ ప్రభుత్వం
రోడ్లు మరియు భవనాల శాఖ
ఇ-ప్రొక్యూర్‌మెంట్ ప్రకటన
"e"NIT No. 26/Corenet Plan works/DCE(R)/DEE-10/AEE-6/2018-19, తేది: 04.06.2019.
పెద్దపల్లి జిల్లాలో మూడు (3) పనుల కొరకు ఇ-ప్రొక్యూర్‌మెంట్ ప్లాట్‌ఫారం క్రింద ఆన్‌లైన్ టెండర్లు కోరబడుచున్నవి. టెండరుదార్లు టెండరు షెడ్యూలు మరియు తదుపరి వివరాలను ఇ-మార్కెట్ ప్లేస్ అనగా ప్రొక్యూర్‌మెంట్ మార్కెట్ ప్లేస్ www.eprocurement.gov.in నుండి డౌన్‌లోడ్ చేసుకోవచ్చును. టెండర్ల స్వీకరణకు ఆఖరి తేది: 19.6.2019
సం/-ఇంజినీర్-ఇన్-చీఫ్ (R&B), స్టేట్ రోడ్స్ & CRN
DIPR RO. No.237DP/CL/Advt/1/2019-20. Dt: 7/06/19

తెలంగాణ ప్రభుత్వం
గిరిజన సంక్షేమం, 5వ అంతస్తు, డిఎస్ఎస్ భవన్, మాసాబ్ ట్యాంక్, హైదరాబాద్
ఇ-ప్రొక్యూర్‌మెంట్ టెండరు ప్రకటన
NIT No. SE/TW/HYD/107 to 118/2019-20 తేది: 03-06-2019 (2వ పిలుపు)
నాగర్‌కర్నూల్, రాజన్న సిరిసిల్ల, వికారాబాద్, రంగారెడ్డి, మెదక్, యాదాద్రి భువనగిరి, ITDA జిల్లాలలో ST ఆశ్రమ పాఠశాలలకు మైనర్ మరమ్మతులు మొదలగునవి అభివృద్ధి పనులు చేపట్టుట కొరకు దిగువ సంతకందారుచే టెండర్లు కోరబడుచున్నవి. మొత్తం ECV రూ. 164.03 లక్షలు, బిడ్ దాఖలు ప్రారంభ మరియు ముగింపు తేది 07-06-2019న సాయంత్రం 5.00 గంటల నుండి 15-06-2019న మధ్యాహ్నం 3.00 గంటల వరకు. వాణిజ్య బిడ్ తెరుచు తేది: 15-06-2019న సాయంత్రం 4.00 గంటలు. ఫోన్ నెం. 040-23315950, ఇమెయిల్: setwhyd13@gmail.com. తదుపరి వివరాల కొరకు https://tender.telangana.gov.in దర్శించండి
సం/- సూపరింటెండింగ్ ఇంజినీర్, గిరిజన సంక్షేమం, హైదరాబాద్
DIPR R.O.No. 236 DP/CL/Advt/1/2019-20 తేది: 07-06-2019

తెలంగాణ ప్రభుత్వం
తెలంగాణ మాడ్యులర్ ఎంప్లాయబుల్ స్కిల్స్ సొసైటీ (TMES)
ఉపాధి కల్పన మరియు శిక్షణ శాఖ కార్యాలయం, 4వ అంతస్తు, D-బ్లాక్, BRKR భవన్, సచివాలయం సమీపంలో, హైదరాబాద్-63.
No. TMES/PMKVY/EOI-III/2019, EOI కొరకు ప్రకటన తేది: 01-06-2019
మిషన్ డైరెక్టర్/CEO-SSDM & మెంబర్ సెక్రటరీ, తెలంగాణ మాడ్యులర్ ఎంప్లాయబుల్ స్కిల్స్ సొసైటీ (TMES)/స్టేట్ స్కిల్ డెవలప్‌మెంట్ మిషన్, తెలంగాణ ప్రభుత్వం వారిచే ఆహ్వానించబడిన PMKVY 2.0లో కాంపోనెంట్ అయిన సెంట్రల్లీ స్పాన్సర్డ్ స్టేట్ మేనేజిమెంట్ (CSSM) క్రింద 2019-2020 ఆర్థిక సంవత్సరానికి స్వల్పకాలిక శిక్షణ కార్యక్రమం నిర్వహించు ప్రతిపాదన కొరకు అభ్యర్థన. అన్ని నియమ మరియు నిబంధనలు, దరఖాస్తు నమూనాను చదివి డౌన్‌లోడ్ చేసుకొనవచ్చును. ఈ కార్యాలయం వద్ద ఎట్టి EOI ఫారమూ విక్రయించబడదు. ఆసక్తిగల శిక్షణదారులు అనుబంధములతో పాటుగా EOI-III ఫార్మెట్‌ని శాఖ వెబ్‌సైట్: www.iti.telangana.gov.in మరియు www.employment.telangana.gov.in వెబ్‌సైట్ నుండి డౌన్‌లోడ్ చేసుకోవచ్చును మరియు తమ ప్రతిపాదనను (01) సాఫ్ట్ కాపీతో పాటుగా హార్డ్ కాపీని ఈ కార్యాలయంలో దాఖలు చేయవచ్చును. సదరు డాక్యుమెంట్ యొక్క సాఫ్ట్ కాపీని pmkvydetts@gmail.comకి పంపవచ్చును. శిక్షణ ఏర్పాటుదారులు ప్రాజెక్టు ప్రతిపాదనను ప్రకటన జారీ తేదీ నుండి 30 రోజులు, అనగా ఇంచుమించుగా 30-06-2019 లోపుగా మిషన్ డైరెక్టరేట్ కార్యాలయంలో మరియు సంబంధిత జిల్లాల జిల్లా ఉపాధి అధికారి కార్యాలయం వద్ద కూడా దాఖలు చేయవచ్చు. తదుపరి వివరములను దిగువ సంతకందారు నుండి పొందవచ్చును. సంప్రదించుటకు: 040-2331705, ఇ-మెయిల్: pmkvydetts@gmail.com.
సం/- మిషన్ డైరెక్టర్/CEO, SSDM & మెంబర్ సెక్రటరీ
DIPR RO.No. 238-DP/CL/ADVT/1/2019-20, Dt: 07-06-2019


అనుబంధం-I
తెలంగాణ ప్రభుత్వం
ఆర్థిక శాఖ
8 సంవత్సరాల తెలంగాణ ప్రభుత్వ స్టాక్ (సెక్యూరిటీలు) వేలము 2027

| | |
|---|---|
| మొత్తం | : రూ. 1500.00 కోట్లు |
| జారీ ధర | : ప్రతి రూ. 10,000.00లకు రూ. 10,000.00 |
| కరెన్సీ | : 8 సంవత్సరాలు |
| రుణ దరఖాస్తు స్వీకరణ కాలము | :మొత్తం చేకూరిన వెంటనే ప్రకటన లేకుండా 11-06-2019 వ్యాపార వేళల అనంతరం వెంటనే ముగియగలదు. |

పై రుణము కొరకు తెలంగాణ ప్రభుత్వము చందాలు అభ్యర్థిస్తున్నది. పూర్తి వివరములను రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, హైదరాబాద్ మరియు ముంబయి నుండి ప్రభుత్వ వ్యాపార వేళలలో పొందవచ్చును.
కె. రామకృష్ణారావు
ముఖ్య ఆర్థిక కార్యదర్శి
ఆర్థిక శాఖ
DIPR R.O. No. 234-DP/CL/Advt/1/2019-20, Dt: 07-06-2019


# నెల రోజుల గడువు

### మొండి బకాయిల గుర్తింపుపై ఆర్బీఐ ■ నూతన మార్గదర్శకాల విడుదల




**ముంబై, జూన్ 7:** మొండి బకాయిల పరిష్కారానికి రిజర్వు బ్యాంక్ తాజాగా నూతన మార్గదర్శకాలను జారీ చేసింది. గతంలో జారీ చేసిన మార్గదర్శకాలపై సుప్రీంకోర్టు అభ్యంతరాలను వ్యక్తంచేసిన రెండు నెలల తర్వాత వీటిని మార్చి మళ్లీ శుక్రవారం విడుదల చేసింది. ఈ నూతన మార్గదర్శకాల ప్రకారం మొండి బకాయిల గుర్తింపు కాలపరిమితిని 30 రోజులకు పెంచింది. చెల్లించాల్సిన నాటికి ఎలాంటి చెల్లింపులు జరుపని యెడల వీటిని మొండి బకాయిలుగా గుర్తించాలని గతంలో జారీ చేసిన మార్గదర్శకాలపై సుప్రీంకోర్టు లెవనేత్తిన అభ్యంతరాలను పరిష్కరిస్తు ఈ నిర్ణయం తీసుకున్నది. గతంలో జారీచేసిన మార్గదర్శకాల స్థానంలో నూతన మార్గదర్శకాలను ప్రవేశపెట్టింది. తద్వారా తీవ్ర ఒత్తిడిని ఎదుర్కొంటున్న కార్పొరేట్ సంస్థలకు, దీర్ఘకాలికంగా ప్రాజెక్టుకోసం భారీ స్థాయిలో నిధులను వెచ్చిస్తున్న సంస్థలకు భారీ ఊరట లభించినట్లు అయింది. ఈ నూతన ఆదేశాలు వెంటనే అమలులోకి రానున్నాయని సెంట్రల్ బ్యాంక్ ప్రకటించింది. ఫిబ్రవరి 12, 2018న జారీ చేసిన మార్గదర్శకాలను ఏప్రిల్ 2న సుప్రీంకోర్టు నిలిపివేసిన విషయం తెలిసిందే. నిరర్థక ఆస్తుల గుర్తింపు విషయంలో సెంట్రల్ బ్యాంకుకు సుప్రీంకోర్టుకు మధ్య కొద్దిరోజుల పాటు వాదోపవాదాలు కూడా జరిగాయి. తాము తీసుకున్న రుణానికి తిరిగి చెల్లింపులు జరుపడంలో ఒక్క రోజు జరిగితే వీటిని ఎన్‌పీఏలుగా గుర్తించాలని సెంట్రల్ బ్యాంక్ భావించింది. కానీ, కార్పొరేట్, విద్యుత్, మౌలిక సదుపాయాల రంగాలకు చెందిన సంస్థల నుంచి తీవ్ర వ్యతిరేకత రావడంతో వెనక్కితగ్గింది. చివరకు ఆయా సంస్థలు అత్యున్నత న్యాయస్థానాన్ని కూడా ఆశ్రయించాయి. ఒకవేళ చెల్లించని యెడల వీటిని 180 రోజులు పరిష్కారం లభించకపోతే వీటిని దివాలా చట్టం కింద చర్యలు తీసుకునే అవకాశం బ్యాంకులకు ఉంటుంది. తాకట్టుకింద పెట్టిన ఆస్తులను విక్రయించే అవకాశం ఉంటుంది. బ్యాంకు లు, ఫైనాన్షియల్ ఇనిస్టిట్యూషన్లు, చిన్న స్థాయి ఆర్థిక సేవల బ్యాంకులు లేదా ఎన్‌బీఎఫ్‌సీల వద్ద తీసుకున్న రుణాలు తిరిగి చెల్లించని సంస్థలు లేదా వ్యక్తులు ముందుగా సమాచారం ఇవ్వాలని సూచించింది. 30 రోజుల వరకు ఎలాంటి రిసొల్యూషన్ ప్రణాళికను ప్రకటించే అవకాశాలు లేవు. ఆ తర్వాత నూతన మార్గదర్శకాలో పలు వెసులుబాటు తీవ్ర ఒత్తిడిని ఎదుర్కొంటున్న ఖాతాల విషయంలో నూతన మార్గదర్శకాల్లో పలు వెసులుబాటును కల్పించింది సెంట్రల్ బ్యాంక్. 180 రోజుల వరకు చెల్లించే 20 శాతం రుణంలో 35 శాతం ప్రొవిజనింగ్ జరిపించుకునే అవకాశం కల్పించింది. మిగతా 365 రోజుల వరకు 15 శాతం ప్రొవిజనింగ్ లభించనున్నది. బ్యాంకులు, ఆర్థిక సేవల సంస్థలైన నాబార్డ్, ఎగ్జిమ్ బ్యాంక్, సిడ్బీ, చిన్న స్థాయి ఆర్థిక బ్యాంకులు, ఎన్‌బీఎఫ్‌సీల వద్ద రూ.2 వేల కోట్లకు పైగా తీసుకున్న రుణాలకు మాత్రమే ఈ నూతన మార్గదర్శకాలు వర్తించనున్నది. రూ.1,500 కోట్ల నుంచి రూ.2 వేల కోట్ల లోపు తీసుకున్న రుణాలకు వచ్చే ఏడాది జనవరి 1 నుంచి ఈ మార్గదర్శకాలను వర్తింపు చేయనున్నట్లు ఆర్బీఐ ప్రకటించింది. ఆ తర్వాతి క్రమంలో రూ.1,500 కోట్ల లోపు రుణాలకు కూడా వర్తించనున్నది. అంతకు లోపు తీసుకున్నవాటికి ఇవి వర్తించదు. రుణాలు ఇచ్చే ప్రతిసంస్థ లేదా బ్యాంకులు కూడా అంతర్గత రుణ ఒప్పందాన్ని కుదుర్చుకోవాలని సూచించింది. మరోవైపు ప్రధాన బ్యాంకులు ఇష్టం వచ్చినట్లు ఇస్తున్న రుణాలకు చెక్ పెట్టడానికి ఆర్బీఐ మరో కీలక నిర్ణయం తీసుకున్నది. ఆయా సంస్థల ఆర్థిక స్థితిగతులు, ఇతర విషయాల ఆధారంగా రుణాలు ఇవ్వాలని సూచించింది.

**విద్యుత్ సంస్థలకు ఇబ్బందే..**

ఈ నూతన మార్గదర్శకాలతో విద్యుత్ ఉత్పత్తి చేస్తున్న సంస్థలకు ఇబ్బందిగా మారాయి. మార్చి 2018 నాటికి ఈ రంగ సంస్థల అప్పులు రూ.5.65 లక్షల కోట్లకు చేరాయి. ముఖ్యంగా జీఎంఆర్ ఎనర్జీ అసోసియేషన్ ఆఫ్ పవర్ ప్రొడ్యూసర్, ఇండిపెండెంట్ పవర్ ప్రొడ్యూసర్స్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా, షుగర్ తయారీదారుల సంఘాలపై కూడా ప్రభావం చూపనున్నది.

# రాజభోగాలు..!

### విదేశీ టూర్లు, ప్రైవేట్ జెట్లు, చాపర్లలో ప్రయాణాలు

### ఇది ఐఎల్‌అండ్‌ఎఫ్‌ఎస్ మాజీ బాసుల తీరు

**న్యూఢిల్లీ, జూన్ 7:** కర్ణుడి చావుకు సవాలక్ష కారణాలు అన్న చందంగా తయారైంది ఐఎల్‌అండ్‌ఎఫ్‌ఎస్ ఆర్థిక సంక్షోభ పరిస్థితి. కంపెనీని అన్నింటా ముందువుండి నడిపించాల్సిన మాజీ బాసులే సంస్థ దివాలా తీయడానికి కారణమయ్యారు. భారీ స్థాయిలో రుణాలు ఇప్పించడం, విదేశీ ప్రయాణాలు, ప్రైవేట్ జెట్ విమానాల్లో ప్రయాణం, చాపర్లలో రైడింగ్‌లు, తమ ఇండ్లలో అంతర్గత అలంకరణ చేసుకున్నారట. ఐఎల్‌అండ్‌ఎఫ్‌ఎస్‌లో జరిగిన అవినీతి గురించి వైట్-కాలర్ మోసాలను గుర్తించే సీరియస్ ఫ్రాడ్ ఇన్వెస్టిగేషన్(ఎస్‌ఎఫ్‌ఐవో)లో పలు కీలక సమాచారాన్ని సేకరించింది. సంస్థను ఆర్థికంగా దివాలా తీయడానికి ఇతర సంస్థలకు ఇచ్చిన రుణాలు కావని, కంపెనీ ఉన్నతాధికారులు మింగిన భారీ నిధులే కారణమని పేర్కొంది. ఐఎల్‌అండ్‌ఎఫ్‌ఎస్‌కు చెందిన అనుబంధ సంస్థయైన ఐఎల్‌అండ్‌ఎఫ్‌ఎస్ ఫైనాన్షియల్ సర్వీసెస్ లిమిటెడ్(ఐఎఫ్‌ఐఎన్) నుంచి భారీ స్థాయిలో రుణాలు తీసుకున్నారని ఎస్‌ఎఫ్‌ఐవో గుర్తించింది. ఐఎఫ్‌ఐఎన్ ఉన్నతాధికారులకు, సంస్థ వద్ద రుణాలు తీసుకొని ఎగ్గొట్టిన కంపెనీ బాసులతో జరిగిన ఈ-మెయిల్స్ ద్వారా పలు కీలక సమాచారాన్ని సేకరించింది ఎస్‌ఎఫ్‌ఐవో. ముఖ్యంగా శివా గ్రూపు చైర్మన్ సీ శివశంకరణ్‌తో కంపెనీ ఉన్నతాధికారులు జరిపిన ఈ-మెయిల్స్ చూస్తే ఎలా మోసం చేశారో స్పష్టమవుతున్నది. ఇందుకు ప్రతిఫలంగా కంపెనీ సీనియర్ ఎగ్జిక్యూటివ్‌లైన రవి పార్థసారథి, విభవ్ కపూర్, హరి శంకరణలకు ప్రముఖ ఆసుపత్రుల్లో చికిత్స కూడా చేపించాడు. వీటితోపాటు విదేశీ పర్యటనలు, ప్రైవేట్ జెట్ విమానాలు సమకూర్చడం, హెలిక్యాప్టర్ రైడ్స్, రిసార్ట్‌లలో విలాసాలు, బెల్జియంలో ఉన్న వీరికి చెందిన భవంతుల్లో అంతర్గత అలంకరణ కూడా చేపిచ్చాడట.

## రెపోరేటుతో ఎస్‌బీఐ గృహ రుణాల లింక్



**ముంబై, జూన్ 7:** బ్యాంకింగ్ దిగ్గజం స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా(ఎస్‌బీఐ) గృహ రుణాలు తీసుకున్నవారికి ఊరట కల్పిస్తూ మరో కీలక నిర్ణయం తీసుకున్నది. ఇప్పటికే స్వల్పకాల రుణాలు, డిపాజిట్ రేట్లను రెపోరేటుతో అనుసంధానం చేసిన ఎస్‌బీఐ.. తాజాగా గృహ రుణాలను సైతం వీటితో లింక్ చేయబోతున్నట్లు ప్రకటించింది. వచ్చే నెల నుంచి ఈ నిర్ణయం అమలులోకి రాబోతున్నది. వీటితోపాటు నగదు క్రెడిట్ అకౌంట్, ఓవర్‌డ్రాఫ్ట్ వినియోగదారులు లక్ష రూపాయల కంటే అధిక వాటిపై చెల్లించే వడ్డీరేటును తగ్గిస్తున్నట్లు శుక్రవారం ప్రకటించింది. రిజర్వు బ్యాంక్ వడ్డీరేట్లను పావు శాతం తగ్గించిన మరుసటి రోజే ఎస్‌బీఐ ఈ నిర్ణయం తీసుకోవడం విశేషం. ఆర్బీఐ తీసుకున్న నిర్ణయాన్ని వినియోగదారులకు చేరవేయాలనే ఉద్దేశంతో సీసీ/ఓడీ వినియోగదారులు(లక్ష రూపాయల కంటే అధిక) చెల్లించే వడ్డీరేటును సైతం తగ్గించినట్లు వెల్లడించింది. సీసీ/ఓడీ వినియోగదారులు రెపో-లింక్‌డ్ లెండింగ్ రేటు(ఆర్‌ఎల్‌ఎల్‌ఆర్) చెల్లించే వడ్డీరేటును 8 శాతంగా నిర్ణయించింది. అలాగే లక్ష రూపాయల కంటే అధిక

## బ్రాహ్మణులకు అండగా సర్కార్

### పంచాయతీరాజ్‌శాఖ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు



మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావును సన్మానిస్తున్న నిర్వాహకులు

**పోచమ్మమైదాన్(వరంగల్):** బ్రాహ్మణుల సంక్షేమం కోసం ప్రభుత్వం అనేక పథకాలు అమలు చేస్తూ అండగా నిలుస్తున్నదని రాష్ట్ర పంచాయతీరాజ్‌శాఖ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు అన్నారు. వరంగల్ ములుగు రోడ్డులోని శ్రీ వరద దత్తక్షేత్రంలో యజ్ఞోపవీతమ్ ఆధ్వర్యాన 51 మందికి ఉచిత సామూహిక ఉపనయన మహోత్సవం శుక్రవారం వైభవంగా నిర్వహించారు. మంత్రి మాట్లాడుతూ బ్రాహ్మణుల అభ్యున్నతి కోసం సీఎం కేసీఆర్ నిరంతరం పాటుపడుతున్నారని తెలిపారు. యజ్ఞోపవీతమ్ సంస్థ ఇలాంటి కార్యక్రమాలు చేపట్టడం అభినందనీమన్నారు. బ్రాహ్మణుల సమస్యల పరిష్కారం కోసం తనవంతు సహకారం అందిస్తానని ఎమ్మెల్యే వినయ్‌భాస్కర్ అన్నారు. బ్రాహ్మణ భవన నిర్మాణం కోసం ప్రభుత్వంపక్షాన 500 గజాల స్థలాన్ని కేటాయిస్తామని మేయర్ గుండా ప్రకాశ్‌రావు తెలిపారు. కార్యక్రమంలో మున్సిపల్ ఫ్లోర్ లీడర్ వద్దిరాజు గణేష్, సంస్థ బాధ్యులు కృష్ణమూర్తి, జగన్మోహన్ శర్మ, శంకర్‌శర్మ, వాణి, ప్రభాకర్, కిరణ్, నాగేశ్వర సిద్ధాంతి, మొత్కూరి రవికిరణ్ తదితరులు పాల్గొన్నారు.




విగ్రహ ప్రతిష్ఠాపనలో పూజలు చేస్తున్న చినజీయర్‌స్వామి

## ఘనంగా సీతారామచంద్రస్వామి విగ్రహ ప్రతిష్ఠాపన

### ప్రత్యేక పూజలు చేసిన త్రిదండి చినజీయర్‌స్వామి

**శాయంపేట:** వరంగల్ రూరల్ జిల్లా శాయంపేట మండలం ప్రగతిసింగారంలో శ్రీసీతాలక్ష్మణహనుమత్సమేత శ్రీరామచంద్రస్వామి, శ్రీఆండాళ్ ఆళ్వారాచార్య శ్రీ ఆంజనేయ, ధ్వజస్తంభ, విమాన శిఖర కళష ప్రతిష్ఠ త్రిదండి చినజీయరుస్వామి చేతుల మీదుగా శుక్రవారం ఘనంగా జరిగింది. అనంతరం ఆలయంలో శ్రీసీతారాముల కల్యాణోత్సవాన్ని కనుల పండువగా జరిపించారు. రాముడిని ప్రతిష్ఠించిన రోజున ప్రతి ఏడాది బ్రహ్మోత్సవాలు నిర్వహించాలని గ్రామస్తులకు సూచించారు. ఈ కార్యక్రమానికి రాష్ట్ర పంచాయతీరాజ్ శాఖ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు, పరకాల ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి, భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి, రాజ్యసభ సభ్యుడు బండా ప్రకాశ్ హాజరయ్యారు.

## రామా చంద్రమౌళికి ప్రపంచస్థాయి పురస్కారం



రామా చంద్రమౌళి

**పోచమ్మమైదాన్ (వరంగల్):** ఓరుగల్లుకు చెందిన ప్రసిద్ధ కవి, నవలాకారుడు, కథా రచయిత రామా చంద్రమౌళి ప్రపంచస్థాయి పురస్కారం నాజీ నామన్ లిటరరీ ప్రైజ్-2019కు ఎంపికయ్యారు. లెబనాన్‌కు చెందిన నాజీ నామన్ ఫౌండేషన్ ఈ పురస్కారాన్ని అందజేయనున్నది. వివిధ దేశాలకు చెందిన కవులు 2,386 ఎంట్రీలను పంపగా వీరిలో 60 మందిని ఎంపిక చేశారు. భారత్ తరపున నలుగురు ఎంపికవ్వగా.. అందులో రాష్ట్రానికి చెందిన రామా చంద్రమౌళికి పురస్కారం దక్కడం విశేషం. ఈయనకు జీవితకాల సాఫల్య పురస్కారాన్ని ప్రకటించారు.

## మావోయిస్టు కొరియర్ అరెస్ట్

**లక్ష్మీదేవిపల్లి:** మావోయిస్టుల పట్ల ఆకర్షితుడై ఆ పార్టీ తెలంగాణ కమిటీ సెక్రెటరీ హరిభూషణ్‌తో కలిసి పార్టీలో పనిచేసేందుకు వెళ్లిన రంజిత్‌రావును శుక్రవారం భద్రాద్రి కొత్తగూడెం జిల్లా లక్ష్మీదేవిపల్లి పోలీసులు అరెస్టు చేశారు. ఇల్లెందు క్రాస్‌రోడ్ వద్ద స్పెషల్ పార్టీ పోలీసులు తనిఖీ చేస్తుండగా అనుమానాస్పదంగా కనిపించిన రంజిత్‌రావును విచారించి అదుపులోకి తీసుకున్నారు.

# కోమటి చెరువుపై సస్పెన్షన్ బ్రిడ్జి

### సిద్దిపేటలోనే తొలి బ్రాహ్మణ భవన్

### మాజీమంత్రి, ఎమ్మెల్యే హరీశ్‌రావు



సిద్దిపేట కోమటి చెరువు వద్ద పరిశీలిస్తున్న మాజీ మంత్రి హరీశ్‌రావు

**కలెక్టరేట్, నమస్తే తెలంగాణ:** లక్నవరం తరహాలో సిద్దిపేట కోమటి చెరువుపై సస్పెన్షన్ బ్రిడ్జి నిర్మించి పర్యాటక కేంద్రంగా ఏర్పాటు చేయనున్నట్టు మాజీమంత్రి, ఎమ్మెల్యే తన్నీరు హరీశ్‌రావు పేర్కొన్నారు. శుక్రవారం అధికారులతో కలిసి చెరువును సందర్శించారు. రెండు మూడునెలల్లో ఈ వంతెనను అందుబాటులోకి తేవాలని అధికారులను ఆదేశించారు. మున్సిపల్ చైర్మన్ రాజనర్సు ఉన్నారు.

**సీఎం చొరవతో బ్రాహ్మణ భవన్**

బ్రాహ్మణ సంక్షేమం కోసం దేశంలోనే తొలిసారి సిద్దిపేటలో సీఎం కేసీఆర్ చొరవతో బ్రాహ్మణ భవన్‌ను నిర్మిస్తున్నామని హరీశ్‌రావు తెలిపారు. శుక్రవారం రాష్ట్ర బ్రాహ్మణ పరిషత్ అధ్యక్షుడు కేవీ రమణాచారితో కలిసి సిద్దిపేట బ్రాహ్మణ పరిషత్‌ను సందర్శించారు. వేద పండితులకు, ఉప నయనాలకు, ఆధ్యాత్మికతకు సిద్దిపేట బ్రాహ్మణ పరిషత్ వేదికగా నిలువాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో రాష్ట్ర బ్రాహ్మణ పరిషత్ సభ్యులు మృత్యుంజయశర్మ, వెంకటేశ్వర శర్మ, రామ్మోహనశర్మ, రాధాకృష్ణ శర్మ, హరినాథ శర్మ పాల్గొన్నారు.

## మానవత్వం చాటిన నల్లగొండ జేసీ

### క్షతగాత్రుడిని దవాఖానకు తరలింపు

**దేవరకొండ, నమస్తే తెలంగాణ:** నల్లగొండ జిల్లా జాయింట్ కలెక్టర్ చంద్రశేఖర్ మానవత్వాన్ని చాటుకున్నారు. గాయపడ్డ ఓ వ్యక్తి చికిత్సకోసం సాయపడ్డారు. డిండి మండలం ఎర్రారం పంచాయతీ జాల్‌తండాకు చెందిన ముడావత్ డేల కుటుంబం శుక్రవారం ఆటోలో వ స్తుండగా బాపన్‌కుంట సమీపంలో అదుపుతప్పి బోల్తాపడింది. డేలకు తీవ్ర గాయాలుకాగా, మిగతావారు స్వల్పంగా గాయపడ్డారు. అప్పుడే ఎంపీపీ ఎన్నిక పర్యవేక్షణకు డిండి వెళ్తున్న జేసీ చంద్రశేఖర్, దేవరకొండ ఆర్డీవో లింగ్యానాయక్ సహాయక చర్యలు చేపట్టారు. డేలాను ఆర్డీవో వాహనంలో దేవరకొండకు పంపి, అక్కడినుంచి హైదరాబాద్‌కు పంపేందుకు చర్యలు చేపట్టారు.

## ప్రియుడితో కలిసి భర్తను చంపిన భార్య

**టేకులపల్లి:** అక్రమ సంబంధానికి అడ్డు తగులుతున్నాడనేని ఓ భార్య ప్రియుడితో కలిసి భర్తను హతమార్చింది.ఈ ఘటన భద్రాద్రి కొత్తగూడెం జిల్లా టేకులపల్లి మండలం తావుర్యాతండాలో శుక్రవారం చోటుచేసుకుంది. తండాకు చెందిన ధారావత్ నందు(23)కు అదే తండాకు చెందిన సుప్రియతో 2015లో పెండ్లి జరిగింది. వీరికి ఇద్దరు పిల్లలు. నందు వ్యవసాయం చేసుకుంటూనే కొత్తగూడెంలోని ఓ సూపర్‌మార్కెట్‌లో పనిచేస్తున్నాడు. సమీప కొక్యాతండాకు చెందిన ఓ యువకుడితో సుప్రియ కొన్నాళ్లుగా చనువుగా ఉంటున్నట్టు గమనించిన నందు ఆమెను మందలించాడు. భర్తను అడ్డుతొలిగించుకోవాలని పథకం పన్నింది. శుక్రవారం పనికి వెళ్లి వచ్చిన భర్తకు మద్యం తాగించి ప్రియుడికి సమాచారం అందించింది. మద్యం మత్తులో ఉన్న నందును సుప్రియ, ఆమె ప్రియుడు, మరో ఇద్దరు కలిసి సమీప జామాయిల్ తోటలోకి తీసుకెళ్లి ఉచ్చులు పెట్టే తీగతో గొంతు నులిమి హత్యచేశారు. శవాన్ని ఇంట్లో పడుకొబెట్టారు. తర్వాత అత్తమామల వద్దకు వెళ్లి తన భర్త పడిపోయాడని సుప్రియ నాటకం మొదలుపెట్టింది. గాయాలను గమనించిన కుటుంబసభ్యులు పోలీసులకు సమాచారం ఇవ్వగా, వారు సుప్రియను అదుపులోకి తీసుకున్నారు.



వేములవాడ రాజరాజేశ్వర స్వామి ఆలయం శుక్రవారం భక్తులతో రద్దీగా కనిపించింది. వేసవి సెలవులు ముగుస్తుండగా స్వామివారి దర్శనానికి భక్తులు తరలివస్తున్నారు. శుక్రవారం8 వేల మంది రాజన్నను దర్శించుకోగా, రూ.7లక్షల ఆదాయం సమకూరింది.

**వరల్డ్‌కప్‌లో నేడు** ఇంగ్లండ్ X బంగ్లాదేశ్ - 3 గం., ఆఫ్ఘనిస్థాన్ X న్యూజిలాండ్ - 6 గం. స్టార్ స్పోర్ట్స్‌లో

అత్యధిక పరుగులు **158** రూట్ (ఇంగ్లండ్) | అత్యధిక వికెట్లు **7** హెన్రీ (న్యూజిలాండ్)

ఎప్పటి నుంచో క్రికెట్‌పై తమదైన ముద్ర వేసిన జట్లు ఓ వైపు.. ఇప్పుడిప్పుడే నిలదొక్కుకుంటున్న జట్లు మరోవైపు.
బలమైన పేస్ దళం, నిండైన ఆల్‌రౌండర్లతో కూడిన జట్లు ఓ వైపు.. స్పిన్నే ప్రధానాయుధమైన ఆసియా జట్లు మరోవైపు.
మహామహా బ్యాట్స్‌మెన్, రికార్డుల రారాజులు ఓ వైపు.. ఒకరిద్దరు మినహా చెప్పుకోదగ్గ బ్యాట్స్‌మెన్ లేని టీమ్స్ మరోవైపు.
హాట్ ఫేవరెట్ ఇంగ్లండ్‌తో బంగ్లాదేశ్.. సెమీస్ స్టార్ న్యూజిలాండ్‌తో ఆఫ్ఘనిస్థాన్ నేడు ఢీకొననున్నాయి.
ఓ మ్యాచ్ నెగ్గి.. ఓ మ్యాచ్ ఓడి ఇంగ్లండ్, బంగ్లా రెండేసి పాయింట్లతో ఉంటే..
ఆడిన రెండు మ్యాచ్‌ల్లో గెలిచిన న్యూజిలాండ్ టేబుల్ టాపర్‌గా.. రెండూ ఓడిన ఆఫ్ఘన్ అట్టడుగున ఉంది.



# బదులు తీర్చుకునేనా..

**ప్రతీకారంపై కన్నేసిన ఇంగ్లండ్ ■ నేడు బంగ్లాదేశ్‌తో అమీతుమీ**

**కార్డిఫ్:** గత ప్రపంచకప్ లీగ్ దశలో బంగ్లా చేతిలో ఎదురైన పరాజయానికి బదులు తీర్చుకోవాలని ఇంగ్లండ్.. దక్షిణాఫ్రికాపై విజయం గాలి వాటం కాదని నిరూపించుకునేందుకు బంగ్లాదేశ్ సిద్ధమయ్యాయి. కార్డిఫ్‌లోని సోఫియా గార్డెన్ వేదికగా శనివారం ఇరు జట్లు ఢీకొననున్నాయి. తొలి మ్యాచ్‌లో దక్షిణాఫ్రికాపై అదిరిపోయే ఆటతో బోణీ కొట్టిన ఇంగ్లండ్ రెండో మ్యాచ్‌లో పాకిస్థాన్ చేతిలో అనూహ్యంగా ఓడితే.. మొదటి మ్యాచ్‌లో అదే సఫారీలను సఫా చేసిన బంగ్లా రెండో మ్యాచ్‌లో కివీస్ చేతిలో పో రాడి ఓడింది. 2015 వరల్డ్‌కప్‌లో తమను ఓడించి పరోక్షంగా జట్టు అభ్యున్నతికి బాటలు వేసిన బంగ్లాపై విరుచుకుపడి తమ బ్యాటింగ్ ప్రతాపం చూపాలని మోర్గాన్ సేన భావిస్తున్నది. సొంతగడ్డపై ఫేవరెట్‌గా బరిలోదిగుతున్న ఇంగ్లిష్ జట్టును మొర్తజా సేన ఎలా అడ్డుకుంటుందనేది ఆసక్తికరం.

**ఆ ఒక్కడే ఎంతకనీ..**
స్టార్ ఆల్‌రౌండర్ షకీబుల్ హసన్ అటు బ్యాటుతోనూ ఇటు బంతితోనూ అదరగొడుతున్నాడు. జట్టు భారాన్నంతా భుజానెత్తుకొని ఒక్కడే నడిపిస్తున్నాడు. సహచరుల నుంచి అతడికి కాస్త సహకారం అందుతున్నా.. అది సరిపోవడం లేదు. అవసరమైనప్పుడల్లా వికెట్లు తీసిస్తున్న షకీబ్ బంగ్లాకు వెయ్యి ఏనుగుల బలం అనడంలో సందేహం లేదు. ఇంగ్లండ్‌తో మ్యాచ్‌లోనూ అతడే కీలకం కానున్నాడు. 'ఇక్కడికి వచ్చింది పెద్ద జట్లకు షాకిచ్చేందుకు కాదు.. మమ్మల్ని పసికూనల్లా చూడటం మానండి'అని కెప్టెన్ మష్రఫే మొర్తజా చెప్పినట్లే ఆ జట్టు ఆడిన రెండు మ్యాచ్‌ల్లో చక్కటి పోరాటం కనబర్చింది. తొలి మ్యాచ్‌లో దక్షిణాఫ్రికాపై నెగ్గిన బంగ్లా రెండో మ్యాచ్‌లో కివీస్‌ను ఓడించినంత పని చేసింది. చివర్లో తడబడకుంటే ఆ మ్యాచ్‌లోనూ బంగ్లా విజయం సాధించేదే. అలాంటి చిన్న చిన్న పొరపాట్లను అధిగమించేందుకు ప్రయత్నిస్తే.. మొర్తజా సేనకు తిరుగుండదు.

**సమిష్టిగా ఆడాలి..**
రాయ్, బెయిర్‌స్టో, రూట్, మోర్గాన్, స్టోక్స్, బట్లర్, మొయిన్ అలీ, వోక్స్, ఆర్చర్.. చూస్తేనే దడపుట్టే బ్యాటిం గ్ ఆర్డర్ ఇంగ్లండ్‌ది. మెగాటోర్నీ ఆరంభ మ్యాచ్‌లో పటిష్ఠ దక్షిణాఫ్రికాపై 104 పరుగుల తేడాతో నెగ్గిన




ఇంగ్లండ్.. పాకిస్థాన్‌తో రెండో మ్యాచ్‌లో తడబడింది. ఆ ఓటమి నుంచి తేరుకొని ఈ మ్యాచ్‌ను తాజాగా మొదలెట్టాలనుకుంటున్నది. గత మ్యాచ్‌లో పెద్దగా ప్రభావం చూపలేకపోయిన లెగ్‌స్పిన్నర్ రషీద్ స్థానంలో ప్లంకెట్ జట్టులోకి రావడం మినహా తుది పదకొండులో మార్పులకు అవకాశం లేదు.


**న్యూజిలాండ్ X ఆఫ్ఘనిస్థాన్**
మరో మ్యాచ్‌లో పాయింట్ల పట్టికలో అగ్రస్థానంలో ఉన్న న్యూజిలాండ్... చిట్టచివరన ఉన్న ఆఫ్ఘనిస్థాన్‌తో శనివారం తలపడనున్నాయి. తొలి మ్యాచ్‌లో శ్రీలంకపై సునాయస విజయం సాధించిన కివీస్... బంగ్లాదేశ్‌పై జరిగిన రెండో పోరులో తీవ్రంగా శ్రమించింది. బ్యాటింగ్ వైఫల్యం కారణంగా ఆఫ్ఘనిస్థాన్ మాత్రం రెండు మ్యాచ్‌ల్లోనూ ఓడింది.

# నాదల్ 12వ సారి..

**పారిస్:** ఫ్రెంచ్ ఓపెన్ గ్రాండ్‌స్లామ్ టోర్నీలో స్పెయిన్ బుల్ రఫెల్ నాదల్ మరోసారి గర్జించాడు. ఇప్పటికే 11సార్లు టైటిల్‌ను కైవసం చేసుకున్న అతడు.. మరోసారి ఫైనల్‌కు చేరుకున్నాడు. సెమీస్‌లో దిగ్గజ ఆటగాడు రోజర్ ఫెదరర్ (స్విట్జర్లాండ్)ను 6-3, 6-4, 6-2తో వరుస సెట్ల లో అలవోకగా ఓడించి మట్టికోర్టులో తనకు తిరుగులేదని చాటిచెప్పాడు. మ్యాచ్‌లో 33 విన్నర్లు కొట్టిన నాదల్... 19 తప్పిదాలు చేశాడు. ఆరుసార్లు స్విస్ స్టార్ సర్వీస్‌ను బ్రేక్ చేశాడు. గ్రాండ్‌స్లామ్ టోర్నీల్లో గత 11 ఏండ్లలో ఫెదరర్‌కు అదే అత్యంత ఘోరమైన ఓటమి. పురుషుల సింగిల్స్ మరో సెమీస్‌లో ప్రపంచ నంబర్‌వన్ నోవాక్ జొకోవిచ్(సెర్బియా)... నాలుగో సీడ్ డొమినిక్ థీమ్(ఆస్ట్రియా) మధ్య పోరుకు వర్షం ఆటంకం కలిగించింది. కడపటి వార్తలు అందేసరికి జోకోవిచ్ 2-6, 6-3, 1-3తో కాస్త వెనుకంజలో ఉన్నాడు.



**అనిసిమోవా పరాజయం:**
డిఫెండింగ్ చాంపియన్ సిమోనా హలెప్‌ను క్వార్టర్స్‌లో ఓడించి సంచలనం సృష్టించిన అన్‌సీడెడ్ ప్లేయర్ అనిసిమోవా(అమెరికా) తన పోరాటాన్ని ముగించింది. శుక్రవారం జరిగిన మహిళల సింగిల్స్ సెమీస్‌లో అనిసిమోవా 7-6(7/4), 3-6, 3-6తో ఆష్లే బార్టీ(ఆస్ట్రేలియా) చేతిలో పరాజయం పాలైంది. హోరాహోరీగా సాగిన మరో సెమీస్‌లో వాండ్రోసోవా(చెక్ రిపబ్లిక్) 7-5, 7-6(7/ 2)తో జోహన్న కొంటా(బ్రిటన్)పై వరుస సెట్లలో విజయం సాధించింది. మ్యాచ్‌లో ఒక ఏస్‌తో పాటు నాలుగుసార్లు ప్రత్యర్థి సర్వీస్‌ను వాండ్రోసోవా బ్రేక్ చేసింది. మహిళల సింగిల్స్ ఫైనల్‌లో ఎనిమిదో సీడ్ బార్టీతో వాండ్రోసావా శనివారం తలపడుతుంది. ఫ్రెంచ్ ఓపెన్ ఫైనల్‌కు చేరడం వీరిద్దరికిదే తొలిసారి.



# ఒక్క బంతి పడకుండానే

**బ్రిస్టల్:** మాజీ చాంపియన్‌లు పాకిస్థాన్, శ్రీలంక మధ్య శుక్రవారం జరగాల్సిన మ్యాచ్ వర్షం కారణంగా రద్దైంది. ఫలితంగా ఇరు జట్లకు చెరో పాయింట్ లభించింది. భారీ వర్షం నడుమ పలుమార్లు మైదానాన్ని పరిశీలించిన అంపైర్లు ఆఖరికి మ్యాచ్ జరిగే పరిస్థితులు లేకపోవడంతో ఆటను రద్దు చేస్తున్నట్లు ప్రకటించారు. చివరికి 20 ఓవర్ల మ్యాచ్‌నైనా నిర్వహించాలని ముందు అనుకున్నా.. వరుణుడు ఆ అవకాశం ఇవ్వలేదు. దీంతో అభిమానులకు నిరాశే మిగిలింది. ఇప్పటికే పాక్, లంక ఒక్కో మ్యాచ్ గెలిచి.. ఒక్కోటి ఓడి రెండేసి పాయింట్లతో ఉన్నాయి. తాజా ఫలితంతో ఇద్దరి ఖాతాలో ఒక్కో పాయింట్ చేరింది.

**టీమ్‌ఇండియా ప్రాక్టీస్‌కు వర్షం దెబ్బ**
**లండన్:** తొలి మ్యాచ్‌లో దక్షిణాఫ్రికాపై గెలిచి జోరు మీద ఉన్న టీమిండియా.. డిఫెండింగ్ చాంపియన్ ఆస్ట్రేలియాతో తలపడేందుకు చేస్తున్న కసరత్తులకు వర్షం ఆటంకం కలిగించింది. వాన కారణంగా శుక్రవారం ప్రాక్టీసు సెషన్ మొత్తం రద్దయింది. కీలకమైన ఆసీస్ మ్యాచ్‌కు ముందు ఇక ప్రాక్టీసు చేసేందుకు టీమిండియాకు శనివారం మాత్రమే ఉంది.

# ధోనీ ధరించవద్దు..

- గ్లౌవ్స్‌పై ఆర్మీ చిహ్నానికి ఐసీసీ అనుమతి నిరాకరణ
- బీసీసీఐ అభ్యర్థనకు తిరస్కరణ



**లండన్/ముంబై:** భారత సీనియర్ క్రికెటర్ ధోనీ తన గ్లౌవ్స్‌పై ఆర్మీ చిహ్నాన్ని ధరించేందుకు అంతర్జాతీయ క్రికెట్ కౌన్సిల్(ఐసీసీ) ససేమిరా అంది. నిబంధనలకు విరుద్ధంగా ఉండే ఎలాంటి చిహ్నాలను అనుమతించేది లేదంటూ ఐసీసీ కరాఖండిగా స్పష్టం చేసింది. అమర జవాన్ల స్ఫూర్తిని రగిలించేలా ఉన్న బలిదాన్ గుర్తును దక్షిణాఫ్రికాతో జరిగిన గత మ్యాచ్‌లో ధోనీ ధరించడం వివాదానికి కారణమైంది. చాహల్ బౌలింగ్‌లో సఫారీ ఆల్‌రౌండర్ ఫెల్కువాయోను స్టంప్ ఔట్ చేసినప్పుడు కెమెరా కండ్లకు ధోనీ గ్లౌవ్స్‌పై చిహ్నం కనిపించింది. దీన్ని పట్టిపట్టి చూపించడంతో సోషల్‌మీడియాలో వైరల్‌గా మారి ఐసీసీ దృష్టికి వచ్చింది. దీనిపై బీసీసీఐ స్పందిస్తూ ఆస్ట్రేలియాతో ఆదివారం జరిగే మ్యాచ్‌లో ధోనీ సదరు చిహ్నంతో ఉన్న గ్లౌవ్స్‌తో బరిలోకి దిగేందుకు అనుమతివ్వాలంటూ ఐసీసీని అభ్యర్థించింది. ధోనీ ధరించిన గ్లౌవ్స్‌పై ఆర్మీకి సంబంధించి ఎలాంటి గుర్తులు లేవని పేర్కొంటూ క్రికెట్ పరిపాలన కమిటీ(సీవోఏ) చీఫ్ వినోద్ రాయ్..ఐసీసీని కోరడం జరిగింది. దీనిపై శుక్రవారం క్రికెట్ అత్యున్నత కౌన్సిల్ స్పందించింది. 'నియమ, నిబంధనల ప్రకారం ఐసీసీ ఈవెంట్లలో ఆటగాళ్లు ధరించే జెర్సీలపై వ్యక్తిగత సందేశాలు, లోగోలను ఎట్టి పరిస్థితుల్లో అనుమతించేది లేదు. వికెట్‌కీపర్ గ్లౌవ్స్‌పై కంపెనీ లోగో తప్పా..మరే లోగో కనిపించకూడదు. దక్షిణాఫ్రికాతో మ్యాచ్‌లో ధోనీ ధరించిన గ్లౌవ్స్‌పై కంపెనీ లోగోతో పాటు చిహ్నం కనిపించింది. ఇలాంటి గ్లౌవ్స్ మెగాటోర్నీలో మిగిలిన మ్యాచ్‌ల్లో ధరించేందుకు ధోనీకి అనుమతి ఇవ్వడం లేదు' అని ఐసీసీ ఒక ప్రకటనలో పేర్కొంది.

**ధోనీ ఎందుకు ధరించాడు:**
టెరిటోరియల్ ఆర్మీ ప్యారాచూట్ రెజిమెంట్‌లో ప్రస్తుతం లెఫ్టినెంట్ కర్నల్ హోదాలో ఉన్న ధోనీకి దేశమంటే ఎనలేని ప్రేమ. చాలా సందర్భాల్లో సైనికుల పట్ల ధోనీ గౌరవాన్ని చాటుకున్నాడు. ఇటీవల పుల్వామా ఉగ్రదాడిలో ప్రాణాలు కోల్పోయిన జవాన్ల స్మారకార్థం ఆస్ట్రేలియాతో మ్యాచ్‌లో ఆర్మీ క్యాప్‌లతో భారత జట్టు బరిలోకి దిగడం ధోనీదే ఆలోచన. మూడోసారి కప్‌ను గెలువాలనుకుంటున్న భారత జట్టు అందుకు అనుగుణంగా అమర సైనికుల స్ఫూర్తిని ప్రేరణగా తీసుకునేందుకు బలిదాన్ చిహ్నాన్ని పోలిన గుర్తును గ్లౌవ్స్‌పై ధరించాడు.

**ధరించాల్సిందేనంటున్న అభిమానులు:**
ధోనీ విషయంలో ఐసీసీ నిర్ణయంపై ఆగ్రహంతో ఉన్న అభిమానులు..బలిదాన్ గుర్తుతో ఆడాల్సిందేనంటూ సోషల్‌మీడియాలో ప్రచారానికి తెరలేపారు. #dhonikeep the glove అనే యాష్ ట్యాగ్‌తో ట్రెండింగ్ చేస్తున్నారు.

# భారత్‌కు రెండో విజయం



**భువనేశ్వర్:** హెచ్ఎఫ్ఐ సిరీస్ ఫైనల్స్‌లో భారత హాకీ జట్టు దూకుడైన ఆటతో దూసుకెళుతోంది. శుక్రవారమిక్కడ జరిగిన రెండో పూల్ మ్యాచ్‌లో పోలెండ్‌పై 3-1 గోల్స్ తేడాతో విజయం సాధించింది. కెప్టెన్ మన్‌ప్రీత్ సింగ్ తొలి రెండు గోల్స్(21,26 ని.)ను సాధించగా, మూడో గోల్‌ను హర్మన్‌ప్రీత్(36 ని.) బాదాడు. పోలెండ్‌లో హుల్‌బోజ్ ఒక్కడే గోల్ సాధించాడు. 21వ నిమిషంలో వచ్చిన పెనాల్టీ కార్నర్ అవకాశాన్ని కెప్టెన్ మన్‌ప్రీత్ సింగ్ అందిపుచ్చుకొని గోల్ కొట్టడంతో టీమిండియా ఖాతా తెరిచింది. 25వ నిమిషంలో పోలెండ్ ఆటగాడు హుల్‌బోజ్ గోల్ కొట్టడంతో స్కోరు 1-1తో సమమైంది. ఆ తర్వాతి నిమిషానికే(26 ని.) కెప్టెన్ మన్‌ప్రీత్ సింగ్ మరో గోల్ కొట్టి భారత్‌ను మళ్లీ ఆధిక్యంలోకి తెచ్చాడు.









నమస్తే తెలంగాణ

జిందగీ

శనివారం 8 జూన్ 2019 WWW. NTNEWS.COM /nt.zindagi

## ఆరోగ్యానికి వెల్లుల్లి



- వెల్లుల్లిని రోజూ మన ఆహారంలో చేర్చుకోవడం వల్ల శరీరంలోని కొవ్వు పదార్థాల స్థాయి తగ్గుతుంది. అంతేకాకుండా వెల్లుల్లి రసాన్ని రోజూ తాగడం వల్ల ధమనులలో అడ్డంకులను తొలగించి రక్తప్రసరణను మెరుగుపరిచి, గుండె వ్యాధులకు గురవకుండా సహాయపడుతుంది.
- వెల్లుల్లి రసం మొటిమలను నివారించి చర్మం మృదువుగా మారడంలో కూడా సహాయపడుతుంది. వెల్లుల్లి రసాన్ని తీసుకుని, కేవలం మొటిమలపై మాత్రమే అప్లై చేసి, కొద్దిసేపటి తర్వాత కడిగేయాలి. ఇలా కొన్ని రోజులు చేస్తే మంచి ఫలితాలుంటాయి.
- రాత్రి పడుకునే ముందు వెల్లుల్లిని ముఖానికి పెట్టుకొని పడుకోకూడదు. దీనివల్ల చర్మానికి హాని కలుగవచ్చు. వెల్లుల్లి రసం జుట్టు రాలడాన్ని కాకుండా, రాలిన వెంట్రుకలు మళ్లీ పెరిగేలా చేస్తుంది. అదెలాగంటే జుట్టు రాలిన ప్రదేశంలో వెల్లుల్లి రసాన్ని అప్లై చేయండి. ఇలా రోజులో రెండు సార్లు చేస్తే బట్టతల రాదు.
- వెల్లుల్లి రసాన్ని ముఖానికి అప్లై చేసే సమయంలో కళ్లలో పడకుండా జాగ్రత్తపడాలి. వెల్లుల్లి రసం తలపై అప్లై చేద్దామనుకునే వారు కొన్ని రోజులు హానికరమైన షాంపూలు, జెల్ క్రిములు వాడకపోవడం మంచిది.
- వెల్లుల్లి రసాన్ని ఒక గ్లాసు దానిమ్మ రసంలో కలుపుకొని తాగడం వల్ల దగ్గు నుంచి ఉపశమనం కలుగుతుంది. వేడి నీటిలో వెల్లుల్లి రసాన్ని కలిపి పుక్కిలిస్తే గొంతు నొప్పి నుంచి కూడా ఉపశమనం పొందవచ్చు.



# రిఫరీ లక్ష్మి 2.0!

**క్రికెట్ ఆమె జీవితం.. క్రికెట్ ఆమెకు చదువునిచ్చింది.. ఉద్యోగాన్నిచ్చింది.. జీవితం సజావుగా సాగడానికి కావలసిన ఒక దారి చూపించింది.. క్రికెట్‌లో జాతీయ స్థాయిలో రాణించింది.. దేశ గౌరవాన్ని ఇనుమడింప చేసింది.. జోనల్ స్థాయి నుంచి జాతీయ స్థాయి వరకూ.. రిఫరీగా అనూహ్యమైన అనుభవం సాధించింది.. ఇప్పుడు భారతదేశం నుంచి.. ఐసీసీకి ఎంపికైన తొలి మహిళా రిఫరీగా రికార్డు కొట్టేసింది. ఆమే.. గండికోట సర్వలక్ష్మి.**

**కచ్చితంగా** కష్టపడితే కాలం మనకెప్పుడూ ఓ విజయాన్ని బాకీ పడుతుంటుంది. కాస్త ఓపికగా వేచి ఉంటే వడ్డీతో సహా ఆ బాకీని తేర్చేస్తుంది. ఇదేదో సినిమా మాటలు కాదు. ప్రతీ కార్యసాధకునికి ఉండాల్సిన లక్షణాల్లో ఒకటి. అందులో క్రీడాకారులకు ఉండాల్సిన ముఖ్యమైన లక్షణం. ఆట గెలుపు కోసం ఆడడం వేరు, గెలుపు నుంచి వచ్చే అవకాశాల కోసం ఆడడం వేరు. గెలువాలి, గెలుస్తూనే ఉండాలి. అవకాశాలు వస్తాయా? రావా? అనేది వేరే సంగతి. కానీ ఆట మీద తీవ్రమైన అభిరుచి, శ్రద్ధ, సాధన వాటి నుంచి వచ్చే విజయం.. ఇవ్వన్నీ ఎప్పుడో ఒకసారి అవకాశాలను తెచ్చిపెడతాయి. లక్ష్మి జీవితంలో అదే నిజమైంది. 50 యేండ్ల వయసులో ఆమెను ఐసీసీ గుర్తించింది.

### సీట్ రాలేదు..

బౌలర్‌గా, కెప్టెన్‌గా, రిఫరీగా లక్ష్మి అనుభవం ఆమె జీవితంలో ఒక పార్శ్వం మాత్రమే. క్రికెటర్‌గా ఆమె జీవితం చాలా అనూహ్యంగా మొదలైంది. ఆమె పుట్టింది రాజమండ్రిలో అయినా ప్రాథమిక విద్యాభ్యాసం అంతా జమ్‌షెడ్‌పూర్‌లో సాగింది. ఆమె రోజూ గల్లీలో అబ్బాయిలతో క్రికెట్ ఆడేది. ఇట్లా ఆమెకు క్రికెట్ అలవాటైంది. అదే సమయంలో పదో తరగతి పరీక్షలు రాసింది. చాలా తక్కువ మార్కులొచ్చాయి. మంచి కాలేజీలో ఇంటర్ చదువాలని ఉండేది. కానీ తక్కువ మార్కులు చూసి ఏ కాలేజీ ఇంటర్ సీట్ ఇవ్వలేదు. ఇలా ఆమె, వారి తండ్రి శేషగిరిశర్మ కలిసి ఇంటర్ సీట్ కోసం ప్రయత్నాలు చేశారు. ఓ కాలేజీ ప్రిన్సిపాల్ స్పందించి మార్కులు తక్కువ ఉన్నా ఫర్వాలేదు. ఇతర రంగాల్లో నైపుణ్యం ఉంటే ప్రవేశం దొరుకుతుందని చెప్పాడు. పురుషులతో క్రికెట్ ఆడుతుందనీ, అదొక్క దాంట్లో మంచి నైపుణ్యం ఉందని ప్రిన్సిపాల్‌తో శేషగిరి చెప్పాడు. దీంతో వెంటనే ప్రిన్సిపాల్ లక్ష్మికి క్రికెట్‌లో టెస్ట్ పెట్టించాడు. బీహార్ టీమ్ కోచ్ పర్యవేక్షణలో ఈ టెస్ట్ జరిగింది. అప్పుడు లక్ష్మి చుడీదార్, చెప్పులతో బౌలింగ్ చేసింది. ఆ టెస్ట్‌లో ఆమె తీరు చూసి క్రికెట్‌లో మంచి భవిష్యత్ ఉంటుందని కోచ్ చెప్పాడు. తర్వాత కళాశాలలో స్పోర్ట్స్ కేటగిరీలో లక్ష్మికి అడ్మిషన్ దొరికింది. ఇలా ఇంటర్ విద్య చదవడానికి లక్ష్మికి క్రికెట్ తోడ్పడింది.

### బీహార్ టీమ్‌లోకి..

కాలేజ్ ఆమెకు ప్రత్యేకమైన కోచింగ్ ఇవ్వడానికి సిద్ధమైంది. అప్పుడే మొదటిసారి తెలిసింది క్రికెట్‌లో ప్రత్యేక రకాల బంతులుంటాయనీ, ప్రత్యేక బ్యాట్‌లు, జెర్సీలుంటాయని. అలా ఆమె ప్రాక్టీస్ అంతకంతకు పెరిగింది. 1986వ సంవత్సరం అది.. అప్పట్లో మహిళాక్రికెట్ టీమ్‌లో బౌలర్లు తక్కువగా ఉండేవారు. లక్ష్మి మంచి బౌలింగ్ నైపుణ్యాన్ని కలిగి ఉండేది. దీంతో సులువుగానే బీహార్ రంజీ బృందంలో స్థానం లభించింది. జూనియర్, సీనియర్ ఉమెన్ క్రికెట్ పోటీల్లో ఆడారు. అప్పుడే ఆమెకు స్పోర్ట్స్ కేటగిరీలో ప్రభుత్వ ఉద్యోగాలుంటాయన్న సంగతి తెలిసింది. వెంటనే రైల్వే ఉద్యోగానికి ప్రయత్నించింది. స్పోర్ట్స్ కేటగిరిలోనే దక్షిణ మధ్య రైల్వేలో ఉద్యోగం సాధించింది. రైల్వేలో ఉద్యోగం వచ్చిన తర్వాత లక్ష్మికి కొన్ని ఒడుదొడుకులు ఎదురయ్యాయి. ఇక్కడ సీనియర్లు ఎక్కువగా ఉండడంతో సరైన అవకాశాలు వచ్చేవి కావు. ఎంతో నిరాశకు గురయింది. ఇదే సమయంలో పెండ్లి జరుగడం, అవకాశాలు రాకపోవడం, ఆడాల్సిన మ్యాచ్‌లకు దూరం కావడం క్రికెట్‌లో కొంత గ్యాప్ ఏర్పడింది. అప్పుడే రైల్వే జట్టునుంచి బయటకు వచ్చింది. అదే ఏడాదిలో ఏపీ ఉమెన్స్ టీమ్‌లో జోనల్ మ్యాచ్‌లో పాల్గొన్నది. అత్యధిక వికెట్లు తీసి ప్రతిభ కనబరిచింది. ఇంగ్లాండ్‌లో జరిగే పోటీలకు జాతీయ జట్టుకు ప్రాతినిధ్యం వహించడానికి ఎంపికయింది.



### బీసీసీఐ నిర్ణయం..

జాతీయ జట్టులో కొనసాగుతున్న క్రమంలో బీసీసీఐ కీలక నిర్ణయాలు తీసుకుంది. ఆ నిర్ణయాలే లక్ష్మికి మేలు చేశాయి. 2008లో మొదటి సారి బీసీసీఐ మహిళా రిఫరీలను ఎంపిక చేసింది. మొత్తం ఎనిమిది మంది ఎంపికైయ్యారు. వీరిలో లక్ష్మి ఒకరు. ఈ రిఫరీలంతా మహిళల జోనల్ మ్యాచ్‌లకే పని చేస్తారు. కొన్ని రోజుల తర్వాత మళ్లీ ఐదు సంవత్సరాల తర్వాత బీసీసీఐ మరోసారి కీలక నిర్ణయం తీసుకుంది. పురుషుల మ్యాచ్‌ల కోసం ఎనిమిది మంది మహిళలను ఎంపిక చేసింది. దీంట్లో కూడా లక్ష్మి ఎంపికయింది. ఇట్లా లక్ష్మి జాతీయ మ్యాచ్‌ల్లో రిఫరీగా వ్యవహరించింది. మన దేశంలో జరిగిన మహిళల అంతర్జాతీయ పోటీల్లో మూడు వన్డేలకు, ఆరు టీ-ట్వంటీలకు లక్ష్మి రిఫరీగా బాధ్యతలు నిర్వహించారు. ఇలా లక్ష్మి జోనల్ స్థాయి నుంచి బీసీసీఐ వరకూ ప్రస్థానం సాగింది.

### ఐసీసీలోకి..

కిందటి ఏడాది ఐసీసీకి లక్ష్మి పేరు ప్రాతిపాదించింది బీసీసీఐ. కొన్ని రోజుల కిందటే ఐసీసీ ఈ ప్రతిపాదనను అంగీకరించింది. ఐసీసీ ఎంపిక చేసి మహిళల రిఫరీల లిస్ట్‌లో మన దేశం నుంచి తొలిసారిగా లక్ష్మికి అవకాశం దక్కింది. ఈ అవకాశం పట్ల ఆమె సంతోషాన్ని వ్యక్తం చేస్తున్నారు. ఆమె క్రికెట్ ప్రస్థానం గల్లీ నుంచి మొదలై ఎన్నో ఆటుపోట్లు, అవాంతరాలను ఎదుర్కొన్నది. బీసీసీఐలో రిఫరీగా కొనసాగిన ఆమె ఇప్పుడు ఐసీసీ రిఫరీగా తన క్రికెట్ జీవితాన్ని కొనసాగించనున్నది. బీసీసీఐ ఇచ్చిన అవకాశాలు, నిర్ణయాల వల్లే తనకు ఈ అవకాశం దక్కిందనీ, మొదట్లో ఇలాంటి అవకాశాలు రాకపోయేవని తెలిపింది. 'గత రెండు మూడేండ్ల కాలంలో క్రీడారంగంలో అనేక మార్పులొచ్చాయి. ప్రతిభ కనబర్చిన క్రీడాకారులకు అవకాశాలొస్తున్నాయి. ఆ దిశగా అథారిటీలు క్రీడాకారులను గుర్తిస్తున్నాయి' అని లక్ష్మి అంటున్నది.

... వినోద్ మామిడాల

విద్యాసాగర్

> **నేను ఆగిపోను..**
>
> నాకు అంతర్జాతీయ స్థాయిలో అకాశం వచ్చింది. వయసు కారణంగానో, కుటుంబం కారణంగానో నేను ఆగిపోను. ఐసీసీ రిఫరీగా నేను కొనసాగుతాను. ఏ రంగంలోనైనా అవకాశాలు సులువుగా దక్కవు. అందులో మహిళల పరిస్థితి చెప్పనక్కర్లేదు. క్రికెట్‌లో జీవితం గడపడం నా కల. పెండ్లి తర్వాత కూడా క్రికెట్ ఆడతానని ముందే మావారికి చెప్పాను. అందరి సపోర్ట్‌తో, ధైర్యంతో నేను ఈ స్థాయికి వచ్చాను. ఇప్పుడు ఏవో కారణాలతో ఆగిపోతే నాలాంటి మహిళలు కూడా ఆగిపోతారు. అలా జరుగకూడదు. పెండ్లి తర్వాతనో, పిల్లలు పుట్టిన తర్వాతనో జీవితం అయిపోతుందని అనుకుంటాం. మేం మహిళలం, ఇది చేయొచ్చా, అది చేయొచ్చా అనే ఆలోచనను బద్ధలు కొట్టాలి. మన దగ్గర మనోధైర్యం, ఆసక్తి ఉంటే జీవితపు చివరి దశ వరకూ మనం ఏది చేయాలనుకుంటే అది చేయగలుగుతాం.
>
> **- గండికోట సర్వలక్ష్మి**

## భర్త జ్ఞాపకార్థకంగా!

**సరిగ్గా పద్నాలుగేండ్లు అయింది ఆమె భర్త మరణించి! ఆయన గుర్తుగా అప్పటి నుంచి చెట్లు నాటుతూ, ఇతరులతో నాటిస్తూ రెండు రాష్ట్రాలను పర్యావరణాన్ని కాపాడుతున్నది. ఆమెకు తోడుగా కొన్ని కార్పొరేట్లు ముందుకొచ్చాయి.**

బెంగళూరుకు చెందిన జానెట్ యగ్నేశ్వరన్ పర్యావరణం కోసం పాటుపడుతున్నది. ప్రైవేట్, గవర్నమెంట్ ఇనిస్టిట్యూట్లు కూడా పచ్చదనాన్ని పట్టించుకొనే పరిస్థితిలో లేవు. కానీ మామూలు మహిళ ఈ పనికి పూనుకున్నది. జానెట్ 2006 నుంచి ఇప్పటి వరకు 73,000 మొక్కలను నాటింది. ఈ యేడాదికి మరికొన్ని మొక్కలను నాటే ప్రయత్నంలో ఉన్నది. 2006లో ఆమె భర్తను కోల్పోయింది. ఆయన జ్ఞాపకార్థంగా 5 జూన్ 2006లో మొదటి సారిగా ఒక మొక్క నాటింది. ఆరోజే ప్రపంచ పర్యావరణ దినోత్సవం కావడం కూడా ఆమెను మరింత ఆలోచింప చేసింది. ఇక ఆనాటి నుంచి ఆయన గుర్తుగా మొక్కలను నాటడం మొదలుపెట్టింది. ఈ రకంగా జానెట్ బెంగళూరులోనే కాదు.. కర్ణాటకలోని చాలా ప్రాంతాల్లో మొక్కలు నాటింది. ఈ యేడాది పూర్తయ్యే సరికి చెట్ల సంఖ్య 75,000కు చేరుకోవాలనుకుంటుంది. అంతేకాదు.. ఆమె 'రాజానెట్ యగ్నేశ్వరన్ చారిటబుల్ ట్రస్ట్' ను కూడా ప్రారంభించింది. దీని ద్వారా పొరుగు వాళ్లు కూడా మొక్కలు నాటే సౌకర్యం కల్పించింది. కొన్ని సంవత్సరాలలో కర్ణాటకతో పాటు తమిళనాడులో కూడా చెట్లు నాటుతానంటున్నది. కూర్గ్‌లో 1000, తంజావూర్, తమిళనాడులో 1000కి పైగా మొక్కలు నాటడానికి ఏర్పాట్లు జరుగుతున్నాయి. తమిళనాడు, బెంగళూరు మొదలైన ప్రదేశాలలో మొక్కలు నాటడానికి సామ్‌సంగ్, కేపీఎంజీ, సోనీ, నోకియా కార్పొరేట్లు స్పాన్సర్లుగా ముందుకు వచ్చారు. ఇలా మరింత మంది ఈ పనికి పూనుకుంటే పర్యావరణం మరింత పచ్చగా అవుతుందంటున్నది జానెట్.





## అందానికి ఐదు పండ్లు

**ఫ్రూట్స్ ను ఆరోగ్యాన్ని పెంచే ఆహారంగా మాత్రమే చూస్తారు. కానీ అవి అందాన్ని పెంచేవి కూడా.. ముఖ్యంగా ఓ ఐదు రకాల పండ్లు తిన్నా, శరీరంపై వాటి గుజ్జుతో రుద్దినా చర్మం నిగనిగలాడుతుంది.**



- అరటి పండ్లలో ఉండే ఫైబర్, మినరల్స్, మెగ్నీషియం, పొటాషియం వంటివి మనకు మేలు చేస్తాయి. రక్త ప్రసరణను మెరుగుపరుస్తాయి. రోగనిరోధక శక్తిని పెంచుతాయి. ఇందులో ఉండే విటమిన్లు ఎ, బి, ఇ లు యాంటీ ఏజింగ్ ఏజెంట్‌లా పనిచేస్తాయి. అందుకే వీలైనంత ఎక్కువగా అరటి పండ్లు తినాలి. తేనెతో కలిపి అప్పుడప్పుడు ముఖంపై ప్యాక్ వేసుకుంటే మంచిది.
- కమలా ఫలాల్లోని విటమిన్ సి స్కిన్ టెక్చర్స్‌ను ఇంప్రూవ్ చేస్తుంది. చర్మంపై ఉండే గాయాల్ని, మచ్చల్ని పోగొడుతుంది. వీటి తొక్కలు కూడా ఎంతో మంచివి. వీటిని ఎండబెట్టి, పొడి చేసి, నీటిలో కలుపుకుని స్నానం చేస్తే చర్మం మృధువుగా తయారవుతుంది.
- రోజుకో ఆపిల్ తింటే డాక్టర్‌కి దూరంగా ఉండొచ్చు అంటారు. డాక్టర్‌కే కాదు. బ్యూటీషియన్‌కు కూడా దూరంగా ఉండొచ్చు. ఎందుకంటే ఇందులోని యాంటీ ఆక్సిడెంట్స్ అందాన్ని కాపాడుతాయి. చర్మంపై పేరుకుపోయిన మలినాల్ని తొలిగిస్తాయి. పొడి చర్మం కలవారికి ఆపిల్ చాలా మేలు చేస్తుంది.
- బొప్పాయిలో పపెయిన్ అనే ఎంజైమ్ ఉంటుంది. ఇది చర్మానికి మేలు చేస్తుంది. డెడ్ స్కిన్ సెల్స్‌ను తొలగించి చర్మాన్ని శుభ్రపరుస్తుంది. దీని గుజ్జులో తేనె కానీ పెరుగు కానీ కలిపి రుద్దుకున్నా కూడా చర్మం మెరుస్తూ ఉంటుంది.
- నిమ్మకాయలోని సి విటమిన్ చర్మ సౌందర్యానికి చేసే మేలు అంతా ఇంతా కాదు. శరీరంలో వేడిని తగ్గిస్తుంది. మలినాల్ని తొలిగిస్తుంది. చర్మాన్ని, జుట్టును కాపాడుతుంది. అందుకే దీన్ని వీలైనంత ఎక్కువగా తీసుకోవాలి. దీని రసం రాస్తే మొటిమలు, మచ్చలు, ర్యాషెస్ ఏవైనా తగ్గిపోతాయి. తలకు నిమ్మకాయను రుద్దితే చుండ్రు తొలిగిపోతుంది. జుట్టు బలంగా అయ్యి మెరుస్తుంది.

## పిల్లలు జబ్బుపడ్డారా?



- పిల్లలు అనారోగ్యం బారినపడినప్పుడు చాలా అసౌకర్యంగా ఫీలవుతుంటారు. మామూలు రోజుల్లో కంటే ఎక్కువ సమయం వారిని పడుకోనివ్వాలి. కొంచెం ఎక్కువ సమయం టీవీ చూడడానికి వారికి అవకాశం కల్పించాలి.
- అనారోగ్యంతో ఉన్న పిల్లలకు స్పెషల్ డైట్ అవసరం. డాక్టర్ సలహా ప్రకారం ప్రత్యేక ఆహారాలను తయారు చేసి సమయానికి ఇవ్వాలి. ముఖ్యంగా జబ్బు చేసిన సమయాల్లో త్వరగా జీర్ణమయ్యే ఆహారం ఇవ్వాలి.
- మామూలుగానే మెడిసిన్స్ తీసుకోవడానికి పిల్లలు ఇష్టపడరు. ఇక జబ్బు చేసినప్పుడు మెడిసిన్స్ వాసన కూడా చూడరు. కాబట్టి వాళ్లకు తెలియకుండా ఆహారంలో గానీ, పాలల్లో గానీ కలిపి మెడిసిన్ అందేలా జాగ్రత్తపడాలి.
- చాలా మంది తల్లిదండ్రులు స్కూల్ వర్క్ మిస్ అవుతుందని ఫీలవుతారు. దీంతో హెల్త్ బాగాలేకపోయినా రాసుకొమ్మని ఒత్తిడి చేస్తారు. ఇది పిల్లల మూడ్‌ని మరింత ఇబ్బంది పెడుతుంది. కాబట్టి వాళ్లకు కాస్త రెస్ట్ తీసుకోవడానికి సమయం ఇవ్వాలి.
- పిల్లలు అనారోగ్యంగా ఉన్నప్పుడు ముఖ్యంగా వారికి పరిశుభ్రత అవసరం. వారి ఒంటి మీది బట్టలు, నిద్రించే సమయంలో వాడిన దుప్పట్లు ఏ రోజుకారోజు ఉతకాలి. ముఖ్యంగా తల్లిదండ్రులు హగ్, కిస్ ఇవ్వడం వల్ల పిల్లలు కొంత రిలాక్స్ అవుతారు.


## దేశాలు చుట్టి.. గిన్నిస్ రికార్డు కొట్టి..!




**ఒక చోటుకు వెళితే రెండు, మూడు ప్రదేశాలు చూడగానే ఇక చాల్లే అనిపిస్తుంది కొందరికి. కానీ ఈ అమ్మాయి కాళ్ల కి చక్రాలు కట్టుకున్నట్లు తిరుగుతున్నది. ప్రపంచ దేశాలను చుట్టి.. ఇప్పుడు రికార్డు కూడా తన పేరున నమోదు చేసుకున్నది.**

ప్రపంచంలో ఉన్న దేశాలన్నీ చుట్టి రావాలనే సంకల్పం ఉంటే వయసుతో పని లేదు. అన్ని బాధ్యతలూ తీరాక ఎవరైనా చుట్టి వద్దాంలే అనుకుంటారు కొందరు. కానీ, 21 యేండ్ల ఈ యువతి భూమ్మీద ఉన్న అన్ని దేశాలూ తిరిగి రికార్డు బ్రేక్ చేసింది. ఆమె రికార్డు కోసం ఇవన్నీ చుట్టెయ్యలేదు. ఆమె పేరు లెక్స్ ఆల్ఫోర్డ్. ఇటీవలే మే 31న నార్త్ కొరియా దేశాన్ని చుట్టేసింది. ఇంతకు ముందు 24 యేండ్ల జేమ్స్ యాస్క్విత్ అన్ని దేశాలూ చుట్టినట్టు గిన్నిస్ రికార్డుకెక్కాడు. అతని కంటే చిన్న వయసు గల ఆల్ఫోర్డ్ గిన్నిస్ అతని రికార్డుని బ్రేక్ చేసింది. మొత్తం 196 దేశాలు చుట్టింది. ఆల్ఫోర్డ్ తల్లిదండ్రులకు సొంత ప్రయాణ సంస్థ ఉంది. చిన్నప్పట్నుంచి కొత్త ప్రదేశాలకు వెళ్లడమంటే ఆమెకు ఇష్టం. ప్రజల అలవాట్లు, అభిరుచులు ఒక్కో దేశంలో ఒకలా ఉంటాయి. అలాంటి వారిని చూసి కొత్త విషయాలు తెలుసుకోవాలన్న ఆసక్తి ఆమెకు ఎక్కువగా ఉంది. అదే దేశాలన్ని తిరిగేలా చేసింది. కంబోడియా నుంచి ఈజిప్ట్ వరకు అన్నీ చుట్టేసింది. 'ట్రావెలింగ్‌ని చాలెంజ్‌గా తీసుకున్నాను. ఇంటర్‌మీడియట్ అయ్యాక ఈ ఐడియా వచ్చింది. ఈ ప్రయాణం అంత చౌకతో కూడుకున్నది కాదు. సొంత ఖర్చులు పెట్టుకున్నాను. ఒక్కో దేశం అనుభవాలను ఎప్పటికప్పుడు ఇన్‌స్టాగ్రామ్‌లో పోస్ట్ చేశాను. త్వరలోనే ప్రసారం కాబోతున్న ఒక ట్రావెల్ షోతో' నేను హోస్ట్‌గా కూడా వ్యవహరించబోతున్నా' అంటున్నది ఆల్ఫోర్డ్.

II.
నమస్తే తెలంగాణ
నిధి
[ కరీంనగర్ ]
శనివారం 8 జూన్ 2019



# జీతం పెరిగిందా?

## అదనపు డబ్బును అర్థవంతంగా వాడుకోండి!

**జీతం పెరిగినప్పుడు చేతికి అందే అదనపు డబ్బును అనేక రకాల ఆర్థిక అవసరాలకు వాడుకోవచ్చు. అయితే చిన్నచిన్న అవసరాలకు దానిని వాడకపోతేనే మేలు..**

జీతాల పెంపు కోసం పనితీరు మదింపు జరిగే కాలం ఇది..! తాజాగా జరిగిన పనితీరు మదింపులో మీకు జీతం పెరిగిందా?... అభినందనలు! పెరిగిన జీతం డబ్బును ఎలా సద్వినియోగం చేసుకోవాలని మీరు ఆలోచిస్తూ ఉండవచ్చు. ఆ డబ్బుతో ఏదైనా విహార యాత్ర ప్లాన్ చేస్తున్నారా? ఎక్కడికైనా వెళ్లాలని టిక్కెట్లు బుక్ చేసుకుంటున్నారా? అయితే ఒక్క క్షణం ఆగండి! ఆ డబ్బుతో అంతకన్నా ముఖ్యమైన అవసరాలు తీర్చుకునే అవకాశం ఉందా? అనేది ఆలోచించండి .సరిగ్గా ఆలోచిస్తే ఎన్నో రకాలుగా ఆ డబ్బును మీరు సద్వినియోగం చేసుకోవచ్చు. ఇదిగో దానికి ఇక్కడ కొన్ని సలహాలు.



### 1 రుణభారం తగ్గించుకోండి

మీరు ఇప్పటికే ఏదైనా అప్పు చేసి ఉండవచ్చు. దానిని తిరిగి చెల్లించడం మీకు తలకు మించిన భారం కావచ్చు. అలాంటి అప్పు భారాన్ని తగ్గించుకోవడానికి మంచి మార్గం – పెరిగిన మీ జీతంలో మరికొంత మొత్తాన్ని అప్పు తీర్చడానికి వెచ్చించడం. ఎక్కువ వడ్డీ భారం ఉండే అప్పుతో ఎప్పటికైనా చిక్కులే. అలా చూస్తుండగానే ఆ భారం అలా అలా పెరిగిపోతుంది. ముఖ్యంగా క్రెడిట్ కార్డులు, వ్యక్తిగత రుణాలపై ఎక్కువ వడ్డీ ఉంటుంది. అందుకని ఇలాంటి అప్పులు ఏమైనా ఉంటే వాటిని వీలయినంతవరకు తీర్చేయడానికి ప్రయత్నం చేయండి. పెరిగిన జీతాన్ని దానికోసం ఖర్చుచేయండి. అదొక మంచి వ్యూహం.

### 2 అత్యవసర నిధిని ఏర్పాటు చేసుకోండి

ఆపదలు, అత్యవసరాలు మనకు చెప్పిరావు. అనుకోకుండా వస్తాయి. అకస్మాత్తుగా ఉద్యోగం మానేయడం లేదా కుటుంబ స్థాయిలో ఇంకేదైనా అత్యవసర పరిస్థితి రావచ్చు. ఇలాంటివి జీవితంలో ఊహించని మార్పులు తెస్తాయి. వాటివల్ల అప్పటివరకు చేసుకున్న పొదుపు మీద. ముందుగా దెబ్బ పడుతుంది. అత్యవసర నిధి ఉంటే ఇలాంటి పరిస్థితుల నుంచి గట్టెక్కవచ్చు. మీ పొదుపు, మదుపు మొత్తాలను కాపాడుకోవడానికి ఆపత్కాలంలో ఆదుకునే అత్యవసర నిధి చాలా అవసరం. ఇప్పటివరకు మీకు అత్యవసర నిధి లేకపోతే, పెరిగిన జీతం డబ్బులతో అలాంటి నిధి ఏర్పాటుచేసుకోండి. మీ నెలవారీ ఖర్చులను లెక్కలోకి తీసుకుని, దానికి కనీసం 3-6 రెట్లకు సమానంగా ఈ అత్యవసర నిధి ఉండేలా చూసుకోండి. అవసరమున్నప్పుడు వెంటనే తీసుకోవడానికి వీలుగా దీనిని మీ సేవింగ్స్ ఖాతాలోనే జమ చేయండి. అదే మొత్తంతో ఫిక్స్‌డ్ డిపాజిట్ కూడా చేయవచ్చు. దానిమీద కొంత రిటర్న్ ఎక్కువ ఉంటుంది.ఏదైనా అత్యవసర పరిస్థితి వచ్చినప్పుడు అందులో నుంచి కొంత మొత్తాన్ని విత్ డ్రా చేసుకోవచ్చు. ఇలా మధ్యలో తీసుకున్నా, దానిమీద వచ్చే వడ్డీలో కేవలం 1% మాత్రమే కోత ఉంటుంది.

### 3 ఆరోగ్య బీమా, జీవిత బీమా పాలసీలు తీసుకోండి

మాకెందుకు బీమా అనుకోకండి. ఏదైనా అనుకోనిది జరిగితే పరిస్థితి ఎలా ఉంటుందో మళ్లీ ఒకసారి ఆలోచించండి. ఏదైనా కారణం వల్ల ఉద్యోగం చేయలేకపోతే ఇంట్లో ఇబ్బందులు ఎలా ఉంటాయో ఊహించండి. ఇంటి ఖర్చులు ఎలా వస్తాయి? మీ ఇంట్లో వాళ్ల అవసరాలు ఎలా తీరుస్తారు? ఇలాంటి పరిస్థితులలోనే బీమా అవసరం తెలుస్తుంది. అనుకోనిది జరిగినప్పుడు మనల్ని మరింత రిస్కులోకి పడిపోకుండా కాపాడుతుంది బీమా. బతుకుకు కొంత ధీమా ఇస్తుంది. ఇప్పటికీ మీరు సమగ్రమైన ఆరోగ్య బీమా కానీ లేదా జీవిత బీమా పాలసీ కానీ తీసుకోలేకపోతే, వెంటనే వాటిని తీసుకోండి. పెరిగిన జీతం డబ్బులను దానికి వాడుకోండి. జీవితానికైనా, ఆరోగ్యానికైనా సరిపడా కవరేజి ఉండేలా బీమా చేయించాలి. మీ సంక్షేమం, మీ కుటుంబ సభ్యుల సంక్షేమం, మీ ఆర్థిక భవిష్యత్ కొంత సురక్షితంగా ఉండాలంటే ఇది తప్పనిసరి. బీమా పాలసీలు తీసుకుంటే ఆదాయ పన్ను భారం కూడా తగ్గించుకోవచ్చు. రెండు రకాలుగా లాభం!..

### 4 నైపుణ్యాలు పెంచుకోండి

మీరు చదువుకున్నారు. విద్యార్హతలు ఉన్నాయి. ఉద్యోగం కూడా ఉంది. అయితే అక్కడితోనే ఆగకండి. మీ కెరీర్‌లో మీరు ఇంకా ఎత్తుకు ఎదగాలంటే, మీ నైపుణ్యాలు పెంచుకోవాలి. పెరిగిన జీతం డబ్బులలో కొంత మొత్తాన్ని దానికోసం వినియోగించండి. కెరీర్ ఎదుగుదలకు తోడ్పడే ప్రొఫెషనల్ కోర్సు లేదా సర్టిఫికేషన్ ప్రోగ్రాంలో చేరండి. కొత్త విషయాలు, కొత్త నైపుణ్యాలు నేర్చుకోండి. దీనివల్ల మీ తోటి ఉద్యోగులకన్నా మీరు ఒకింత ముందుంటారు. ఇంకా మంచి అవకాశాలు అందుకుంటారు. మంచి వేతనంతో కూడిన ప్రమోషన్లు అందుకోవచ్చు లేదా ఇంకా ఆకర్షణీయమైన ఉద్యోగావకాశాలు అందిపుచ్చుకోవచ్చు. ఏదైనా అదనపు డిగ్రీ, డిప్లొమా,. సర్టిఫికెట్ ఉంటే కంపెనీలో ఇంకా పై స్థాయికి చేరుకునే అవకాశం ఉంటుంది. నైపుణ్యాలు పెంచుకోవడానికి ఇన్వెస్ట్ చేయండి. అది మీకు మంచి రిటర్నులు, డివిడెండ్లు ఇస్తుంది.

### 5 మదుపు పెట్టుబడిని పెంచండి

సంపద పెరగాలంటే మదుపు తప్పనిసరి. అందుకని పెరిగిన జీతంలో కొంత మొత్తాన్ని మదుపు పెట్టుబడిలోకి మళ్లించండి. ఎక్కడ మదుపు చేయాలనేది నిర్ణయించుకునే ముందే మీ ఆర్థిక లక్ష్యాలపై స్పష్టత తెచ్చుకోండి. వాటికి అనుగుణంగా మదుపు వ్యూహాలు పాటించండి. ఇలా మదుపు చేసే ప్రతి వనరులోనూ ఎంత రిస్కు ఉంది, ఎంత రిటర్ను వస్తుంది, ఆదాయ పన్ను విషయంలో ఎంతవరకు లాభపడొచ్చు అనే విషయాలపై అవగాహన పెంచుకోండి. అందుబాటులో ఉన్న మదుపు వనరులను పరిశీలించండి. ఏదీ వదలకండి. అన్నింటిని పరిశీలించిన తరువాతనే, మీకు ఏది అనువుగా ఉంటే ఆ మదుపు వనరులో పెట్టుబడి పెట్టండి.



ఇలా మదుపు చేయడానికి అనేక రకాల వనరులున్నాయి – ఫిక్స్‌డ్ డిపాజిట్లు, రికరింగ్ డిపాజిట్లు, పబ్లిక్ ప్రావిడెంట్ ఫండ్, మ్యూచువల్‌ఫండ్ల ద్వారా క్రమానుగత మదుపు ప్రణాళిక (సిప్) లేదా సెక్షన్ 80 సి కింద ఆదాయ పన్ను రాయితీ పొందడానికి వీలున్న ఈక్విటీ లింక్‌డ్ సేవింగ్స్ స్కీమ్స్, జాతీయ పెన్షన్ పథకం వంటి వాటిలో మదుపు చేయవచ్చు.

అన్నింటికన్నా ముందుగా – మీ ఆర్థిక లక్ష్యాలు స్పష్టంగా నిర్ణయించుకోవడం చాలా ముఖ్యం. ఉదాహరణకు రానున్న మూడేళ్లలో స్వంత ఇంటిని కొనడానికి ముందస్తుగా చెల్లించాల్సిన మొత్తం కోసం అవసరమైన డబ్బు జమ చేసుకోవడం అనే దాన్ని మీరు ఒక లక్ష్యంగా ఎంచుకోవచ్చు. అప్పుడు ఆ నిర్దిష్ట కాలంలో అనుకున్న డబ్బు జమ అయ్యేలా మీరు మదుపు చేయడం మొదలుపెట్టాలి. ఒక పద్ధతి అంటూ లేకుండా చేసే మదుపు ఒక్కోసారి లేనిపోని చిక్కులు తెచ్చిపెడుతుంది. ఒకింత అయోమయానికి గురిచేస్తుంది. ఇక మరో విషయం – మదుపు చేయడానికి ఏడాది చివరిదాకా ఆగకండి. ఏడాది పొడవునా మదుపు చేసే పద్ధతి అలవాటు చేసుకోండి.

### 6 ఇప్పుడిక మీరనుకున్నట్టు ఎంజాయ్ చేయండి

మీరు అప్పటికే జీవితంలో చాలా కష్టపడి ఉండవచ్చు. ఆ ఏడాది ఇంకా కష్టపడి ఉండొచ్చు. దానివల్లనే కదా మీకు జీతం పెరిగింది. కాబట్టి ఆ పెరిగిన జీతంలో కొంత మొత్తాన్ని మీరనుకున్నట్టు ఎంజాయ్ చేయడానికి వాడుకోండి. అయితే, ముందుగా పైన చెప్పిన ఆర్థిక సూత్రాలలో కనీసం కొన్నింటినైనా పాటించిన తరువాత మిగిలిన డబ్బుతో మాత్రమే ఎంజాయ్ చేయండి.


జీతం పెరిగినప్పుడు చేతికి అందే అదనపు ఆదాయంతో మీ భవిష్యత్ ఇంకా బాగుండడానికి తోడ్పడే తెలివైన నిర్ణయాలు తీసుకోండి. మీ ఆర్థిక పునాదులను మరింత పటిష్టం చేసుకోవడానికి ప్రయత్నించండి. పనికిరాని వాటికోసం ఆ డబ్బును వెచ్చించకండి. ప్రతి ఏడాది మీ జీతం పెరగకపోవచ్చన్న విషయం గుర్తుంచుకోండి. అందుకని జీతం పెరిగినప్పుడే ఆ అదనపు డబ్బును సద్వినియోగం చేసుకునే రీతిలో ఆలోచించండి.. అవును నిజమే మరి, 'దీపం ఉండగానే ఇల్లు చక్కబెట్టుకోవాలి'!... ఆ విషయం మర్చిపోకండి.

అదిల్ శెట్టి
సీఈవో,బ్యాంక్ బజార్.కామ్



# మీ వేతన ఖాతాను క్లోజ్ చేయాల్సిందేనా?

**బ్యాంకులో మామూలుగా మనం తెరిచే పొదుపు ఖాతాలతో పోలిస్తే వేతన ఖాతాలతో ఎక్కువ ప్రయోజనాలు ఉంటాయి. అన్నింటికన్నా ముఖ్యమైన అంశం – వీటిలో కనీస సగటు బ్యాలన్స్ నిర్వహించాల్సిన అవసరంలేదు. అయితే వేతన ఖాతాలతో వచ్చే అదనపు ప్రయోజనాలు అన్నీ అది వేతన ఖాతాగా ఉన్నంతవరకే. ఒకవేళ ఎవరైనా తమ ఉద్యోగాన్ని వదలివేస్తే అప్పుడు బ్యాంకులు ఈ వేతన ఖాతాను మామూలు పొదుపు ఖాతాగా మార్చేస్తాయి. ఇలా వేతన ఖాతా పొదుపు ఖాతాగా మారినప్పుడు దానికి పొదుపు ఖాతాలకు వర్తించే షరతులు అన్నీ వర్తిస్తాయి. అంటే చార్జీల షెడ్యూల్‌తో పాటు కనీస సగటు బ్యాలన్స్ నిర్వహించడం వంటి నిబంధనలు అన్నీ పాటించాల్సి ఉంటుంది.**




ఉద్యోగం మారినప్పుడు లేదా మానివేసినప్పుడు దానికి సంబంధించిన వేతన ఖాతాను క్లోజ్ చేయడం మంచిదే. అయితే కొన్ని సందర్భాలలో వేతన ఖాతాను కొనసాగించాలా లేక దాన్ని పొదుపు ఖాతాగా మార్చుకోవాలా అనే సందిగ్ధత వస్తుంది. ఇలాంటి పరిస్థితులలో తగిన నిర్ణయం తీసుకోవడానికి ముఖ్యంగా ఐదు అంశాలను పరిగణనలోకి తీసుకోవచ్చు. వాటిని ఇప్పుడు తెలుసుకుందాం.

### కొత్తగా చేరే ఉద్యోగానికి వేతన ఖాతా

మీరు కొత్త ఉద్యోగంలో చేరినప్పుడు, మీ కొత్త కంపెనీ యాజమాన్యానికి, మీ వేతన ఖాతా ఉన్న బ్యాంకుకు మధ్య కూడా ఇలాంటి వేతన ఖాతాలు నిర్వహించే ఒప్పందం ఏమైనా ఉందా అనేది చూడండి. ఒకవేళ అలాంటి ఒప్పందం ఉంటే, అదే బ్యాంకులో మీ వేతన ఖాతాను అలాగే కొనసాగించండి. అలాంటప్పుడు మీకున్న ఖాతాను క్లోజ్ చేయాల్సిన అవసరం లేదు. కొత్తగా వేతన ఖాతా తెరవాల్సిన అవసరం లేదు. మీకు ఆ బ్యాంకులో వేతన ఖాతా ఉన్న విషయాన్ని మీ కొత్త యాజమాన్యానికి తెలియచేసి, ఖాతా వివరాలు అందించండి.

### అదనపు పొదుపు ఖాతా

మీ కొత్త యాజమాన్యం మీకు వేతనాలు వేసే బ్యాంకు వేరే అయినప్పుడు, అదనంగా మరో పొదుపు ఖాతా కొనసాగించడం అవసరమా అనేది ఆలోచించుకోండి. దానివల్ల మీకు ఏమైనా అదనపు ప్రయోజనాలు ఉన్నాయా అనేది చూసుకోండి. ఒకవేళ అప్పటివరకు మీరు నిర్వహించిన వేతన ఖాతా మీకు తొలి బ్యాంకు ఖాతా అయితే, దానిని మీరు మీ ప్రాథమిక పొదుపు ఖాతాగా కొనసాగించుకోవచ్చు. ఆ ఖాతా ద్వారా మీరు పొందే ప్రయోజనాలు, సర్వీసు ఛార్జీలు వంటి విషయాలు పరిశీలించుకుని, అవి మీకు అనువుగా ఉంటే ఆ నిర్ణయం తీసుకోవచ్చు.

కొత్త యాజమాన్యం కోసం తీసుకునే వేతన ఖాతా కూడా మామూలు పొదుపు ఖాతాగా పనిచేస్తుంది. అయితే మీరు చేసే ఇన్వెస్ట్‌మెంట్లు లేదా మీకు ఇతర్రతా మార్గాల నుంచి వచ్చే ఆదాయం ఏదైనా ఉంటే వాటి నిర్వహణకు అదనపు పొదుపు ఖాతా నిర్వహించుకోవచ్చు. ఉదాహరణకు మీరు అప్పటికే మీ ఖాతా నుంచి ఏవైనా మ్యూచువల్ ఫండ్లలో పెట్టుబడులు పెడుతూ ఉండవచ్చు లేదా రుణ వాయిదాలు చెల్లిస్తూ ఉండవచ్చు లేదా బీమా ప్రీమియం వంటివి చెల్లిస్తూ ఉండవచ్చు. కొత్త యాజమాన్యం కోసం కొత్తగా తీసుకునే వేతన ఖాతా నుంచే ఇలాంటివి కొనసాగించాలంటే, వాటన్నింటిలోనే మీరు మీ బ్యాంకు వివరాలు మార్చాల్సి ఉంటుంది. ఉద్యోగం మారిన ప్రతిసారి ఇలా చేయాలంటే చాలా కష్టం. ఇలాంటప్పుడు మీ తొలి వేతనఖాతాను ప్రాథమిక ఖాతాగా నిర్వహించుకుంటే ఆ ఇబ్బందులన్నీ తీరుతాయి.

### కనీస సగటు బ్యాలెన్స్ నిల్వ

ఇప్పుడు చాలామట్టుకు పొదుపు ఖాతాలలో ఖాతాదారులు కనీస సగటు బ్యాలన్స్ మొత్తాలను నిర్వహించడం తప్పనిసరైంది. ఖాతాలో సగటు బ్యాలన్స్ నిర్వహించకపోతే 'బ్యాలన్స్ నాన్ మెయింటెనెన్స్ ఛార్జీల' పేరిట భారీమొత్తంలో జరిమానాలు పడే అవకాశం ఉంది. అదికాకుండా అప్పటివరకు ఉచితంగా జరుపుకునే లావాదేవీలు, ఉచితంగా అందుబాటులో ఉండే సేవలపై కూడా ఛార్జీలు విధించవచ్చు. వేతనఖాతాకు తోడుగా మీరు అదనంగా పొదుపు ఖాతా నిర్వహించాలనుకుంటే, ఇలాంటి ఛార్జీలు,జరిమానాల విషయాన్ని గుర్తుంచుకోవాలి. పొదుపు ఖాతాలో కనీస సగటు బ్యాలెన్స్ నిర్వహించగలరా లేదా అనేది చూసుకున్న తరువాతనే తగిన నిర్ణయం తీసుకోండి.

### లావాదేవీల ఛార్జీలు

బ్యాంకులో ఖాతాలు తెరిచేటప్పుడు చాలామట్టుకు ఖాతాదారులు 'ఛార్జీల షెడ్యూల్' విషయం మర్చిపోతారు. బ్యాంకులో మనం జరిపే కొన్ని రకాల లావాదేవీలపై అప్పటికప్పుడు విధించే ఛార్జీలు ఉంటాయి. మరికొన్ని లావాదేవీలు నిర్ధిష్టపరిమితి దాటిన తరువాత ఛార్జీల పరిధిలోకి వస్తాయి. ఆ పరిమితి దాటాక ఆ లావాదేవీలపై ఛార్జీలు ఉంటాయి. ఎక్కువ మొత్తంలో కనీస సగటు బ్యాలెన్స్ మొత్తాన్ని నిర్వహించాలనే నిబంధన ఉన్న ఖాతాలలో లావాదేవీలపై ఛార్జీలు, నిర్దిష్ట పరిమితుల మేరకు ఉచిత లావాదేవీలు అనేవి పూర్తిగా ఎత్తివేస్తారు.

### డెబిట్ కార్డు ఆఫర్లు

క్రెడిట్ కార్డుల మాదిరిగానే బ్యాంకులు తమ ఖాతాదారులకు విభిన్న అవసరాల కోసం విభిన్న రకాల డెబిట్ కార్డులు ఆఫర్ చేస్తాయి. కొన్ని డెబిట్ కార్డులు సినిమాలు, హోటల్స్ వంటి వాటికి డిస్కౌంటులు ఇస్తాయి. మరికొన్ని కార్డులు ఎంపికచేసిన లావాదేవీలపై నిర్దిష్ట స్థాయిలో నగదు బదిలీ ఆఫర్ చేస్తాయి. మరికొన్ని కార్డులు ట్రావెల్, పెట్రోల్, వినిమయ వస్తువు కొనుగోలు వంటివాటికి డిస్కౌంటు ప్రకటిస్తాయి. మీ వేతన ఖాతా నుంచి మీకు అందే డెబిట్ కార్డు మీ కొనుగోలు అవసరాలు, మీరు ఖర్చు పెట్టే తీరుకు అనువుగా ఉంటే, ఆ ఖాతానే మీరు రెగ్యులర్ ప్రీమియం సేవింగ్స్ ఖాతాగా మార్చుకుని దానినే కొనసాగించవచ్చు.

ఇప్పుడు చాలావరకు బ్యాంకు సేవలు ఇంటర్ నెట్ బ్యాంకింగ్ లేదా మొబైల్ యాప్‌ల ద్వారానే జరుగుతున్నాయి. అయితే నగదు డిపాజిట్లు, నగదు ఉపసంహరణ వంటి సేవల కోసం ఖచ్చితంగా బ్యాంకు బ్రాంచి లేదా బ్యాంకు ఎ.టి.ఎం.ల దగ్గరికి పోవాల్సివస్తుంది. ఈ మధ్య కాలంలో ఎ.టి.ఎం. సేవలపై కూడా నిర్దిష్ట పరిమితి దాటితే ఛార్జీలు విధిస్తున్నారు. వేరే బ్యాంకు ఎ.టి.ఎం. నుంచి డబ్బు విత్‌డ్రా చేసుకోవాలంటే కొన్ని లావాదేవీలకు మాత్రమే ఛార్జీలు ఉండవు. ఆ లావాదేవీల సంఖ్య దాటితే చార్జీలు పడతాయి. అందుకని, మీ ఇంటి దగ్గర లేదా ఆఫీసు దగ్గర ఉండే బ్యాంకులో మీ ఖాతా ఉండేలా చూసుకోండి. లేకపోతే మీ ఇంటికి లేదా ఆఫీసుకు దగ్గరలో ఏ బ్యాంకు ఉందో చూసుకుని దాంట్లోకి మీ ఖాతా బదిలీ చేసుకోండి.

సహిల్ అరోరా
బిజినెస్ హెడ్,
పేమెంట్ ప్రొడక్ట్స్
పైసాబజార్.కామ్



### గృహ రుణాలపై వడ్డీరేట్ల వివరాలు(శాతంలో)

| బ్యాంకు పేరు | రూ.30 లక్షల లోపు | రూ.30-70 లక్షల వరకు | 70 లక్షల పైన | అమలులోకి వచ్చిన తేది |
|---|---|---|---|---|
| **ఫ్లోటింగ్ వడ్డీ రేట్లు** | | | | |
| Allahabad Bank | 8.65- 9.65 | 8.65- 9.65 | 8.7- 9.65 | 01-Apr-19 |
| Andhra Bank | 8.8- 8.85 | 8.8- 8.85 | 8.8- 8.95 | 15-May-19 |
| Axis Bank | 8.9-8.95 | 8.9- 9.1 | 9.05- 9.15 | 18-Apr-19 |
| Bank of Baroda | 8.7-9.7 | 8.7-9.7 | 8.7-9.7 | 07-Jun-19 |
| Bank of India | 8.8- 9.7 | 8.8- 9.7 | 8.8- 9.7 | 10-May-19 |
| Bank of Maharashtra | 8.7- 9.2 | 8.7- 9.2 | 8.7- 9.45 | 07-May-19 |
| Canara Bank | 8.7- 8.75 | 8.7- 8.9 | 8.8- 8.95 | 07-May-19 |
| Central Bank | 8.55 | 8.55 | 8.55 | 01-Jun-19 |
| Corporation Bank | 8.6-9 | 8.6-9 | 8.6-9.25 | 15-Mar-19 |
| Federal Bank | 8.75-9.15 | 8.75-9.15 | 8.75-9.15 | 16-May-19 |
| HDFC Bank | 8.6- 9.3 | 8.6- 9.55 | 8.85 9.6 | 01-Jun-19 |
| ICICI Bank | 8.8 - 9.1 | 8.8 - 9.2 | 9.15- 9.25 | 01-Jun-19 |
| Indian Bank | 8.75- 8.85 | 8.75- 8.95 | 8.85- 9.1 | 07-May-19 |
| IOB | 8.65 | 8.65- 8.75 | 8.75-8.9 | 10-Apr-19 |
| IDBI Bank | 8.75- 8.85 | 8.75- 9 | 8.9- 9.15 | 12-May-19 |
| J&K Bank | 8.75- 8.85 | 8.75- 8.85 | 8.75- 9.15 | 10-May-19 |
| Karnataka Bank | 8.9- 9.05 | 8.9- 9.05 | 8.9- 9.75 | 01-May-19 |
| Karur Vysya Bank | 8.9- 11.65 | 8.9- 11.65 | 8.9- 11.65 | NA |
| Punjab National Bank | 8.65-8.7 | 8.65-8.7 | 8.65-8.75 | 01-Jun-19 |
| Punjab & Sind Bank | 8.75 | 8.75 | 8.75- 9 | 16-May-19 |
| State Bank of India | 8.55- 8.85 | 8.55- 9.1 | 8.55-9.25 | 10-May-19 |
| South Indian Bank | 9.1-9.5 | 9.1-9.5 | 9.1-9.5 | 20-May-19 |
| Syndicate Bank | 8.65 | 8.65 | 8.65 | 15-May-19 |
| Tamilnad Mercantile Bank | 9.2 | 9.2 | 9.2 | Oct-18 |
| UCO Bank | 8.65 | 8.65- 8.75 | 8.75- 8.9 | 10-Apr-19 |
| Union Bank of India | 8.7- 8.8 | 8.7- 8.8 | 8.7- 8.85 | 01-Jun-19 |
| United Bank of India | 8.6 | 8.6 | 8.6 | 18-Apr-19 |
| **ఫిక్స్‌డ్ వడ్డీ రేట్లు** | | | | |
| Axis Bank | 12 | 12 | 12 | NA |
| Corporation Bank | 12.05- 12.55 | 12.55 | 12.55 | 15-Jan-19 |
| HDFC Bank | 9.4- 10.10 | 9.4- 10.25 | 9.55- 10.3 | 01-Jun-19 |
| IDBI bank | 10.25-10.5 | 10.25-10.5 | 10.25-10.5 | 12-Mar-19 |
| Punjab National Bank | 9.15- 9.2 | 9.15- 9.2 | 9.15- 9.25 | NA |
| Union Bank of India | 11.4 | 12.4-12.65 | 12.65 | 01-Dec-18 |
| **హౌజింగ్ ఫైనాన్స్ కంపెనీలు** | | | | |
| **ఫ్లోటింగ్ వడ్డీ రేట్లు** | | | | |
| Dewan Housing | >=9.75 | >=9.75 | >=9.75 | NA |
| Tata Capital | 9.25- 9.35 | 9.25- 9.6 | 9.35- 9.6 | 07-Jan-19 |
| Piramal Capital & Housing Finance | >=9 | >=9 | >=9 | NA |
| PNB Housing | 9.05- 12.5 | 9.05- 12.5 | 9.1- 12.5 | NA |
| Central Bank Housing | 10.1- 11.3 | 10.1- 11.8 | 10.1- 11.8 | 01-Dec-18 |
| HDFC Ltd | 8.6- 9.25 | 8.6- 9.55 | 8.85- 9.6 | NA |
| Indiabulls Housing Finance Ltd | 8.8- 12 | 8.8- 12 | 8.8- 12 | NA |

## సుడోకు

డైలీ సుడోకు 56 సమాధానం

| | | | | | | | | |
|---|---|---|---|---|---|---|---|---|
| 3 | 4 | 5 | 7 | 8 | 6 | 9 | 1 | 2 |
| 2 | 6 | 1 | 3 | 9 | 5 | 8 | 7 | 4 |
| 7 | 8 | 9 | 4 | 2 | 1 | 3 | 5 | 6 |
| 9 | 1 | 6 | 2 | 3 | 7 | 4 | 8 | 5 |
| 4 | 5 | 3 | 9 | 6 | 8 | 1 | 2 | 7 |
| 8 | 7 | 2 | 1 | 5 | 4 | 6 | 3 | 9 |
| 5 | 2 | 4 | 8 | 1 | 9 | 7 | 6 | 3 |
| 1 | 3 | 7 | 6 | 4 | 2 | 5 | 9 | 8 |
| 6 | 9 | 8 | 5 | 7 | 3 | 2 | 4 | 1 |

1. నిలువుగా, అడ్డంగా ప్రతివరుసలోనూ 1 నుంచి 9 వరకు అంకెలను నింపాలి.
2. ఒకసారి రాసిన అంకెను మరోసారి నింపకూడదు.
3. ప్రతి గడిలోనూ నింపిన అంకెను మళ్లీ నింపకూడదు.

సమాధానం రేపటి సంచికలో

డైలీ సుడోకు -57

| | | | | | | | | |
|---|---|---|---|---|---|---|---|---|
| 7 | | | | 1 | | | | 6 |
| | | 2 | 5 | | 4 | | | |
| | | 4 | | 9 | | | | |
| 2 | | | | | 5 | 8 | | 3 |
| | 5 | | 2 | | 6 | | 7 | |
| 1 | | 7 | 9 | | | | | 2 |
| | | | | 8 | | 3 | | |
| | | | 3 | | 1 | 9 | | |
| 4 | | | | 2 | | | | 8 |

నమస్తే తెలంగాణ
# సంపద
[ కరీంనగర్ ]
శనివారం 8 జూన్ 2019

**ఆరు నెలలుగా దేశీయ రియల్ మార్కెట్లో సానుకూలత నెలకొనడం.. 2019 జనవరి నుంచి మార్చి వరకూ దేశవ్యాప్తంగా 28 శాతం అమ్మకాలు పెరగడం.. వంటి అంశాలతో యావత్ రియల్ రంగం ఊపిరి పీల్చుకుంది. ఈ నేపథ్యంలో ఆర్‌బీఐ తాజా నిర్ణయం నిర్మాణ రంగంలో సరికొత్త ఉత్సాహం నెలకొన్నది. మరి, రెపో రేటు తగ్గడం వల్ల గృహరుణంపై నెలసరి వాయిదాలు ఎంతమేరకు తగ్గుతాయి? కొత్తగా ఇల్లు కొనేవారికీ తగ్గే గృహరుణ భారమెంత? ఇప్పటికే స్థిర నివాసాన్ని ఏర్పాటు చేసుకున్నవారిపై ఎలాంటి ప్రభావం పడుతుంది?**



# గృహరుణ భారం తగ్గేదెంత?

**2018–19** చివరి త్రైమాసికంలో భారత ఆర్థిక వృద్ధి గత ఇరవై త్రైమాసికాల కంటే తక్కువగా, 5.8 శాతం నమోదైంది. ఫలితంగా, ద్రవ్య వినియోగం కూడా గణనీయంగా తగ్గింది. నగదు కొరత పెరగడమే ఇందుకో ప్రధాన కారణం. ఈ నేపథ్యంలో, ఆర్థిక వృద్ధిని పెంపొందించేందుకు ఆర్‌బీఐ రెపో రేటును ఆరు శాతం నుంచి 5.75 శాతానికి తీసుకొచ్చింది. దీని వల్ల గృహరుణాలపై వడ్డీ రేట్లు తగ్గుముఖం పట్టే అవకాశమున్నది. కాకపోతే, గతంలో ఆర్‌బీఐ 50 బేసిస్ పాయింట్లను తగ్గించినప్పటికీ.. బ్యాంకులు వడ్డీ రేట్లను పెద్దగా తగ్గించలేదు. అందుకే, ఆశించినంత మేరకు కొనుగోలుదారులు ఇండ్లను కొనడానికి ముందుకు రాలేదు. అయితే, కేంద్రం తీసుకొచ్చిన పలు సంస్కరణల వల్ల గృహ కొనుగోలుదారుల్లో నమ్మకం ఏర్పడింది. అందుకే, 2018 చివర్లో భారత రియల్ మార్కెట్లో సానుకూలత ఏర్పడింది. ఆతర్వాతి, త్రైమాసికం వచ్చేసరికి అమ్మకాలు ఒక్కసారిగా పుంజుకున్నాయి. కాకపోతే, ఆర్‌బీఐ తీసుకున్న తాజా నిర్ణయాన్ని బ్యాంకులు గౌరవించి.. గృహరుణాలపై వడ్డీ రేట్లను తగ్గిస్తేనే ఉపయోగకరంగా ఉంటుందని రియల్ రంగ నిపుణులు అభిప్రాయపడుతున్నారు.

● దేశవ్యాప్తంగా డెవలపర్లు నగదు కొరత ఎదుర్కొంటున్నారు. ఆర్‌బీఐ నిర్ణయం కారణంగా, బిల్డర్ల నగదు సమస్య కొంత తీరే అవకాశం లేకపోలేదు. దీంతో, కొత్త ప్రాజెక్టుల్ని ప్రకటించడానికి అవకాశం ఉంటుంది. ఫలితంగా, అమ్మకాలూ గణనీయంగా పుంజుకుంటాయి. కాకపోతే, ఇతర పరిశ్రమల మాదిరిగానే.. భారత ప్రభుత్వం నిర్మాణ రంగానికి నగదు కొరత లేకుండా చేయాలి. లేకపోతే, ఈ రంగానికి పునర్వైభవం రావాలంటే మరి కొంత కాలం పట్టే ప్రమాదమున్నది.

## ఎంతమేరకు తగ్గుతుంది?

ఆర్‌బీఐ తాజా నిర్ణయం వల్ల గృహరుణం ఎంతమేరకు తగ్గుముఖం పడుతుందనే విషయాన్ని తెలుసుకోవడానికో ఉదాహరణను పరిశీలిద్దాం.

| | |
|---|---|
| రుణ మొత్తం | 30 లక్షలు |
| వ్యవధి | 20 ఏండ్లు |
| ప్రస్తుత వడ్డీ రేటు | 8.6 శాతం |
| నెలసరి ఈఎంఐ | 26,225 |
| కొత్త రేటు | 8.35 శాతం |
| కొత్త ఈఎంఐ | 25,751 |
| తగ్గింపు ఎంత? | 474 |

ఎస్‌బీఐ వెబ్‌సైటు నుంచి సేకరించిన వివరాల ప్రకారం.. ఒక వ్యక్తి రూ.30 లక్షల రుణాన్ని ఇరవై ఏండ్ల వ్యవధికి, 8.6 శాతం చొప్పున తీసుకుంటే, నెలకు రూ.26,225 కట్టాల్సి ఉంటుంది. అదే 25 బేసిస్ పాయింట్లు తగ్గితే, నెలసరి ఈఎంఐ ఇక నుంచి రూ.25,751 చెల్లించాల్సి ఉంటుంది. అంటే, నెలకు రూ.474 రుణభారం తగ్గుతుందన్నమాట. కాకపోతే, బ్యాంకులు ఎంతమేరకు వడ్డీ రేటును తగ్గిస్తాయనే విషయం అతిత్వరలో తెలుస్తుంది.



## ఇప్పటికే కొన్నవారి పరిస్థితి?

కేవలం 2019లోనే ఆర్‌బీఐ దాదాపుగా 75 బేసిస్ పాయింట్లను తగ్గించింది. దీని వల్ల, చలన వడ్డీ రేటు కింద రుణం తీసుకున్న వారి నెలసరి గృహరుణ వాయిదా ఎంతోకొంత తగ్గే ఉంటుంది. అయితే, బ్యాంకులు తమ ఎంసీఎల్‌ఆర్ (మార్జినల్ కాస్ట్ లెండింగ్ రేటు)ను తగ్గించినప్పుడే, ఈఎంఐలు తగ్గుతాయి. సాధారణంగా ప్రతి బ్యాంకు ఆరు నెలలకో, ఏడాదికో ఎంసీఎల్ఆర్ రేటును సవరిస్తుంటాయి. దీన్ని బట్టి తుది ఈఎంఐ తగ్గింపు ఆధారపడుతుంది.

## బీపీఎల్‌ఆర్ ప్రాతిపదికన రుణమా?

ఇప్పటికే మీరు బీపీఎల్‌ఆర్ ప్రాతిపదికన గృహరుణం పొంది ఉన్నారా? అయితే తక్షణమే ఎంసీఎల్‌ఆర్‌కు మారిపోవాలి. బ్యాంకింగ్ నిపుణుల ప్రకారం.. బీపీఎల్‌ఆర్ కంటే ఎంసీఎల్‌ఆర్ ప్రాతిపదికన గృహం రుణం తీసుకోవడం వల్ల మరింత పారదర్శకత ఏర్పడుతుంది. ఆర్‌బీఐ మార్గదర్శకాల ప్రకారం.. 2016 ఏప్రిల్ తర్వాత రుణం తీసుకున్నట్లయితే తప్పనిసరిగా ఎంసీఎల్‌ఆర్‌తో అనుసంధానం చేసుకోవాలి. ఇతరులు అదే బ్యాంకులోని ఎంసీఎల్‌ఆర్‌కు మారిపోవచ్చు. లేదా ఇతర బ్యాంకులకు గృహరుణాన్ని మార్చుకోవచ్చు.

## మీరేం చేయాలి?

బ్యాంకుల ప్రకారం.. గృహరుణాలపై వడ్డీ రేట్లు తగ్గుముఖం పడతాయి. కాకపోతే, ఏయే బ్యాంకులు ఎంతెంత మేరకు తగ్గిస్తాయనే విషయమే కీలకం. అందుకే, బ్యాంకులు వడ్డీ రేట్లు తగ్గించే వరకూ వేచి చూడండి. ఆతర్వాతే, కొత్త రుణాలపై నిర్ణయం తీసుకోవాలి. ఒకవేళ, ఇప్పటికే చలన వడ్డీ రేటు (ఫ్లోటింగ్) పద్ధతిలో రుణం తీసుకున్నట్లయితే.. వడ్డీ రేట్లను సవరించగానే మీరు తుది నిర్ణయం తీసుకోవచ్చు. కాకపోతే, తగ్గింపు ఎంత ఉందనే విషయాన్ని క్షుణ్నంగా పరిశీలించాకే తుది అడుగు వేయాలి.

### తగ్గింపు ఫలాలు కొనే వారికి అందాలి..



ఆర్‌బీఐ 2019 ఫిబ్రవరి, ఏప్రిల్ నెలల్లో 25 బేసిస్ పాయింట్ల చొప్పున రెపో రేటును తగ్గించింది. అయితే, కేవలం 21 బేసిస్ పాయింట్లు మాత్రమే కొనుగోలుదారులకు చేరింది. 2010 తర్వాత రెపో రేటు 5.75 శాతానికొచ్చింది. ఈ తరహా ప్రోత్సాహం కోసం ఎదురు చూస్తున్నాం. ఇలాంటి నిర్ణయాల వల్ల రియల్ రంగంలోకి పెట్టుబడుల వర్షం కురిసే అవకాశమున్నది. రానున్న రోజుల్లో భారత దేశం పది శాతం చొప్పున ఆరికాభివృద్ధి నమోదు కావాలని ఆశిస్తున్నాను. తగ్గింపు ఫలాలను బ్యాంకులు గృహ కొనుగోలుదారులకు అందించాలని విజ్ఞప్తి చేస్తున్నాను.

– జక్సే షా, ఛైర్మన్, క్రెడాయ్

### సెంటిమెంట్ పెరిగే దిశగా..



ప్రభుత్వం రెండోసారి అధికారంలోకి రావడంతో సంస్కరణల్ని మరింత ముందుగా తీసుకెళ్లడానికి అవకాశం ఉంటుంది. గృహ కొనుగోలుదారుల సెంటిమెంట్‌ను పెంపొందించే దిశగా తగు నిర్ణయాల్ని కొత్త ప్రభుత్వం తీసుకుంటున్నదనే నమ్మకముంది. ఆర్‌బీఐ నిర్ణయం మార్కెట్‌కు సరికొత్త ఊపిరినిస్తుందనే విషయంలో ఎలాంటి సందేహం లేదు. కాకపోతే, బ్యాంకులే తగ్గింపు ఫలాల్ని కొనుగోలుదారులకు అందించాలి. ఇక రానున్న రోజుల్లో మార్కెట్ అభివృద్ధి చెందుతుందే తప్ప, తగ్గే అవకాశమే లేదు. ప్రపంచంలో మారుతున్న ఆర్థిక పరిస్థితుల నేపథ్యంలో, ఆర్‌బీఐ తాజా నిర్ణయం తీసుకున్నదని భావిస్తున్నాను.

– రమేష్ నాయర్, సీఈవో, జేఎల్ఎల్ ఇండియా

### రుణభారం తగ్గేలా..



దక్షిణ భారతదేశంలో సొంతిల్లు కొన్నవారు.. ఠంచనుగా గృహరుణ వాయిదాలను చెల్లిస్తారు. కట్టకపోవడమంటూ ఉండనే ఉండదు. పైగా, అధిక శాతం మంది తమ నెలసరి జీతంలో కేవలం 50–60 శాతమే గృహరుణ వాయిదా ఉండేలా జాగ్రత్తలు పడుతుంటారు. అందుకే, మన వద్ద రుణం తీసుకుని ఎగ్గొట్టడాలు పెద్దగా కనిపించదు. ఈ నేపథ్యంలో, సొంతిల్లు కొనుక్కోవాలని ఆరాటపడేవారిని మరింత ప్రోత్సహించడానికి బ్యాంకులు ఎంతమేరకు వడ్డీ రేటును తగ్గిస్తాయనేది ఆసక్తికరం. పైగా, గృహరుణాలపై వడ్డీ రేట్లను బ్యాంకులు తగ్గిస్తున్నాయా? లేదా? అనే విషయాన్ని కేంద్ర ప్రభుత్వం ఓ కంట కనిపెట్టాలి. తప్పనిసరిగా బ్యాంకులన్నీ రెపో రేటు తగ్గింపు ఫలాల్ని కొనుగోలుదారులకు అందేలా చర్యలు తీసుకోవాలి.

– వేణువినోద్, ఎండీ, సైబర్‌సిటీ డెవలపర్స్

---

# పశ్చిమానికే ఐకానియా..



ఐటీ కారిడార్ చేరువలో అన్ని రకాలుగా అనుకూలమైన ఇంటిలో నివసించాలని కోరుకుంటున్నారా? అయితే, మీకో చక్కటి ప్రత్యామ్నాయమే.. ఎస్ఎంఆర్ వినయ్ ఐకానియా. పశ్చిమ హైదరాబాద్‌లోని గచ్చిబౌలి చేరువలో గల కొండాపూర్‌లో.. మూడు వేల ఎకరాల సహజసిద్ధమైన అటవీ ప్రాంతం చుట్టుపక్కల.. దాదాపు 22 ఎకరాల సువిశాల విస్తీర్ణంలో నిర్మితమవుతున్న ఈ ప్రాజెక్టు గురించి ఎంత చెప్పినా తక్కువే అనొచ్చు. ఇందులో గరిష్ఠంగా 35 అంతస్తుల ఆకాశహర్మ్యాల్ని నిర్మిస్తున్నారు. ఇందులో ప్రత్యేకంగా హెలిప్యాడ్ సౌకర్యాన్ని అందుబాటులోకి తెస్తారు. దీంతో, పశ్చిమ హైదరాబాద్‌కే ప్రధాన ఆకర్షణగా ఎస్ఎంఆర్ ఐకానియా నిలుస్తోంది. హైదరాబాద్‌లో హైరైజ్ గేటెడ్ కమ్యూనిటీకీ సరికొత్త భాష్యం చెప్పిన ఎస్ఎంఆర్ బిల్డర్స్ నిర్మిస్తున్న ఈ ప్రాజెక్టు విశేషాల్ని తెలుసుకుంటే.. ఎవరైనా ఎగిరి గంతేయాల్సిందే. ఏమాత్రం ఆలస్యం చేయకుండా వెంటనే ఇందులో స్థిర నివాసాన్ని ఏర్పాటు చేసుకుంటారనడంలో ఎలాంటి సందేహం లేదు.

### చిరెక్ స్కూల్ తర్వాత..

కొండాపూర్‌లోని చిరెక్ స్కూల్ దాటిన తర్వాత నిర్మాణం జరుగుతున్న ఆకాశహర్మ్యమే.. ఎస్ఎంఆర్ వినయ్ ఐకానియా. ఇది గచ్చిబౌలి స్టేడియం నుంచి కాస్త ముందుకెళ్లి.. కుడివైపు తిరిగితే చాలు.. ఈ ప్రాజెక్టుకు చేరుకోవచ్చు. ఇందులో వచ్చే మొత్తం టవర్ల సంఖ్య.. దాదాపు పదకొండు. 2, 3, 4 పడక గదుల ఫ్లాట్లను ఇందులో ఎక్కువగా నిర్మిస్తున్నారు. వచ్చే మొత్తం ఫ్లాట్ల సంఖ్య.. 2,345. ఫ్లాట్ల విస్తీర్ణం 1400 నుంచి 2,925 చదరపు అడుగుల విస్తీర్ణంలో లభిస్తాయి. నిర్మాణం వచ్చేది కేవలం ఇరవై ఐదు శాతం స్థలంలోనే. మిగతా 75 శాతాన్ని ఖాళీగా కేటాయించారు. ఇందులో ఆధునిక సదుపాయాల్ని అభివృద్ధి చేయడంపై ఎస్ఎంఆర్ ప్రత్యేక దృష్టి సారిస్తున్నది. ఆధునిక రీతిలో క్లబ్‌హౌజ్‌ను అభివృద్ధి చేస్తున్నది.

### 2019లో మొదటి ఫేజు పూర్తి..

ఎస్ఎంఆర్ వినయ్ ఐకానియా మొదటి ఫేజులో దాదాపు 514 ఫ్లాట్లను నిర్మించారు. గత నాలుగు నెలల్నుంచి వీటిని కొనుగోలుదారులకు అందజేస్తున్నారు. ఇప్పటికే సుమారు నలభై కుటుంబాలు ఇందులో స్థిరనివాసాన్ని ఏర్పాటు చేసుకున్నాయి. 2019 సెప్టెంబరు కల్లా ఈ విడతను కొన్నవారికి అప్పగించేందుకు సంస్థ సన్నాహాలు చేస్తున్నది. అమెనిటీస్ అన్నీ సిద్ధమయ్యాయి. ఇందులో పార్కులు, ప్లే ఏరియాలు, వాకింగ్ ట్రాక్, గెస్ట్ పార్కింగ్, బైసైకిల్ స్టాండ్, బాస్కెట్‌బాల్ కోర్టులు, క్రికెట్ నెట్, ఔట్‌డోర్ జిమ్, గెస్ట్ లాబీ సెంటర్ వంటివి సిద్ధంగా ఉన్నాయి. మరో మూడు నెలల్లో క్లబ్‌హౌజ్‌లోని ఇండోర్ షటిల్ కోర్టులు, స్క్వాష్ కోర్టులు, టెర్రస్ స్విమ్మింగ్‌పూల్, జిమ్, బ్యాంకెట్ హాళ్లు, గెస్టు రూములు, టెన్నిస్ కోర్టులు వంటివి సిద్ధం చేస్తారు. వచ్చే పన్నెండు నెలల్లో షాపింగ్ సెంటర్ పూర్తి చేయడానికి ఎస్ఎంఆర్ సన్నాహాలు చేస్తున్నది.




● ఫేజు–2లో సుమారు 559 ఫ్లాట్లను సంస్థ నిర్మిస్తున్నది. ఇందుకు సంబంధించిన నిర్మాణ పనులు ఇప్పటికే యాభై శాతం పూర్తయ్యాయి. ఈ విడత నిర్మాణాన్ని 2020 డిసెంబరులోపు పూర్తి చేయడానికి సన్నాహాలు చేస్తున్నామని ఎస్ఎంఆర్ ఫస్ట్ హోల్డింగ్స్ ఎండీ ఎస్.రాంరెడ్డి తెలిపారు. హైదరాబాద్‌లో బహుళ అంతస్తులు, ఆకాశహర్మ్యాలకు సరికొత్త చిరునామాగా నిలిచే పలు ప్రాజెక్టుల్ని హైదరాబాద్ చుట్టుపక్కల ప్రాంతాల్లో ఇప్పటికే తీర్చిదిద్దామని ఆయన వివరించారు. ఈ ప్రాజెక్టు తమ ఎస్ఎంఆర్ చరిత్రలోనే ఐకానిక్ ప్రాజెక్టుగా నిలుస్తుందన్నారు. రానున్న రోజుల్లో హైదరాబాద్‌లోని పలు ప్రాంతాల్లో అనేక నిర్మాణాలు చేపట్టడానికి ప్రణాళికల్ని రచిస్తున్నామని వివరించారు. మియాపూర్ వద్ద సరికొత్త షాపింగ్‌మాల్ చేపడుతున్నామని, అందులో మల్టీప్లెక్స్ నిర్మిస్తున్నామని చెప్పారు.

---

# అగ్గువకే ఆధునిక ఫర్నీచర్?

**ఇంటి అందాన్ని ద్విగుణీకృతం చేయడంలో ఫర్నీచర్ కీలక పాత్ర పోషిస్తుంది. కాకపోతే, రేటెక్కువ పెట్టి ఆధునిక ఫర్నీచర్‌ను కొనుక్కోవడం అందరి వల్ల సాధ్యమయ్యే పని కాదు. కాస్త ముందుచూపుతో వ్యవహరిస్తే.. మన ఇంటి అందాన్ని రెట్టింపు చేసే ఫర్నీచర్‌ను సులువుగా ఎంపిక చేసుకోవచ్చు. అంతేకాదు, మనం అనుకున్న దానికంటే ఎంతో అగ్గువకు.. కుటుంబ సభ్యులకు అన్నిరకాలుగా నప్పే రకాల్ని ఎంచుకోవచ్చు. అదెలాగో తెలుసా?**



మనం కోరుకునే లగ్జరీ ఫర్నీచర్ కొనుగోలు చేసేందుకు అధిక మొత్తంలో ఖర్చు చేయాల్సిన అవసరం లేదు. నచ్చిన ఫర్నీచర్‌ను తక్కువ ధరలో సొంతం చేసుకోవడానికి మనం చేయాల్సిందల్లా.. కొంత సమయం కేటాయించాలంతే! దాదాపు అన్ని ఫర్నీచర్ కంపెనీలు ప్రతి సీజన్‌లో పాత స్టాకు స్థానంలో కొత్తవి విక్రయిస్తుంటాయి. అవి విక్రయించే సమయంలో పాత ఫర్నీచర్‌ను తగ్గింపు ధరలో అమ్మేస్తుంటాయి. కొన్ని లగ్జరీ ఫర్నీచర్ కంపెనీలైతే, ఏకంగా 70 నుంచి 80 శాతం వరకు భారీ తగ్గింపును అందజేస్తుంటాయి. అలాంటి సమయంలో లగ్జరీ ఫర్నీచర్ కొనుగోలు చేస్తే కొనుగోలుదారులకు ఎక్కువగా లాభం చేకూరుతుంది.

### చిన్న చిన్న లోపాలున్నా ఓకేనా?

అందుబాటులో ధరలో మనకు నచ్చిన లగ్జరీ ఫర్నీచర్ ఎంచుకోవడానికో ఉపాయం ఉంది. కనిపించని లోపాలున్న ఫర్నీచర్‌ను ఎంచుకుంటే కాస్త మేలు. సాధారణంగా, చిన్న గీతలు పడిన ఫర్నీచర్‌ను కొనడానికి కొంతమంది పెద్దగా ఆసక్తి చూపించరు. అందుకే, పరిమిత బడ్జెట్ ఉన్న ప్రజలు అలాంటి ఫర్నీచర్ కొనుగోలు చేయవచ్చు. ఫర్నీచర్ లోపాల్ని దాచేందుకు అనేక పద్ధతులున్నాయనే విషయాన్ని మర్చిపోవద్దు. ఇలాంటి ఫర్నీచర్ సాధారణంగా తక్కువ ధరకే కొనుగోలు చేయవచ్చు. బేరసారాలను సాగిస్తే.. మరింత తక్కువ ధరకే లగ్జరీ ఫర్నీచర్‌ను సొంతం చేసుకోవచ్చు. అందుబాటు ధరలో లగ్జరీ ఫర్నీచర్ కొనాలనే వారికిది ఎంతగానో ఉపయోగపడుతుందనే విషయాన్ని గుర్తుంచుకోండి.

### ఫర్నీచర్ బ్రాండ్ల పరిశోధన..


ఒక బ్రాండుకు చెందిన లగ్జరీ ఫర్నీచర్‌ను కొనుగోలు చేసే ముందు, ఇతర బ్రాండ్లలోని ఇదే ఫర్నీచర్ ధర, నాణ్యత వంటి అంశాలను పరిశీలించాలి. అప్పుడే తక్కువ రేటుకు నాణ్యమైన రకాల వివరాలపై అవగాహన పెరుగుతుంది. మార్కెట్లో అందుబాటులో ఉన్న లగ్జరీ బ్రాండ్లకు సంబంధించిన పూర్తి అవగాహన పెంచుకుంటేనే ఇది సాధ్యమవుతుంది. పలు బ్రాండ్లలోని ఫర్నీచర్ ధరలను పరిశీలించడం ద్వారా ఎక్కువ మొత్తంలో ఖర్చు చేయకుండా చౌకగా లగ్జరీ ఫర్నీచర్‌ను సొంతం చేసుకోవచ్చు.

### స్థిరమైన బడ్జెట్ కేటాయింపు..

అందుబాటు ధరలో లగ్జరీ ఫర్నీచర్ కొనుగోలు చేయాలని నిర్ణయించుకున్నప్పుడు దాని కోసం ఒక స్థిరమైన బడ్జెట్ కేటాయించుకోవడం ఎంతో ముఖ్యం. ఈ విషయం తెలియకుండా చాలామంది అనుకున్న దానికంటే ఫర్నీచర్‌కు ఎక్కువ సొమ్ము పెట్టేస్తుంటారు. అందుకే, మనమేం ఫర్నీచర్ కొనాలని అనుకుంటున్నాం.. ఏయే గదుల్లో ఏయే తరహా రకం కావాలనే విషయంలో ముందే అవగాహనకు రావాలి.. అంతేకాదు, దానికోసం బడ్జెట్ గురించి కూడా తుది నిర్ణయానికి రావాలి. ఇలా చేస్తేనే, ఇంటిని అన్నివిధాల నప్పే ఫర్నీచర్‌ను ఇట్టే కొనుగోలు చేయవచ్చు.

### డిస్కౌంట్‌లో కొనుగోలు మానుకోవాలి..

లగ్జరీ ఫర్నీచర్‌ను డిస్కౌంట్‌లో అందిస్తామని మోసం చేసే షోరూముల సంఖ్య ఇటీవల కాలంలో పెరిగాయి. ఇందులో కొంటే అట్టి వస్తువు మన్నికగా నిలుస్తుందనే విషయాన్ని కచ్చితంగా చెప్పలేం. అందుకే, డిస్కౌంట్ ఆశ చూపే దుకాణాల్లో అసలైన లగ్జరీ ఫర్నీచర్ బ్రాండ్ల పేరుతో నకిలీ ఫర్నీచర్‌ను విక్రయించే అవకాశం లేకపోలేదు. ఒకవేళ ఈ దుకాణాల్లో కొనుగోలు చేయడానికి సిద్ధపడినప్పుడు.. కొన్న వస్తువుకు దుకాణం నుంచి ఇచ్చే గ్యారంటీ కార్డును తప్పనిసరిగా తీసుకోవాలి. ఇలాంటి దుకాణాల్లో లగ్జరీ ఫర్నీచర్‌ను కొనుగోలు చేసేటప్పుడు చాలా జాగ్రత్త వహించాలనే విషయాన్ని గుర్తుంచుకోండి.









## 'ఫలక్‌నుమా దాస్-2'తో..



కరాటే రాజు, విశ్వక్‌సేన్, ప్రశాంతి

'హైదరాబాద్‌లోని 118లొకేషన్లలో మా చిత్రాన్ని తెరకెక్కించాం. ఈ సినిమా కోసం విశ్వక్‌సేన్ దాదాపు రెండు సంవత్సరాలు స్క్రిప్ట్ వర్క్ చేశాడు. 7రోజుల్లో 7కోట్ల 50లక్షలు వసూలు చేసింది' అన్నారు కరాటే రాజు. ఆయన నిర్మించిన చిత్రం 'ఫలక్‌నుమా దాస్'. విశ్వక్‌సేన్ కథానాయకుడిగా నటిస్తూ స్వీయదర్శకత్వంలో రూపొందించారు. ఇటీవలే ప్రేక్షకులముందుకొచ్చింది. ఈ సందర్భంగా శుక్రవారం సక్సెస్‌మీట్‌ను ఏర్పాటు చేశారు. నిర్మాత కరాటే రాజు మాట్లాడుతూ 'సెకండాఫ్ కొంచెం నిడివి ఎక్కువైందంటున్నారు. అందుకే కొంత ఎడిట్ చేశాం. నేటి నుంచి ఇది అమలవుతుంది. సినిమాకు 50థియేటర్లు పెరుగుతున్నాయి. త్వరలో భారీ తారాగణంతో 'ఫలక్‌నుమా దాస్-2' ద్వారా మీ ముందుకొస్తాం' అన్నారు. 'అన్ని అవాంతరాల్ని అధిగమించి సినిమా అద్భుతమైన ఆదరణ పొందుతున్నది. ప్రేక్షకుల అభిమానానికి కృతజ్ఞతలు. ఫలక్‌నుమా దాస్‌తో ధమ్కీ ఇచ్చాను. నా తర్వాతి సినిమాతో షాక్ ఇస్తా' అని కథానాయకుడు విశ్వక్‌సేన్ చెప్పారు. శివ, చందమామ సినిమాల తర్వాత తనకు ఈ సినిమాలో అంతటి గుర్తింపు తెచ్చిన పాత్ర దొరికిందని ఉత్తేజ్ ఆనందం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ప్రశాంతి, జీవన్, యశ్వంత్, సంజయ్‌టోనీ, కౌశిక్, కార్తీక్, వివేక్ తదితరులు పాల్గొన్నారు.



దిగాంగనా సూర్యవన్షీ

# సహజీవనం ఇష్టం ఉండదు!

**'తెలుగు పరిశ్రమ నా సొంత ఇల్లు అనే భావన కలుగుతున్నది. అభినయ ప్రధాన పాత్రల ద్వారా ప్రతిభావంతురాలైన నాయికగా గుర్తింపును తెచ్చుకోవాలన్నదే నా లక్ష్యం' అని చెప్పింది దిగాంగనా సూర్యవన్షీ. 'హిప్పీ' చిత్రం ద్వారా తెలుగు చిత్రసీమలోకి అరంగేట్రం చేసిందీ సుందరి. కార్తికేయ కథానాయకుడిగా టి.ఎన్.కృష్ణ దర్శకత్వంలో రూపొందిన ఈ చిత్రం ఇటీవలే ప్రేక్షకులముందుకొచ్చింది. ఈ సందర్భంగా చిత్ర కథానాయిక దిగాంగనా సూర్యవన్షీ శుక్రవారం హైదరాబాద్‌లో పాత్రికేయులతో ముచ్చటించింది. ఆమె చెప్పిన సంగతులివి...**

**బుల్లి తెరపై మంచి గుర్తింపు...**

హిందీ బుల్లితెరపై నేను మంచి గుర్తింపును సంపాదించుకున్నాను. నటనతో పాటు నాకు రచనలో కూడా ప్రవేశం ఉంది. హిందీ బిగ్‌బాస్-9 సీజన్‌లో పాల్గొన్నాను. బిగ్‌బాస్ షోలో ప్రవేశం పొందిన చిన్న వయస్కురాలిని నేనే. హిందీలో మూడు చిత్రాల్లో నటించాను. 'హిప్పీ' దక్షిణాదిలో నా తొలి చిత్రం. నేటి యువతీయువకుల మనోభావాలకు దర్పణంలా నిలిచే నవ్యమైన ప్రేమకథ ఇది. నా పాత్ర చిత్రణతో పాటు కథలోని భావోద్వేగాలు నచ్చడంతో సినిమాను అంగీకరించాను.

**నాదీ అదే మనస్తత్వం..**

'హిప్పీ' చిత్రంలో ఆధునిక భావాలు కలిగిన ఆముక్త మాల్యద అనే అమ్మాయి పాత్రను పోషించాను. ప్రియుడిని తన ఆధీనంలో ఉంచుకోవాలని తపించే అమ్మాయిగా కనిపిస్తాను. వ్యక్తిగత జీవితంలో కూడా నాలో అలాంటి డామినెంట్ లక్షణాలు కొన్ని ఉన్నాయి. అందుకే ఆముక్త మాల్యద పాత్రతో బాగా కనెక్ట్ అయ్యాను. ఈ సినిమాలో నటనాపరంగా భిన్న కోణాల్ని చూపించే అవకాశం దక్కింది. కథానాయకుడితో సమానమైన పాత్ర పోషించానని అందరూ ప్రశంసిస్తున్నారు.

**అది వ్యక్తుల మీద ఆధారపడి ఉంటుంది..**

ప్రేమ పేరుతో సహజీవనం నాకు నచ్చదు. అయితే వ్యక్తుల మనస్తత్వాలు, వారు ఉండే పరిస్థితులను బట్టి సహజీవనంలోని నైతికత ఆధారపడి ఉంటుంది. పరస్పరం ఇష్టపడుతూ అనుకోని కారణాల వల్ల వివాహం చేసుకోవడం ఆలస్యమయ్యే జంటలు సహజీవనం చేయడంలో అభ్యంతరం ఏమీ ఉండదు. కానీ ఒకరినొకరు తెలుసుకునే నెపంతో ఒక టెస్ట్‌డ్రైవ్‌లా సహజీవనం చేయాలనుకోవడం అర్థం లేనిది. భవిష్యత్తులో తెలుగు చిత్రసీమ రాణించాలనే నిశ్చయంతో ఉన్నాను. ప్రస్తుతం కొన్ని సినిమాలు చర్చల దశలో ఉన్నాయి. వాటి వివరాల్ని త్వరలో తెలియజేస్తాను.



## గ్రాండ్ ఓల్డ్ మ్యాన్ ఆఫ్ తెలుగు సినిమా

నిర్మాతగా, అసోసియేట్ ప్రొడ్యూసర్‌గా ఎన్నో విజయవంతమైన చిత్రాలకు పనిచేశారు టి.వి.ఎస్. శాస్త్రి. శనివారం ఆయన శతజయంతి. 1959లో మిత్రుడు వాసిరెడ్డి నారాయణరావుతో కలిసి 'జయభేరి' చిత్రాన్ని నిర్మించారు శాస్త్రి. సుమంగళి, పవిత్రబంధం, లక్ష్మీనివాసం, మంచివాడు, అండమాన్ అమ్మాయి, ఆత్మీయులు, శ్రీ రాజరాజేశ్వరి కాఫీ క్లబ్‌తో పాటు దాసరి నారాయణరావు దర్శకత్వం వహించిన పలు హిందీ చిత్రాలకు అసోసియేట్ నిర్మాతగా పనిచేశారు. 2007 డిసెంబర్ 20న టి.వి.ఎస్. శాస్త్రి కన్నుమూశారు. శాస్త్రిని కొంగర జగ్గయ్య గ్రాండ్ ఓల్డ్ మ్యాన్ ఆఫ్ తెలుగు సినిమాగా అభివర్ణిస్తే గాయకుడు పి.బి. శ్రీనివాస్ అద్వితీయ ప్రతిభాశాస్త్రిగా పిలిచేవారు.







